PRAJASAKTI Regd.No. 15795/68

సిటీ

ప్రజాశక్తి

ప్రతి అక్షరం ప్రజల పక్షం

Published from Vijayawada, Visakhapatnam, Kurnool, Tirupathi, Rajahmundry, Srikakulam, Ongole and Ananthapuramu

సంపుటి : 42 సంచిక : 264 | విజయవాడ, గురువారం 27 ఏప్రిల్ 2023 | 8 + 8 పేజీలు వెల : 5. 50

Vol No | Vijayawada, Thursday 27 April 2023 | Rs

దాహం... దాహం

- ప్రకాశం, కర్నూలు జిల్లాల్లో తీవ్ర నీటి ఎద్దడి
- మంత్రుల నియోజకవర్గాల్లోనూ తప్పనితిప్పలు
- రోడ్డెక్కుతున్న ప్రజలు

లోపలి పేజీలో..

ఆర్చరీ ప్రపంచకప్ ఫైనల్‌కు జ్యోతి సురేఖ అర్హత

లోపలి పేజీలో..

ఇంటర్ ఫలితాలు విడుదల చేస్తున్న మంత్రి బొత్స సత్యనారాయణ

ఇంటర్‌లో బాలికలదే హవా

- మొత్తం 66.5 శాతం ఉత్తీర్ణత
- కృష్ణా జిల్లా టాప్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

ఆంధ్రప్రదేశ్ ఇంటర్మీడియట్ పరీక్షా ఫలితాల్లో బాలికలే టాప్‌గా నిలిచారు. విజయవాడలోని ఓ హోటల్‌లో విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ ఇంటర్ ఫలితాలను బుధవారం విడుదల చేశారు. ఆయనతోపాటు ప్రిన్సిపల్ సెక్రటరీ ప్రవీణ్‌ప్రకాష్, కమిషనరు సురేష్‌కుమార్, సర్వశిక్ష ఎస్‌పిడి శ్రీనివాస్, మధ్యాహ్న భోజన పథకం డైరెక్టరు నిధిమీనా ఉన్నారు. ఇంటర్ మొదటి సంవత్సరం 61 శాతంతో 2,66,326 మంది, రెండో సంవత్సరం 72 శాతంతో 2,72,001 మంది సగటున 66.5 శాతం ఉత్తీర్ణులయ్యారు. బాలికలు మెరుగైన ఫలితాలు సాధించారు. మొదటి ఏడాది ఫలితాల్లో బాలికలు 65 శాతం, రెండో ఏడాది ఫలితాల్లో 75 శాతం సాధించారు. బాలురు మొదటి సంవత్సరంలో 58 శాతం, రెండో సంవత్సరంలో 68 శాతం సాధించారు. ఉమ్మడి జిల్లాలవారీ ఫలితాలను ప్రకటించారు. కృష్ణా జిల్లా అత్యధికంగా 83 శాతం ఉత్తీర్ణత సాధించగా, అత్యల్పంగా విజయనగరం జిల్లా 57 శాతం సాధించింది. గుంటూరు జిల్లా 78 శాతం, పశ్చిమ గోదావరి 77, నెల్లూరు 77, చిత్తూరు 72, విశాఖపట్నం 70, ప్రకాశం 70, తూర్పు గోదావరి 69, అనంతపురం 67, కర్నూలు 66, శ్రీకాకుళం 64, కడప 60 శాతం ఉత్తీర్ణత సాధించాయి. గత ఆరేళ్లతో పోల్చుకుంటే మెరుగైన ఫలితాలు సాధించారు. 2018లో 69 శాతం, 2019లో 68 శాతం, 2020లో 59 శాతం, 2021లో కోవిడ్ వల్ల విద్యార్థులందరినీ ఉత్తీర్ణులను చేశారు. అలాగే గతేడాది 61 శాతం ఉత్తీర్ణత సాధిస్తే.. ఈ ఏడాది 72 శాతం ఉత్తీర్ణత సాధించడం పట్ల మంత్రి బొత్స సత్యనారాయణ హర్షం వ్యక్తం చేశారు. రాష్ట్రంలో మార్చి 15 నుంచి ఏప్రిల్ 4వ తేదీ వరకు ఇంటర్ ప్రథమ, ద్వితీయ సంవత్సరపు పరీక్షలు జరిగిన విషయం తెలిసిందే. మొత్తం 8,13,033 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరయ్యారు. ఇందులో 4,84,197 మంది మొదటి సంవత్సరం, 3,79,750 మంది రెండో సంవత్సరం పరీక్షలకు హాజరయ్యారు.

ఒకేషనల్ కోర్సుల్లోనూ బాలికలదే పైచేయి

ఒకేషనల్ కోర్సులకు సంబంధించి మొదటి సంవత్సరంలో 36,031 మంది పరీక్షలకు హాజరుకాగా 49 శాతంతో 17,507 మంది ఉత్తీర్ణులయ్యారు. అలాగే రెండో సంవత్సరానికి సంబంధించి 31,293 మంది పరీక్షలకు హాజరుకాగా 62 శాతం ఉత్తీర్ణతతో 19,430 మంది ఉత్తీర్ణులయ్యారు. ఒకేషనల్ కోర్సుల్లోనూ బాలికలదే పైచేయి. మొదటి సంవత్సరం ఫలితాల్లో 58 శాతం బాలికలు ఉత్తీర్ణులైతే, బాలురు 37 శాతం మాత్రమే. రెండో సంవత్సరంలో బాలికలు 73 శాతం బాలురు 50 శాతం ఉత్తీర్ణత సాధించారు.

24 నుంచి సప్లిమెంటరీ పరీక్షలు

ఇంప్రూవ్‌మెంట్, ఉత్తీర్ణులు కాని విద్యార్థుల కోసం మే 24 నుంచి జూన్ 1 వరకు సప్లిమెంటరీ పరీక్షలను నిర్వహించనున్నట్లు మంత్రి బొత్స సత్యనారాయణ తెలిపారు. ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, మధ్యాహ్నం 2:30 నుంచి సాయంత్రం 5:30 వరకూ రెండు సెషన్లలో ఈ పరీక్షలను నిర్వహిస్తారు. ప్రాక్టికల్స్ జూన్ 5 నుంచి 9 వరకు జరుగుతాయి. సప్లిమెంటరీ ఫీజును మే 3లోపు చెల్లించాలి. జవాబు పత్రాలపై సందేహాలుంటే వెరిఫికేషన్, రీకౌంటింగ్ కోసం విద్యార్థులు మే 6లోపు దరఖాస్తు చేసుకోవాలి. పాఠ్య పుస్తకాలను ప్రైవేటు విద్యాసంస్థలు, విద్యార్థుల తల్లిదండ్రులు ఉచితంగా డౌన్‌లోడ్ చేసుకుని ప్రింటింగ్ చేసుకునేలా సాఫ్ట్‌కాపీని నెట్‌లో ఉంచామని తెలిపారు. ర్యాంకులతో కూడిన ప్రకటనలను ప్రైవేటు విద్యాసంస్థలు వేస్తే చర్యలు తీసుకుంటామన్నారు.

కొత్తగా 157 నర్సింగ్ కాలేజీలు

- కేంద్ర మంత్రివర్గం ఆమోదం

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

ప్రస్తుతమున్న వైద్య కళాశాలల కో-లొకేషన్‌లో 157 కొత్త నర్సింగ్ కళాశాలల ఏర్పాటుకు కేంద్ర మంత్రివర్గం ఆమోదం తెలిపింది. ఈ మేరకు బుధవారం ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ అధ్యక్షతన ఆర్థిక వ్యవహారాల కేబినెట్ కమిటీ సమావేశం జరిగింది. ప్రస్తుతమున్న మెడికల్ కాలేజీలతో కో-లొకేషన్‌లో రూ.1,570 కోట్లతో 157 కొత్త నర్సింగ్ కాలేజీల ఏర్పాటుకు ఆర్థిక వ్యవహారాల కేబినెట్ కమిటీ ఆమోదం తెలిపింది. దీంతో ప్రతి సంవత్సరం సుమారు 15,700 నర్సింగ్ గ్రాడ్యుయేట్లు చేరుతారని అంచనా వేసింది. దేశంలో ముఖ్యంగా వెనుకబడిన జిల్లాలు, రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల్లో నాణ్యమైన, సరసమైన, సమానమైన నర్సింగ్ విద్యను మరింత నిర్ధారిస్తుంది.

వైద్య పరికరాల రంగానికి సంబంధించిన జాతీయ వైద్య పరికరాల విధానం-2023కి కేంద్ర మంత్రివర్గం ఆమోదించింది. వచ్చే ఐదేళ్లలో వైద్య పరికరాల రంగం ప్రస్తుత 11 బిలియన్ల డాలర్ల నుంచి 50 బిలియన్ల డాలర్లకు పెరగడానికి పాలసీ సహాయపడుతుందని కేంద్ర ప్రభుత్వం తెలిపింది.

ముఖ్యమంత్రికి నిరసన సెగ

- కాన్వాయ్‌ను అడ్డుకునేందుకు యత్నించిన రైతులు

లోపలి పేజీలో..

తగ్గిన డ్రాపవుట్స్

పెరిగిన ప్రాథమిక, ఇంజనీరింగ్ విద్యార్థుల సంఖ్య

- మరోమారు మోసపు మాటలతో చంద్రబాబు వస్తున్నారు జాగ్రత్త!
- ప్రజలే నా నమ్మకం : 'వసతి దీవెన'లో ముఖ్యమంత్రి జగన్

విద్యార్థులకు వసతి దీవెన మెగా చెక్కును అందిస్తున్న ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి

ప్రజాశక్తి- అనంతపురం ప్రతినిధి

రాష్ట్రంలో డ్రాపవుట్స్ తగ్గాయని, ప్రాథమిక విద్యనభ్యసిస్తున్న విద్యార్థుల సంఖ్య ప్రభుత్వ పాఠశాలల్లో 37 లక్షల నుంచి 40 లక్షలకు పెరిగిందని ముఖ్యమంత్రి వైఎస్.జగన్మోహన్‌రెడ్డి తెలిపారు. ప్రయివేటు విద్యా సంస్థలే ప్రభుత్వ పాఠశాలలతో పోటీపడే పరిస్థితులను తీసుకొస్తున్నట్టు వివరించారు. నయవంచన, మోసం, వెన్నుపోటుకు ప్రసిద్ధి అయిన మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు... పంచతంత్ర కథలోని ముసలి పులి తరహాలో అబద్ధాలతో మరోసారి ప్రజల ముందు వస్తున్నారని విమర్శించారు. అనంతపురం జిల్లా నార్పల మండలం కేంద్రంలో వసతి దీవెన పంపిణీ సందర్భంగా జరిగిన బహిరంగ సభలో జగన్ మాట్లాడుతూ, రాష్ట్రంలో గతంలో ఎన్నడూలేని విధంగా విద్యా విధానంలో సమూలమైన మార్పులు తీసుకొస్తున్నామన్నారు. వచ్చే విద్యా సంవత్సరం నుంచి మొదటి విడత నాడు-నేడు పనులు పూర్తయిన 30,232 పాఠశాలల్లో ఇంటరాక్టివ్ ఫ్లాట్ ప్యానల్స్ ద్వారా డిజిటల్ విద్యా బోధన తీసుకురానున్నామని తెలిపారు. దీన్ని చూసి ప్రయివేటు విద్యా సంస్థలు సైతం ఈ పద్ధతిని పాటించాల్సి వస్తుందన్నారు. ఉన్నత విద్యా విధానంలోనూ అనేక మార్పులు తీసుకొచ్చామన్నారు. కరికులంలో మార్పులు తీసుకురావడమే కాకుండా అంతర్జాతీయ పోటీని తట్టుకుని నిలబడే విధంగా ఉన్నత విద్యా విధానాన్ని తీసుకొస్తున్నామని తెలిపారు. ఇంజనీరింగ్ విద్యార్థుల సంఖ్య 87 వేల నుంచి 1.20 లక్షలకు పెరిగిందన్నారు. ఉన్నత విద్యలో తీసుకొస్తున్న మార్పులతో అంతర్జాతీయంగా కూడా మన రాష్ట్ర విద్యార్థులు రాణించాలని ఆకాంక్షించారు. ఇప్పుడు చెప్పుకోవడానికి మన రాష్ట్రం నుంచి ఒక్క సత్య నాదేళ్లనే ఉన్నారని, ఆయనలా అందరూ ఎదగాలని అన్నారు. రాష్ట్రంలో ఎన్నికలు సమీస్తుండడంతో చంద్రబాబునాయుడు మాయమాటలతో మరోమారు ప్రజల ముందుకొచ్చేందుకు వస్తున్నారని విమర్శించారు. పంచచంత్రంలోని పులి-బంగారు కడియం కథలా ఇక్కడ కూడా ఒక ముసలి పులి ఉందని... అది ఎవరో కాదు... చంద్రబాబునాయుడని దుయ్యబట్టారు. 2014 ఎన్నికలకు ముందు ఇదే రకమైన హామీ ఇచ్చినా వాటిని అమలు చేయలేదని గుర్తు చేశారు. మళ్లీ అవే హామీలతో ముందుకు వస్తున్న ఆయనను నమ్మవద్దని జగన్ ప్రజలను కోరారు. చంద్రబాబుకు మరికొంతమంది మోసగాళ్లు తోడయ్యారని విమర్శించారు. తాను ఒంటరి పోరాటానికి సిద్ధంగా ఉన్నానన్నారు. రాబోయే కురుక్షేత్ర సంగ్రామంలో నాకు తోడుగా నిలిచేది మీరేనన్న నమ్మకం తనకుందని ప్రజలనుద్దేశించి అన్నారు. అనంతరం బటన్ నొక్కి వసతి దీవెన కార్యక్రమం కింద 9.55 లక్షల మంది లబ్ధిదారుల ఖాతాల్లో రూ.912.71 కోట్లను జగన్ జమచేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, విద్యా శాఖ మంత్రి బొత్స సత్యనారాయణ, స్త్రీ శిశు సంక్షేమ శాఖ మంత్రి ఉషచరణ్ శ్రీతో పాటు జిల్లా ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

హెలికాప్టర్‌లో సాంకేతిక సమస్య... రోడ్డు మార్గంలోనే తిరుగు ప్రయణం

వసతి దీవెన కార్యక్రమం ముగిసిన తరువాత ముఖ్యమంత్రి హెలిప్యాడ్ వద్ద జిల్లా నాయకులతో ముచ్చటించారు. జిల్లాలోని సమస్యలను తెలుసుకున్నారు. అనంతరం తిరుగు ప్రయాణం అవడానికి హెలికాప్టర్ ఎక్కాక సాంకేతిక సమస్యతో అది మొరాయించింది. దీంతో, ఆయన రోడ్డు మార్గంలో పుట్టపర్తికి చేరుకున్నారు. అక్కడి నుంచి ప్రత్యేక విమానంలో గన్నవరానికి బయలుదేరారు.

స్పృహ తప్పిన ఇద్దరు

ముఖ్యమంత్రి వైఎస్.జగన్మోహన్‌రెడ్డి నార్పల బహిరంగ సభలో ఇద్దరు స్పృహ తప్పి కిందపడిపోయారు. ఎస్‌ఎల్‌ఎన్ విద్యా సంస్థలో చదువుతున్న పూజితారెడ్డి అనే విద్యార్థిని స్పృహ తప్పిపడిపోయింది. తోటి విద్యార్థులు వెంటనే ఆమెను వేదిక వద్ద ఏర్పాటు చేసిన ఆరోగ్య శిబిరంలోకి తీసుకెళ్లి వైద్యులు చికిత్స చేయించారు. మరో మహిళ కూడా ఇదే రకంగా పడిపోయారు. ఆమెకూ చికిత్స అందించారు.

బిజెపిని గద్దె దింపకపోతే.... దేశ భవిష్యత్ అంధకారం

- స్టీల్‌ప్లాంట్ పరిరక్షణకు మోడీ సర్కార్ పోవాలి
- బిజెపి పల్లకిని వైసిపి, టిడిపి, జనసేన భుజాల నుంచి దించాలి
- ప్రచారభేరి సభలో రాఘవులు, నారాయణ

ప్రచార భేరి సభలో అభివాదం చేస్తున్న నాయకులు

ప్రజాశక్తి- గ్రేటర్ విశాఖ బ్యూరో

దేశంలో 2024లో జరిగే ఎన్నికల్లో బిజెపిని ఓడిస్తేనే దేశానికి పట్టిన మోడీ, అదానీ పీడ వదులుతుందని, స్టీల్‌ప్లాంట్‌కు రక్షణ అని, లేదంటే దేశ భవిష్యత్ అంధకారంలో పడుతుందని సిపిఎం పొలిట్ బ్యూరో సభ్యులు బివి.రాఘవులు అన్నారు. రాష్ట్రంలోని వైసిపి, టిడిపి, జనసేన పార్టీలు మోడీని భుజాలపై మోస్తున్నాయని, ఆ పల్లకీని దించి రాష్ట్ర భవిష్యత్ కోసం రాజకీయ పోరాటంలో కలసి రావాలని ఆయన పిలుపునిచ్చారు. స్టీల్‌ప్లాంట్ అమ్మకాన్ని తక్షణం కేంద్ర ప్రభుత్వం ఆపాలని' కోరుతూ విశాఖలోని కూర్మన్నపాలెం స్టీల్‌ప్లాంట్ ఆర్చ్ వద్ద సిపిఎం, సిపిఐ ఆధ్వర్యాన బుధవారం సాయంత్రం భారీ బహిరంగ సభ జరిగింది. ఈ సభలో రాఘవులు మాట్లాడుతూ, దేశంలోని పలు రాష్ట్రాల్లో బిజెపి ప్రయివేటీకరణ విధానాలను అర్థం చేసుకుని పలు పార్టీలు బయటకొస్తున్నా, ఆంధ్రప్రదేశ్‌లో మాత్రం వైసిపి, టిడిపి, జనసేన అంటకాగడం ఆందోళన కలిగిస్తోందన్నారు. ఇదే కొనసాగితే రాష్ట్ర ద్రోహులుగా ఈ పార్టీలు మిగిలిపోక తప్పదని హెచ్చరించారు. రాజ్యాంగాన్ని పాతిపెట్టాలని బిజెపి చూస్తోందని, ప్రజాస్వామ్యం, మతసామరస్యం, సామాజిక న్యాయం, సమాఖ్య స్ఫూర్తి (రాష్ట్రాల హక్కుల)పై దాడులు చేస్తూ ప్రభుత్వ రంగాన్ని నాశనం చేస్తోందని దుయ్యబట్టారు. దేశం అభివృద్ధి చెందుతోందంటూ బిజెపి నేతలు ఊదరగొడుతున్నారని, వైజాగ్ స్టీల్‌ప్లాంట్ లాంటివి ఇంకా అనేకం దేశంలో రావాల్సి ఉండగా ఉన్న దాన్ని అమ్మేయాలని చూడడం ఏం అభివృద్ధి అని ప్రశ్నించారు. 804 రోజుల నుంచి కార్మికులు చేస్తోన్న పోరాటం రాజకీయ పోరాటంగా మారేందుకు రాష్ట్రంలోని బిజెపియేతర పార్టీలన్నీ కలిసి రావాలని పిలుపునిచ్చారు.

సిపిఐ జాతీయ సమితి కార్యదర్శి కె.నారాయణ మాట్లాడుతూ, రాష్ట్రంలో బిజెపి, వైసిపి కలిసి ముందుకు సాగుతున్నాయని విమర్శించారు. విశాఖ ఉక్కు ఆంధ్రుల హక్కు అనే నినాదంతో వచ్చిన ఈ ప్లాంట్ కోసం రైతులు భూములను త్యాగం చేయగా, ప్రజలు ప్రాణాలు అర్పించారని గుర్తు చేశారు. దేశంలో మోడీకి 30 మంది దత్తపుత్రులుండగా, వారిలో 29 మంది దేశం వదిలి విదేశాలకెళ్లిపోయారన్నారు. ఆదానీ మాత్రం దేశంలోనే ఉండి మోడీ సహకారంతో దేశ సంపద రూ.లక్షల కోట్లు కొల్లగొడుతున్నాడని దుయ్యబట్టారు. సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు కె.లోకనాథం మాట్లాడుతూ, విశాఖలో ప్రభుత్వ రంగాన్ని ధ్వంసం చేసేందుకు

మిగతా 7లో

మావోయిస్టుల మందుపాతర పేలి

10 మంది జవాన్లు మృతి

- డ్రైవర్ కూడా

ప్రజాశక్తి - చింతూరు (అల్లూరి సీతారామరాజు జిల్లా)

ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలోని దంతెవాడ జిల్లాలో మావోయిస్టులు అమర్చిన మందుపాతర పేలి డ్రైవర్‌తో సహా 11 మంది డిఆర్‌జి జవాన్లు అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయారు. ఆపరేషన్ అభియాన్‌లో భాగంగా జవాన్లు కూంబింగ్ ముగించుకుని తిరిగి వస్తున్న క్రమంలో బుధవారం మధ్యాహ్నం ఈ ఘటన చోటుచేసుకుంది. పోలీసు ఉన్నతాధికారులు వెల్లడించిన వివరాల ప్రకారం... జవాన్లు కూంబింగ్ ముగించుకుని వాహనంలో వస్తున్నారు. వారిని లక్ష్యంగా చేసుకుని హారంపూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో రహదారి మధ్యలో మావోయిస్టులు భారీ ఐఇడి మందు పాతరను అమర్చి వాహనం రాగానే పేల్చి వేశారు. వాహనంలోని జవాన్లు జోగా సోధి, మున్నా రామ్ కడ్తి, సంతోష్ తమో, దుల్గో మాండవి, లక్ష్మ మార్కం, జోగా కవాసి, హరిరామ్ మాండవి, రాజు రామ్ కర్తమ్, జైరాం పొడియం, జగదీష్ కవాసి, డ్రైవర్ ధనిరామ్ యాదవ్ దుర్మరణం చెందారు. పేలుడు ధాటికి వాహనం తునాతునకలైంది. రహదారి మధ్యలో పెద్ద గుంత ఏర్పడింది. బస్తర్ రేంజ్ డిఐజి పి.సుందర్‌రాజ్ పోలీసు బలగాలను అప్రమత్తం చేశారు. మృతదేహాలను రాయపూర్ ఏరియా ఆస్పత్రికి తరలించారు. ఘటనపై ఛత్తీస్‌గఢ్ ముఖ్యమంత్రి భూపేష్ భగేల్ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. మృతుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి ప్రకటించారు.

కొంతకాలంగా అలజడిగా దండకారణ్యం

ఆపరేషన్ అభియాన్ పేరుతో కొంతకాలంగా మావోయిస్టుల ఏరివేత కోసం దండకారణ్యంలో పోలీసులు కూంబింగ్ చర్యలు చేపడుతున్నారు. కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్ షా పర్యటనను వ్యతిరేకిస్తూ ఇటీవల భారీ ర్యాలీలు జరిగాయి. ఆపరేషన్ అభియాన్‌ను ఎత్తివేయాలని మావోయిస్టులు పలుమార్లు హెచ్చరికలు కూడా జారీ చేశారు. దండకారణ్యంపై డ్రోన్ దాడులు అధికమైన నేపథ్యంలో తాజా దాడి జరిగినట్టు తెలుస్తోంది.

ఇటీవల కాలంలో జరిగిన ప్రధాన దాడులు

2021 ఏప్రిల్‌లో బీజాపూర్, సుక్మా జిల్లాల సరిహద్దుల్లో జరిగిన పోరులో 22మంది భద్రతా సిబ్బంది మరణించారు. 2018 మార్చిలో 9మంది, 2017లో మార్చిలో 12మంది, ఏప్రిల్‌లో 24మంది సిఆర్‌పిఎఫ్ జవాన్లు మరణించారు. 2013 మేలో దర్బా లోయలో మావోయిస్టుల దాడిలో కాంగ్రెస్ పార్టీకి చెందిన 25మంది చనిపోయారు.

రాష్ట్రాభివృద్ధి, సంక్షేమంపై చంద్రబాబుకు చిత్తశుద్ధి లేదు

- సిపిఎం రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాసరావు

లోపలి పేజీలో..

బిజెపికి ఓటమే!

- ఓటింగ్‌పై అవినీతి, ధరల పెరుగుదల, నిరుద్యోగం ఎఫెక్ట్
- సర్వేలో వెల్లడించిన కన్నడ ఓటరు

లోపలి పేజీలో..

స్టేట్ సిలబస్‌లో ఎన్‌సిఇఆర్‌టి తొలగించిన పాఠ్యాంశాలు కేరళ నిర్ణయం

పాడేరు ఘాట్‌లో రోడ్డు ప్రమాదం

- ముగ్గురు దుర్మరణం

ప్రజాశక్తి - పాడేరు (అల్లూరి సీతారామరాజు జిల్లా)

విశాఖ జిల్లా పాడేరు ఘాట్‌లో బుధవారం రాత్రి ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. వంట్లమామిడి సమీపంలోని కోమలమ్మ పనుకు దగ్గర ఉన్న మలుపులో కారు లోయలోకి బోల్తా పడటంతో ముగ్గురు దుర్మరణం చెందారు. వీరిలో భార్యాభర్తలు ఉన్నారు. పోలీసులు తెలిపన వివరాల ప్రకారం.. విశాఖపట్నంకు చెందిన భార్యభర్తలు సుబ్బారావు, మహేశ్వరి, వారి సమీప బంధువు పూర్ణచంద్రరావుతో కలిసి కారులో డ్రైవర్‌ను వెంట తీసుకొని ముంచింగిపుట్టు మండలం కిలగడ గ్రామంలో జరిగిన గిరిజన జాతరకు వచ్చారు. జాతర ముగిసిన అనంతరం బుధవారం రాత్రి విశాఖ వెళ్తుండగా కోమలమ్మ పనుకు సమీపంలో మలుపు వద్ద కారు బోల్తా కొట్టింది. సుమారు 20 అడుగుల దిగువన ఉన్న లోయలోకి కారు పడిపోవడంతో కారు డ్రైవర్‌తోపాటు మహేశ్వరి అక్కడికక్కడే మృతి చెందారు. తీవ్రంగా గాయపడిన సుబ్బారావు, పూర్ణచంద్రరావును 108 వాహనంలో పాడేరు జిల్లా ఆసుపత్రికి తరలించారు. సుబ్బారావు ఆస్పత్రిలో చేరేసరికి మృతి చెందారు. సుబ్బారావు విశాఖపట్నంలోని ఎల్ఐసి కార్యాలయంలో ఎఒగా విధులు నిర్వహిస్తున్నారు.

మహారాష్ట్ర రైతుల పోరుబాట

హామీల అమల్లో రాష్ట్రప్రభుత్వం విఫలం • డిమాండ్ల సాధనకు లాంగ్ మార్చ్ ప్రారంభం

ముంబయి : అకాల వర్షాలు, వడగళ్ళ దాడిలో నష్టపోయిన పంటలకు నష్టపరిహారం చెల్లించాలన్న డిమాండ్‌కు రాష్ట్ర ప్రభుత్వం స్పందించకపోవడంతో మహారాష్ట్ర రైతాంగం మళ్ళీ పోరాట బాట చేపట్టింది. 38రోజుల పాటు వేచి వున్న తర్వాత అఖిల భారత కిసాన్ సభ (ఎఐకెఎస్) ఆధ్వర్యంలో అహ్మద్‌నగర్‌లో రైతులు మళ్లీ లాంగ్ మార్చ్‌ను ప్రారంభించారు. తమ చివరి నెత్తుటి చుక్కవరకు పోరాటం సాగిస్తామని ప్రతిన చేశారు. తమతో రాష్ట్ర ప్రభుత్వం కుదుర్చుకున్న ఒప్పందాన్ని అమలు చేయాలని వారు డిమాండ్ చేస్తున్నారు. ధన్విరి, పాల్ఘర్ జిల్లాల్లో ప్రజలపై పోలీసుల వేధింపు చర్యలను ఆపాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు. తగిన నష్టపరిహారం ఇవ్వకుండానే, ముంబయి-వదోదర ఎక్స్‌ప్రెస్‌వే నిర్మాణం కోసం పేదల ఇళ్ళను కూల్చివేశారని, పైగా నష్టపరిహారం అడిగినందుకు వారిని అరెస్టు చేశారని విమర్శించారు. రత్నగిరి జిల్లాలో చమురు శుద్ధి కర్మాగారం నిర్మాణానికి నిరసన తెలిపినందుకు అరెస్టు చేసిన వారిని వెంటనే విడుదల చేయాలని వారు డిమాండ్ చేస్తున్నారు. భూ సేకరణ కోసం పోలీసులు, ప్రజలను వేధించబోరని, రైతుల డిమాండ్లపై సానుకూల నిర్ణయం తీసుకుంటామని ఇచ్చిన హామీని ప్రభుత్వం తుంగలో తొక్కినందునే రైతులు మళ్లీ రోడ్డెక్కాల్సి వచ్చిందని ఎఐకెఎస్ అధ్యక్షుడు అశోక్ ధావలె తెలిపారు. తమ జీవనోపాధిని కోల్పోయి, ఆందోళన చేస్తున్న వారితో పోలీసులు చాలా దురుసుగా వ్యవహరిస్తున్నారని విమర్శించారు. గత రెండేళ్లలో అతివృష్టి, అనావృష్టితో రాష్ట్రంలో పంటలు నాశనమయ్యాయని ఇందుకు గాను రైతులకు నష్టపరిహారం విమర్శించారు. రైతులకు, వ్యవసాయ కార్మికులకు ఇచ్చిన హామీల్లో ఏ ఒక్కటి ఇంతవరకు అమలు కాలేదని అన్నారు.

ఎఐకెఎస్ ఆధ్వర్యంలో అహ్మద్‌నగర్‌లో రైతులు ప్రారంభించిన లాంగ్ మార్చ్

వేధింపులు ఆపకపోతే ప్రతిఘటన తప్పదు

- వాస్తవాలతో ప్రజలముందుకు వెళ్తాం : ఫ్యాప్టో

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

విద్యాశాఖలో ఉద్యోగులు, ఉపాధ్యాయులపై వేధింపులను ఆపకపోతే ప్రభుత్వానికి ప్రతిఘటన తప్పదని ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యాయ సంఘాల సమాఖ్య (ఫ్యాప్టో) హెచ్చరించింది. ఉపాధ్యాయులతో నిరంతరం బోధనేతర పనులు చేయిస్తూ.. విద్యార్థులకు బోధన చేయడం లేదని అవమానించడం, శిక్షించడం వంటి చర్యలను విద్యాశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ ప్రవీణ్ ప్రకాష్ మానుకోవాలని డిమాండ్ చేశారు. విజయవాడలోని యుటిఎఫ్ కార్యాలయంలో బుధవారం జరిగిన మీడియా సమావేశంలో ఫ్యాప్టో ఛైర్మన్ ఎన్ వెంకటేశ్వర్లు, సెక్రటరీ జనరల్ సి హెచ్ మంజుల, నాయకులు హెచ్ తిమ్మన్న, ఎస్ చిరంజీవి మాట్లాడారు. ఉపాధ్యాయులతో నిరంతరం బోధనేతర పనులు చేయిస్తూ.. విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించలేదనే నెపంతో షోకాజ్ నోటీసులు, సస్పెన్షన్‌లను విధించడం తగదన్నారు. ఉపాధ్యాయులతో రోజూ 60 రకాల రికార్డులు, 16 రకాల యాప్‌లను అప్‌లోడ్ చేయాలనే నిబంధనలు పెట్టడం సరికాదన్నారు. నెట్ సమస్యలతో అప్‌లోడ్ కావడం లేదనే బెంగతోనే రోజంతా టీచర్లు పనిచేయాల్సిన పరిస్థితులు వున్నాయని తెలిపారు. పూర్తి స్థాయిలో డిఇఒలు, ఎంఇఒలు లేకుండా ఎలా నాణ్యమైన విద్య అందుతుందో ప్రభుత్వం చెప్పాలని డిమాండ్ చేశారు. టీచర్లు పనిచేయడం

మిగతా 2లో

రెజ్లర్లను వేధించిన ఎంపిపై చర్యలు కోరుతూ నేడు నిరసనలు

- సిఐటియు

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

లైంగిక వేధింపులకు పాల్పడిన రెజ్లర్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా అధ్యక్షులు, బిజెపి ఎంపి బ్రిజ్‌భూషణ్ శరణ్‌సింగ్‌ను అరెస్టు చేయాలని కోరుతూ.. ఈ నెల 27న దేశ వ్యాప్తంగా నిరసనలు చేపడుతున్నట్లు సిఐటియు రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎవి నాగేశ్వరరావు, సిహెచ్ నర్సింగరావు పేర్కొన్నారు. ఈ మేరకు బుధవారం ఒక ప్రకటన విడుదల చేశారు. దేశంలోని రెజ్లర్లు ఢిల్లీలోని జంతర్‌మంతర్ వద్ద గత నాలుగు రోజులుగా చేపట్టిన నిరసన కార్యక్రమానికి మద్దతుగా సిఐటియు, ఎఐకెఎస్, ఎఐఎడబ్ల్యుయు, ఐద్వా, డివైఎఫ్ఐ, ఎస్ఎఫ్ఐ దేశ వ్యాప్త నిరసనలకు పిలుపునిచ్చాయని తెలిపారు. లైంగిక వేధింపులకు పాల్పడిన బిజెపి ఎంపిపై చర్యలు తీసుకోవాలని రెజ్లర్లు ఫిర్యాదు చేసినప్పటికీ పోలీసులు ఇంతవరకు ఆయనపై ఎఫ్ఐఆర్ నమోదు చేయలేదని పేర్కొన్నారు. ప్రభుత్వం తక్షణమే బ్రిజ్‌భూషణ్ శరణ్ సింగ్‌పై పోక్సో చట్టం కింద కేసు రిజిస్టర్ చేయాలని సిఐటియు నేతలు డిమాండ్ చేశారు.

సిపిటి మరోసారి నిర్వహించాలి

- జానీపాషా

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

గ్రామ, వార్డు సచివాలయాల్లోని గ్రేడ్-5 పంచాయతీ కార్యదర్శులు, గ్రేడ్-2 గ్రామ రెవెన్యూ అధికారులకు మరోసారి కంప్యూటర్ ప్రొఫీసియన్సీ టెస్ట్ (సిపిటి) మరోసారి నిర్వహించాలని రాష్ట్ర ప్రభుత్వానికి గ్రామ, వార్డు సచివాలయ ఎంప్లాయీస్ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షులు ఎమ్‌డి జానీపాషా విజ్ఞప్తి చేశారు. విజయవాడలోని ఎపిపిఎస్‌సి కార్యాలయంలో ఎపిపిఎస్‌సి సెక్రటరీ జె ప్రదీప్ కుమార్‌కు బుధవారం వినతిపత్రం సమర్పించారు. రాష్ట్ర వ్యాప్తంగా 1700 మంది డిపార్టుమెంటల్ పరీక్షల్లో ఉత్తీర్ణత కాలేదని, వీరికి పరీక్షలు నిర్వహించడంతోపాటు గ్రామ సర్వే అసిస్టెంట్లకు సర్వే టెస్ట్ పేపర్ కోడ్ 167 మరోసారి నిర్వహించాలని కోరుతూ పబ్లిక్ సర్వీస్ కమిషన్ కార్యదర్శి, సభ్యులు సలాంబాబుకు కూడా మరో వినతిపత్రాన్ని అందజేశారు. సాధ్యమైనంత త్వరగా పరీక్షలు నిర్వహిస్తామని తెలిపినట్లు జానీపాషా పేర్కొన్నారు. ఎపిపిఎస్‌సి సభ్యులను కలిసిన వారిలో ఫెడరేషన్ రాష్ట్ర కమిటీ సభ్యులు జి నవీన్‌కుమార్ ఉన్నారు.

ముఖ్యమంత్రికి నిరసన సెగ

- కాన్వాయ్‌ను అడ్డుకునేందుకు యత్నించిన రైతులు

ప్రజాశక్తి- ధర్మవరం టౌన్ (శ్రీ సత్యసాయి జిల్లా)

ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డికి రైతుల నిరసన సెగ తగిలింది. నార్పలలో వసతి దీవెన కార్యక్రమం ముగిసిన అనంతరం హెలిప్యాడ్ మొరాయించడంతో ముఖ్యమంత్రి రోడ్డు మార్గాన పుట్టపర్తికి బయలుదేరారు. ఈ సమయంలో శ్రీ సత్యసాయి జిల్లా ధర్మవరం మండలంలోని తుంపర్తి, మోటుమర్ల గ్రామాల రైతులు తమకు అదనపు పరిహారం అందజేయాలని డిమాండ్ చేస్తూ సిఎం కాన్వాయ్‌ను పోతులనాగేపల్లి లేఅవుట్ వద్ద అడ్డుకునే ప్రయత్నం చేశారు. తమకు న్యాయం చేయాలంటూ సిఎం కాన్వాయ్‌కు అడ్డుగా వెళ్లారు. సిఎం సెక్యూరిటీ సిబ్బంది, పోలీసులు వెంటనే అప్రమత్తమై రైతులను పక్కకు నెట్టేశారు. అనంతరం కాన్వాయ్ ముందుకు వెళ్లిపోయింది. రైతులు ఆందోళన చేస్తున్నా ముఖ్యమంత్రి స్పందించకుండా వెళ్లిపోయారు.

అదనపు పరిహారం ఇవ్వకుండా అన్యాయం చేశారు : బాధిత రైతులు

వైసిపి అధికారంలోకి వస్తే పరిహారం పెంచి ఇస్తామని చెప్పి హామీ ఇచ్చిన నాయకులు అధికారంలోకి రాగానే దాని గురించి పట్టించుకోకుండా అన్యాయం చేశారంటూ బాధిత రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. ముఖ్యమంత్రి కాన్వాయ్ వెళ్లిన తరువాత రైతులు వెంకట రాముడు, ఆంజనేయులు, లక్ష్మీనారాయణ, శ్రీనివాసులు, తిమ్మక్క తిమ్మక్క తదితరులు మాట్లాడుతూ గతంలో టిడిపి హయాంలో అప్పటి ఎమ్మెల్యే గోనుగుంట్ల సూర్యనారాయణ ఇళ్ల స్థలాల కోసం మోటుమర్ల, తుంపర్తి గ్రామ పొలాలను సేకరించారని తెలిపారు.

ఏళ్ల తరబడి సాగులో ఉన్న భూములను తీసుకుని ఎకరాకు రూ.10 లక్షలు మాత్రమే ఇచ్చారన్నారు. అప్పుడు ప్రతిపక్షంలో ఉన్న ప్రస్తుత ధర్మవరం ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి తాము అధికారంలోకి వచ్చాక పరిహారం ఎక్కువ ఇప్పిస్తామని హామీ ఇచ్చారని తెలిపారు. అధికారంలోకి వచ్చి నాలుగేళ్లు అవుతున్నా అదనంగా ఒక్క రూపాయి కూడా పరిహారం ఇవ్వలేదన్నారు. ఈ సమస్యను ముఖ్యమంత్రికి విన్నవిద్దామనుకున్నామని, ముఖ్యమంత్రి సెక్యూరిటీ, పోలీసులు నిర్ధాక్షిణ్యంగా తమను పక్కకు తోసేశారని బాధిత మహిళా రైతులు తిమ్మక్క, గంగమ్మ కన్నీటి పర్యంతమయ్యారు.

శ్రీ సత్యసాయి జిల్లా పోతులనాగేపల్లి లేఅవుట్ వద్ద ముఖ్యమంత్రి కాన్వాయ్‌ను అడ్డుకుంటున్న మోటుమర్ల, తుంపర్తి గ్రామ రైతులు

ఇంటర్ ఫలితాల్లో శ్రీ చైతన్య హవా

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ఇంటర్ ఫలితాల్లో శ్రీ చైతన్య విద్యార్థులు సత్తా చాటారు. జూనియర్ ఇంటర్ ఎంపిసిలో 470 మార్కులకు గాను శ్రీ చైతన్య విద్యార్థిని గండూరి భవ్య 467 మార్కులు సాధించింది. 466 ఆపైన ఎనిమిది మంది, 465 ఆపైన 62 మంది, 1558 మంది 460కు పైగా మార్కులు సాధించారు. జూనియర్ ఇంటర్ బైపిసిలో 440 మార్కులకు గాను సయ్యద్ అబ్దుల్ కరీమ్ 437 మార్కులు సాధించారు. 436 ఆపైన ముగ్గురు, 430 ఆపైన 451 మందికి వచ్చాయి. సీనియర్ ఇంటర్ ఎంపిసిలో వెయ్యి మార్కులకు గాను కోమటినేని శివాని 991 మార్కులు సాధించారు. 725 మంది విద్యార్థులు 980కి పైగా మార్కులు సాధించారు. బైపిసిలో వెయ్యి మార్కులకు గాను షేక్ ఆరీఫా 990 మార్కులు సాధించారు. 194 మంది విద్యార్థులకు 980కి పైగా మార్కులు లభించాయి. ఈ సందర్భంగా శ్రీ చైతన్య విద్యాసంస్థల అకడమిక్ డైరెక్టర్ సుష్మ మాట్లాడుతూ.. సబ్జెక్టులపై విద్యార్థులకు ఉన్న అవగాహన వల్లే ఇంతటి విజయం సాధ్యమైందన్నారు. శ్రీ చైతన్యలో సమగ్రమైన బోధనా పద్ధతుల వల్లే విద్యార్థులు జాతీయ స్థాయి పోటీ పరీక్షల్లో సైతం సత్తా చాటుతున్నారని చెప్పారు. ఇంతటి విజయం సాధించిన విద్యార్థులు, వారి తల్లిదండ్రులకు, అధ్యాపక, ఇతర సిబ్బందికి శ్రీ చైతన్య విద్యాసంస్థల ఫౌండర్ చైర్మన్ డా.బిఎస్ రావు అభినందనలు తెలిపారు.

గవర్నరు దృష్టికి యర్రగొండపాలెం ఘటన

- రాష్ట్రంలో శాంతి భద్రతలు క్షీణించాయంటూ టిడిపి ఫిర్యాదు

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

రాష్ట్రంలో శాంతిభద్రతలు పూర్తిస్థాయిలో క్షీణించాయని, ఇందుకు తాజా ఉదాహరణే ప్రకాశం జిల్లా యర్రగొండపాలెంలో చంద్రబాబు నాయుడు కాన్వాయ్‌పై జరిగిన రాళ్లదాడిలో ఎన్ఎస్‌జి కమాండర్ గాయపడటమేనని గవర్నరు దృష్టికి టిడిపి నేతలు తీసుకొచ్చారు. ఈ ఘటనకు సంబంధించిన వీడియో క్లిప్పింగులను గవర్నరు జస్టిస్ ఎస్ అబ్దుల్ నజీర్‌కు అందజేశారు. టిడిపి నేతల బృందం ఆ పార్టీ సీనియర్ నాయకులు వర్ల రామయ్య నేతృత్వంలో బోండా ఉమామహేశ్వరరావు, కొల్లు రవీంద్ర, గద్దె రామ్మోహన్, పి అశోక్‌బాబు, పీతల సుజాత బుధవారం గవర్నరును కలిసిన వారిలో ఉన్నారు. యర్రగొండపాలెంలో స్వయంగా మంత్రి ఆదిమూలపు సురేష్ స్వీయ పర్యవేక్షణలో కాన్వాయ్‌పై రాళ్లు వేయించడంతోపాటు కార్యకర్తలను రెచ్చగొట్టి... టీషర్టు తీసేసి స్థానికంగా ఉద్రిక్త పరిస్థితులు సృష్టించారన్నారు. చంద్రబాబు పర్యటనలకు పోలీస్ యంత్రాంగం అవసరమైన స్థాయిలో రక్షణ కల్పించడం లేదని గవర్నరుకు వివరించారు. యర్రగొండపాలెం సంఘటనలో పాల్గొన్న వారిపై కఠిన చర్యలు తీసుకునేలా ప్రభుత్వాన్ని ఆదేశించాలని విజ్ఞప్తి చేశారు.

కోర్టు ఆదేశాలు ధిక్కరణ : దేవినేని ఉమా

పోలవరం కుడి కాలువ కేంద్రంగా కోర్టు ఆదేశాలను ధిక్కరించి మట్టి, గ్రావెల్ అక్రమ తవ్వకాలు జరుగుతున్నాయని, రవాణా అంతా ముఖ్యమంత్రి కనుసన్నల్లో మంత్రి అంబటి రాంబాబు ఆదేశాలతో జరుగుతోందని మాజీ మంత్రి దేవినేని ఉమామహేశ్వరరావు ఆరోపించారు. మంగళగిరిలోని టిడిపి కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడారు. కృష్ణా, ఉభయ గోదావరి జిల్లాల్లో వైసిపి ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఎంపిలు సాగిస్తున్న మట్టి, గ్రావెల్ అక్రమ తవ్వకాలు, అమ్మకాల ద్వారా తాడేపల్లి ప్యాలెస్‌కు చేరుతున్న సొమ్మెంత? మంత్రి అంబటి, ఆయన అనుచరులు, ఎమ్మెల్యేలు, ఎంపిలు కొట్టేస్తున్నదెంత? అని దేవినేని ఉమామహేశ్వరరావు ప్రశ్నించారు. మట్టి, గ్రావెల్ మాఫియాపై ప్రశ్నించిన ఐఎఎస్ అధికారుల్ని బెదిరించిందెవరు? నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్ బృందం పరిశీలనకు వెళ్లకుండా గొయ్యిలు తవ్వి, గేట్లు పెట్టి తాళాలు వేసిందెవరు? అని ఆయన ప్రశ్నించారు. జగన్ నిర్వాకం, అసమర్ధత వల్ల పోలవరం నిర్వాసితులు సర్వం కోల్పోయారన్నారు. దళితుల్ని భయపెట్టి అసైన్డ్ భూముల్లోని మట్టిని తవ్వేస్తున్నారని విమర్శించారు.

రాష్ట్రాభివృద్ధి, సంక్షేమంపై చంద్రబాబుకు చిత్తశుద్ధి లేదు

- సిపిఎం రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాసరావు

ప్రజాశక్తి-కాకినాడ ప్రతినిధి

విజన్ 2047 పేరుతో మోడీ విధానాలతో తాను ఏకీభవిస్తున్నట్టుగా చంద్రబాబు నాయుడు రిపబ్లిక్ టీవీ చర్చల్లో చెప్పడం చూస్తే ఆయనకు రాష్ట్రం పట్ల, రాష్ట్ర అభివృద్ధి పట్ల, ప్రజల సంక్షేమ పట్ల ఏమాత్రం చిత్తశుద్ధి లేదని అర్థమవుతుందని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి. శ్రీనివాసరావు అభిప్రాయపడ్డారు. అంబేద్కర్ కోనసీమ జిల్లా అమలాపురం మండలం వన్నెచింతలపూడిలో సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు వసంత కుమార్ సంస్కరణ సభలో పాల్గొనేందుకు వచ్చిన సందర్భంగా విలేకరులతో మాట్లాడుతూ చంద్రబాబు వ్యాఖ్యలపై విస్మయం వ్యక్తం చేశారు. మోడీ విధానాలు దేశాన్ని సంక్షోభంలో నెట్టాయి.. ఆ మోడీ విధానాలనే జగన్మోహన్‌రెడ్డి ప్రభుత్వం ఇక్కడ అమలు చేస్తోంది.. జగన్మోహన్‌రెడ్డితో ఇక్కడ పోట్లాడుతానంటూ ఆ విధానాలతో విభేదం లేనట్టు చెప్పటం అంటే ప్రజలను మోసగించడమే... గతంలో చంద్రబాబు రెండుసార్లు ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు ఆ విధానాలను అమలు జరిపినందుకే ప్రజల తిరస్కరణకు గురైన అనుభవం నుండి ఆయన ఇంతవరకు పాఠం నేర్చుకోకపోవడం విచారకరం. మోడీ ఆర్థిక విధానాలతో ఏకీభవిస్తున్నానని చెప్పినటువంటి చంద్రబాబు అదే మోడీ మతోన్మాద విధానాలపై పల్లెత్తు మాట అనకపోవడం అత్యంత ఆందోళనకరమైన విషయం. మన కళ్లెదుటే రాజ్యాంగాన్ని ధ్వంసం చేస్తున్నా, పార్లమెంటరీ వ్యవస్థలను బలహీన పరుస్తున్నా, పార్లమెంట్లోగానీ బయటగానీ తెలుగుదేశం పార్టీ మాట్లాడకపోవడం శోచనీయం. దేశంలో, బిజెపి పాలిత రాష్ట్రాల్లో మైనారిటీలపైన, దళితులపైన దాడులు చేస్తున్నా కనీసం మాట మాత్రం కూడా ఖండించకపోవడంపై చంద్రబాబు పునరాలోచించుకోవాలని శ్రీనివాసరావు కోరారు. ఇది లౌకికవాదానికి, రాష్ట్ర అభివృద్ధికి తోడ్పడేటువంటి విధానం కాదన్నారు. మన రాష్ట్రానికి ప్రత్యేక హోదా విభజన హామీలపైనే మోడీతో విభేదిస్తున్నట్లు చెబుతున్న మాజీ ముఖ్యమంత్రి గత నాలుగు సంవత్సరాలలో కనీసం దానిమీద ఎలాంటి ఉద్యమాలు నడప లేదు. కనీసం విభేదించినట్లు కూడా ఎప్పుడు ప్రకటించలేదు. ఇప్పటికైనా ప్రత్యేక హోదా విభజన హామీల అమలు కోసం బిజెపితో పోరాటానికి ముందుకు రావాలని విజ్ఞప్తి చేశారు. లౌకికవాద పరిరక్షణ, రాష్ట్ర అభివద్ధి, ప్రజా సంక్షేమాల కోసం బిజెపితో స్పష్టంగా విడగొట్టుకొని దానిపై పోరాడే దానికి ముందుకు రావాలని చంద్రబాబు నాయుడు గారిని కోరుతున్నట్లు తెలిపారు.

మైనార్టీల సమావేశంలో ప్రసంగిస్తున్న చంద్రబాబునాయుడు

మైనార్టీల అభివృద్ధికి కార్యాచరణ

- ఆత్మీయ సమావేశంలో చంద్రబాబు

ప్రజాశక్తి - గుంటూరు జిల్లా ప్రతినిధి

రాష్ట్రంలో మైనారిటీల అభివృద్ధికి త్వరలో కార్యాచరణ ప్రకటిస్తానని టిడిపి అధినేత చంద్రబాబు నాయుడు చెప్పారు. పల్నాడు జిల్లా పెదకూరపాడు నియోజకవర్గం ధరణికోటలో బుధవారం మైనారిటీల ఆత్మీయ సమావేశంలో ఆయన పాల్గొన్నారు. చంద్రబాబు మాట్లాడుతూ.. ముస్లింలకు అన్యాయం చేస్తూ, ప్రాణాలు తీస్తూ, వారికి మంత్రి పదవి ఇచ్చానంటే సరిపోతుందా? అని జగన్‌ను ప్రశ్నించారు. దుల్హన్ పథకానికి డబ్బులు లేవంటున్న ముఖ్యమంత్రి, తన సొంత పత్రికకు మాత్రం ప్రకటనల రూపంలో, ఇప్పటివరకు రూ.1000కోట్లు దోచిపెట్టారని ఆరోపించారు. ముస్లిం వధూవరులు ఇద్దరూ 10వ తరగతి చదవి ఉండాలని, రాష్ట్రంలో నివసిస్తేనే దుల్హన్ పథకం వర్తిస్తుందని సిఎం గుడ్డి నిబంధనలు తీసుకొచ్చారని విమర్శించారు. టిడిపి అధికారంలోకి రాగానే ఎలాంటి నిబంధనలు లేకుండా, గతంలో మాదిరే దుల్హన్ పథకం అమలు చేస్తామన్నారు. ఇమామ్, మౌజన్‌లకు దేశంలోనే తొలిసారి గౌరవవేతనం అందించిన ఘనత టిడిపి ప్రభుత్వానిదేనని అన్నారు. పేదరికంలో మగ్గిపోతున్న ముస్లిం యువతకు, స్వయం ఉపాధి కింద ఒక్కొక్కరికి రూ. మూడులక్షల రుణం అందించి, రూ.లక్ష సబ్సిడీ అందించామని గుర్తు చేశారు. జీవోనెం-1ని సుప్రీంకోర్టు తప్పుపట్టిందని అన్నారు. తండ్రిని చంపిన వారికి శిక్షపడాలని కూతురు పోరాడుతుంటే, ఆమెను వేధిస్తున్నారనీ అన్నారు. టిడిపి జాతీయ అధికార ప్రతినిధి నసీర్ అహ్మద్, మాజీ ఎమ్మెల్యేలు కన్నా లక్ష్మీనారాయణ, కొమ్మాలపాటి శ్రీధర్, పత్తిపాటి పుల్లారావు, జి.వి.ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

వైద్యారోగ్య సంస్కరణల్లో ఎపి టాప్

- వైద్యారోగ్యశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ కృష్ణబాబు

ప్రజాశక్తి- అమరావతి బ్యూరో

వైద్యారోగ్య రంగ సంస్కరణల్లో ఎపి టాప్‌గా ఉందని, దేశ సగటుతో పోలిస్తే మాతా, శిశు మరణాల రేటు తక్కువగా ఉందని వైద్యారోగ్యశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ ఎంటి కృష్ణబాబు తెలిపారు. యునిసెఫ్ ఆధ్వర్యాన బుధవారం విజయవాడలోని ఓ హోటల్‌లో జరిగిన శిక్షణ తరగతులకు ఆయన హాజరయ్యారు. ఈ సందర్భంగా కృష్ణబాబు మాట్లాడుతూ.. గర్భిణులు, పాలిచ్చే తల్లులు, నవజాత శిశువుల సంరక్షణ కోసం ప్రత్యేక చర్యలు తీసుకున్నామని వివరించారు. మెరుగైన వైద్య సేవల కోసం నూరా సంస్థతో ఎపి నేషనల్ హెల్త్ మిషన్ భాగస్వామ్య ఒప్పందం చేసుకుందని తెలిపారు. వైద్యారోగ్యశాఖ సిబ్బంది మాస్టర్ ట్రైనర్లకు నూరా హెల్త్, యూనిసెఫ్ ప్రత్యేక శిక్షణ ద్వారా మాతా, శిశు మరణాల రేటు తగ్గించాలన్నదే లక్ష్యమని వివరించారు. ప్రజల వద్దకే వైద్యం ఫ్యామిలీ డాక్టర్ కాన్సెప్ట్ కీలకమన్నారు. వైద్యారోగ్య సిబ్బందిని మరింత సమర్థవంతంగా తీర్చిదిద్దేలా పలు శిక్షణ కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని వివరించారు. దేశంలో మాతా, శిశు మరణాల రేటు 45 శాతం ఉంటే రాష్ట్రంలో 35 శాతంగా ఉందని, దేశంలో శిశు మరణాల రేటు 35 శాతం ఉంటే రాష్ట్రంలో 30 శాతం ఉందని తెలిపారు. దేశంలో ప్రతి పదివేల జనాభాకు పదిమంది డాక్టర్లు ఉండాలని, డబ్ల్యుహెచ్ఒ నిబంధనలు ఉండగా, ఎపిలో దాదాపు 19 మంది వరకూ ఉన్నారని చెప్పారు.సిఎం జగన్ కృషి వల్ల వైద్యారోగ్య రంగం దేశంలోనే ప్రత్యేకంగా నిలిచిందని పేర్కొన్నారు. కుటుంబ ఆరోగ్య సంక్షేమశాఖ కమిషనరు జె నివాస్ మాట్లాడుతూ.. తల్లీబిడ్డల సంరక్షణ కోసం వైద్య సిబ్బందికి శిక్షణ ఇవ్వడానికి ముందుకు వచ్చిన నూరా హెల్త్‌కి కృతజ్ఞతలు తెలిపారు. నూరా హెల్త్ ఇండియా డైరెక్టరు డాక్టర్ సీమా మూర్తి, యునిసెఫ్ హెల్త్ స్పెషలిస్ట్ సీమా కుమార్ మాట్లాడారు. కార్యక్రమంలో అడిషనల్ డైరెక్టరు కెవిఎన్ఎస్ అనిల్‌కుమార్, జాయింట్ డైరెక్టరు కె అర్జునరావు పాల్గొన్నారు.

దాహం... దాహం

- ప్రకాశం, కర్నూలు జిల్లాల్లో తీవ్ర నీటి ఎద్దడి
- మంత్రుల నియోజకవర్గాల్లోనూ తప్పనితిప్పలు
- రోడ్డెక్కుతున్న ప్రజలు

ప్రజాశక్తి-ఒంగోలు బ్యూరో, కర్నూలు ప్రతినిధి

ప్రకాశం జిల్లా గిద్దలూరు, కనిగిరి నియోజకవర్గాల్లో గుక్కెడు నీరు దొరక్క ప్రజలు అల్లాడుతున్నారు. పుల్లల చెరువు, యర్రగొండపాలెం మండలాల్లోనూ, పొదిలి పట్టణంలో ప్రజలు తాగునీటి కోసం రోడ్డెక్కారు. ఈ నెల 12న ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి మార్కాపురం వచ్చినా ఈ ప్రాంత ఎమ్మెల్యేలు ఎవరూ ఆయనకు తాగునీటి సమస్యపైగానీ, తాగునీటి సరఫరా బిల్లుల పెండింగ్‌పైగానీ నివేదించే సాహసం చేయలేకపోయారు. డిఆర్‌సి సమావేశంలో మాత్రం గగ్గోలు పెట్టారు. తాగునీటి బోర్లలో నీరు అడుగంటుతోంది. ట్యాంకర్లతో రవాణా చేయాలంటే బిల్లులు ఇవ్వడం లేదు. మరోవైపుసాగర్ జలాలతో నడిచే తాగునీటి పథకాలూ నీరులేక ఎండిపోతున్నాయి. జిల్లాలో ఇప్పటికే 1447 బోర్లు అడుగంటాయి. పిడబ్ల్యుఎస్ పథకాలు 66, ఎంపిడబ్ల్యుఎస్ పథకాలు 107, నేరుగా పంపింగ్ చేసే పథకాలు 120 వరకూ ఎండిపోయాయని, 261 ఆవాస ప్రాంతాల్లో తాగునీటి సమస్య తీవ్రంగా ఉన్నట్లు అధికారులు గుర్తించారు. కొన్ని పట్టణ ప్రాంతాల్లో మూడు రోజులకోసారి మాత్రమే నీటిని సరఫరా చేస్తున్నారు. జిల్లాలో రోజుకు 1249 ట్రిప్పులు ట్రాక్టర్లతో నీటిన సరఫరా చేస్తున్నా ఏ మూలకూ చాలడం లేదు. వేసవిలో తాగునీటి ఎద్దడి నివారణకు రూ.22.81 అవసరమని అధికారులు ప్రభుత్వానికి నివేదించారు. పట్టణాలు, గ్రామాల్లో ట్యాంకర్లతో నీటిని సరఫరా చేసినందుకు మూడేళ్లుగా రూ.150 కోట్ల వరకూ బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయి. పెద్దారవీడు మండలంలో ఓ కార్యక్రమంలో పాల్గొన్న మంత్రిని పార్టీ నేతలు ఈ బిల్లుల విషయమై నిలదీసినా ఫలితం లేకపోయింది.

- **రాష్ట్ర మంత్రి ఆదిమూలపు సురేష్ ప్రాతినిధ్యం వహిస్తున్న ప్రకాశం జిల్లా ఎర్రగొండపాలెం నియోజకవర్గ కేంద్రంలో తాగునీటి పథకాల ద్వారా ఇచ్చే సాగర్ జలాలు సరిగా అందడం లేదని మహిళలు నాలుగు రోజుల క్రితం ఖాళీ బిందెలతో ధర్నా చేశారు.**
- **కర్నూలు జిల్లా కోసికి మండలం కేంద్రంలోని ఎస్‌సి కాలనీ అంబేద్కర్ కూడలి వద్ద మహిళలు ఇదే రీతిన ఆందోళన చేశారు.**
- **రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి ప్రతినిధ్యం వహిస్తున్న కర్నూలు జిల్లా ఆలమూరి మండలంలో సైకిళ్లు, ఎడ్ల బళ్లపై బిందెలతో వ్యవసాయ బావుల నుంచి నీరు తెచ్చుకుంటున్నారు. మంత్రుల నియోజకవర్గాల్లోనే పరిస్థితి ఎలా ఉంటుందో ఊహించుకోవచ్చు.**

ప్రకాశం జిల్లా, యర్రగొండపాలెం పంచాయతీ పరిధిలోని తిరుమలగిరి కాలనీలో నీటిట్యాంకర్ కోసం ఎదురుచూస్తున్న మహిళలు (ఫైల్ ఫొటో)

కర్నూలు జిల్లాలో 107 గ్రామాల్లో తాగునీటి కోసం జనం కటకటలాడుతున్నారు. ఆదోని, ఎమ్మిగనూరు నియోజకవర్గాల్లో సమస్య తీవ్రంగా ఉంది. ఆర్థిక స్తోమత లేకపోయినా క్యాన్ నీటిని రూ.15 నుంచి రూ.20కు కొనుక్కోవాల్సి వస్తోంది. ఆదోని మండలంలోని 37 గ్రామ పంచాయతీల్లోనూ నీటి ఎద్దడి తలెత్తింది. ఎనిమిది గ్రామాలకు నీటిని అందించే విరూపాపురం ఎస్ఎస్ ట్యాంకుకు గండిపడటం, మరమ్మతు పనులు, కొత్తగా చేపట్టిన మదిరె, సంతేకుడ్లూరు ఎస్ఎస్ ట్యాంక్ నిర్మాణ పనులు నత్తనడకన సాగుతుండడంతో సమస్య జటిలమైంది. వారానికి ఒకసారి నీటిని సరఫరా చేస్తుండడంతో కుళాయిల వద్ద ముందుగానే బిందెలు పెట్టి వేచి చూడాల్సి వస్తోంది. కర్నూలు మున్సిపల్ కార్పొరేషన్‌లో విలీనమైన మునగలపాడు, మామిదాలపాడు, కర్నూలు శివారులోని కృష్ణా నగర్, గణేష్ నగర్, ధనలక్ష్మి నగర్, షరీన్ నగర్, లేబర్ కాలనీ, కోడుమూరు రోడ్డులో రెండు రోజులకు ఒకసారి మాత్రమే తాగునీటిని సరఫరా చేస్తున్నారు.

డబ్బులు పెట్టి కొనుక్కుంటున్నాం



మాకు పది రోజులకోసారి నీరు వదులుతున్నారు. ఆలూరులో నీటి కోసం బాపురం నీటి పథకం నుంచి ఆలూరుకు నీటిని అందించేందుకు అండర్ గ్రౌండ్ సంప్‌ను నిర్మించారు. దానికి నీరు సక్రమంగా రాకపోవడంతో గ్రామంలో తీవ్ర నీటి ఎద్దడి నెలకొంది. అత్యవసరాల కోసం నీటిని క్యాన్ రూ.15 పెట్టి కొనుక్కుంటున్నాం.

- నాగరాజు, ఆలూరు ఎస్‌సి కాలనీ

ఎసిబి ఆకస్మిక తనిఖీలు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

రాష్ట్ర వ్యాప్తంగా ఎసిబి పలు సబ్‌రిజిస్ట్రార్, తహశీల్దారు కార్యాలయాలతోపాటు మున్సిపల్ కార్యాలయాలపై ఆకస్మిక దాడులు జరిపింది. డిజిపి కెవి రాజేంద్రనాథ్‌రెడ్డి ఆదేశాల మేరకు ఎసిబి అధికారులు ఎక్కడికక్కడే ఆకస్మిక దాడులు చేశారు. పలు ప్రభుత్వ కార్యాలయాల్లో పలువురు సిబ్బంది అవకతవకలకు పాల్పడుతున్నట్లు 14400 కాల్ సెంటర్‌కు వచ్చిన ఫిర్యాదుల మేరకే ఈ దాడులు జరిపినట్లు సంబందిత వర్గాలు తెలిపాయి. నంద్యాల మున్సిపల్ కార్యాలయంలోని పట్టణ ప్రణాళిక, రెవెన్యూ విభాగాల్లో ఎసిబి అధికారులు ఆకస్మిక దాడులు నిర్వహించారు. నివాస గృహాలు, షాపింగ్ కాంప్లెక్సులు, వాణిజ్య పరమైన భారీ భవంతుల నిర్మాణాలకు అనుమతులు మంజూరు చేయడంలో, కొన్ని భవనాలను క్రమబద్ధీకరించడంలో సిబ్బంది అవినీతికి పాల్పడుతున్నట్లు ఫిర్యాదులొచ్చాయని తెలిసింది. బద్వేల్, కడప, తిరుపతి, తిరుపతి రూరల్, అనంతపురం, అనంతపురం రూరల్, విశాఖపట్నం, జగదాంబ, తుని, కాకానాడ, నర్సాపురం, ఏలూరు, కందుకూరు, నెల్లూరులోని సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో దాడులు నిర్వహించారు. మేడికొండూరు, గుంటూరు, జలమూరు, శ్రీకాకుళం తహశీల్దారు కార్యాలయాల్లో తనిఖీలు చేశారు.

మాట్లాడుతున్న ఆర్ కృష్ణయ్య

మెగా డిఎస్‌సి ప్రకటించండి

- సిఎంకు ఆర్ కృష్ణయ్య వినతి
- బిసి జనగణనకు కేంద్రం కట్టుబడాలి

ప్రజాశక్తి - గుంటూరు జిల్లా ప్రతినిధి

రాష్ట్రంలో మెగా డిఎస్‌సిని వెంటనే ప్రకటించాలని రాజ్యసభ సభ్యుడు ఆర్.కష్ణయ్య సిఎం జగన్మోహన్‌రెడ్డికి విజ్ఞప్తి చేశారు. గుంటూరులోని వెంకటేశ్వర విజ్ఞాన మందిరంలో బుధవారం జరిగిన బిసి యువత ఆత్మీయ సమ్మేళనంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. సభకు ఒబిసి సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు అంగిరేకుల వరప్రసాద యాదవ్ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా కృష్ణయ్య ప్రసంగిస్తూ రాష్ట్రంలో ఖాళీగా ఉన్న ఉపాధ్యాయుల పోస్టులను వెంటనే భర్తీ చేయాలని కోరారు. గ్రామ, వార్డు సచివాలయాలలో ఉద్యోగాలను ఇచ్చినట్లుగానే ఉపాధ్యాయుల పోస్టులు కూడా నిరుద్యోగ యువతకు ఇవ్వాలన్నారు. బిసి జనగణన విషయంలో అన్ని రాజకీయ పార్టీలు సానుకూలంగా ఉన్నాయని తెలిపారు. ప్రధాని మోడీ వెంటనే జోక్యం చేసుకొని బిసి జనగణనకు సానుకూలత ప్రకటించాలని కోరారు. బిజెపి ప్రభుత్వం నిరంకుశ విధానాల వల్ల దేశంలో రిజర్వేషన్ల వ్యవస్థ ప్రశ్నార్ధకంగా మారిందన్నారు. ప్రభుత్వ రంగ సంస్థలను ప్రయివేటీకరణ చేయడం వల్ల ఎస్‌సి, ఎస్‌టి, బిసి, మైనార్టీలు ఉద్యోగ అవకాశాలు కోల్పోతున్నారని తెలిపారు. మండల్ కమిషన్ సిఫార్సు మేరకు కేంద్రంలో ఒబిసి మంత్రిత్వ శాఖను వెంటనే ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. ఒబిసి సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు వరప్రసాద్ యాదవ్ మాట్లాడుతూ సిపిటి కోర్సుకు కూడా ఫీజు రీయింబర్స్‌మెంట్ అమలుచేయాలన్నారు. బిసి కార్పొరేషన్‌లకు వెంటనే నిధులు, బాధ్యతలు కేటాయించాలని కోరారు.

స్పాట్ వాల్యుయేషన్ టీచర్లకు అభినందన

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

రాష్ట్ర వ్యాప్తంగా 23 స్పాట్ వాల్యుయేషన్ కేంద్రాల్లో అత్యుత్తమంగా పనిచేసిన ఉపాధ్యాయుల కృషిని పాఠశాల విద్యాశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ ప్రవీణ్ ప్రకాష్ అభినందించారు. ఈ మేరకు బుధవారం ఉపాధ్యాయులతో వీడియోకాన్ఫరెన్సు నిర్వహించి మాట్లాడారు. గుంటూరు, బాపట్లలోని వాల్యుయేషన్ కేంద్రాలను ఆయన సందర్శించినట్లు గుర్తుచేసుకున్నారు.

40 డిగ్రీల ఉష్ణోగ్రతలో కూడా ఉపాధ్యాయులు దాదాపు 8 గంటల పాటు ఎస్ఎస్‌సి పరీక్షా పత్రాలను మూల్యాంకనం చేశారని తెలిపారు. ఎంపికచేసిన వాల్యుయేషన్ కేంద్రాలు నాణ్యత ప్రమాణాలకు దూరంగా ఉండటం బాధాకరమన్నారు. సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించుకుని పోలీసు, రెవెన్యూ, ఇంధనం తదితర శాఖల సహకారం తీసుకున్నప్పటికీ కేంద్రాలను ఎంపిక చేసే విషయంలో కొంతమంది అలసత్వం ప్రదర్శించారని ఆయన పేర్కొన్నారు. పాఠశాల విద్యకు సంబంధించి ఎలాంటి సమస్యలున్నా 9013133636 నెంబరుకు కాల్ చేయాలని తెలిపారు. 8వ తరగతి విద్యార్థులకు గణితం -2 పాఠ్యపుస్తకాలు అందించని పార్వతీపురం మన్యం జిల్లా విషయానికి సంబంధించి సమస్యను గుర్తించిన 12 గంటల్లోనే 40 పుస్తకాలు అందించామన్నారు.

కర్ణాటక ఎన్నికల్లో విజయం తథ్యం : కాంగ్రెస్

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

త్వరలో జరగనున్న కర్ణాటక అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ విజయం తథ్యమని పిసిసి రాష్ట్ర అధ్యక్షులు గిడుగు రుద్రరాజు అన్నారు. కర్ణాటకలో నివసిస్తున్న తెలుగు ప్రజలందరూ కాంగ్రెస్ పార్టీని బలపరిచేలా కృషి చేయాలన్నారు. ఆంధ్రరత్న భవన్‌లో బుధవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. విజయవాడలో నిర్వహించిన జై భారత్ సత్యాగ్రహ సభ కనువిప్పుకావాలన్నారు. కర్ణాటక ఎన్నికలకు సంబంధించి ఎన్ రఘువీరారెడ్డికి బెంగళూరు బాధ్యతలు అప్పగించారని తెలిపారు. కర్ణాటక ఎన్నికల తర్వాత వైజాగ్ స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా కాంగ్రెస్ ఆధ్వర్యాన విశాఖలో భారీ బహిరంగ సభ ఏర్పాటు చేస్తామని, సభకు రాహుల్ గాంధీ హాజరవుతారని తెలిపారు.

ప్రతిఘటన తప్పదు

(మొదటి పేజీ తరువాయి)

లేదనేవారు కనీసం రెండు నెలలు పూర్తిస్థాయి ఉపాధ్యాయునిగా పని చేసి చూపాలని అన్నారు. ప్రిన్సిపల్ సెక్రటరీ ప్రవీణ్ ప్రకాష్ విద్యార్థుల తల్లిదండ్రుల ఇంటికి వెళ్లి ఫోన్ ద్వారా ఉపాధ్యాయులను మానసికంగా వేధిస్తుండటంతో తట్టుకోలేక గుండెపోటుకు గురవుతున్నారని అన్నారు. విలీనం పేరుతో విద్యా వ్యవస్థను ఛిన్నాభిన్నం చేస్తున్నారన్నారు. ఉపాధ్యాయుల సంఖ్యను కుదించేందుకు ప్రభుత్వం కుట్రలు చేస్తోందన్నారు. ప్రభుత్వం విద్యారంగాన్ని పూర్తిగా ప్రైవేటుకు అప్పజెప్పేందుకు గందరగోళ పరిస్థితులను సృష్టిస్తోందని తెలిపారు. ఈ కుట్రలను తిప్పికొట్టేందుకు వాస్తవాలతో కూడిన కరపత్రంతో ఫ్యాప్టో ప్రజల ముందుకు వెళుతుందని తెలిపారు. ఈ సందర్భంగా తప్పు ఎవరిది? శిక్ష ఎవరికి? అని ముద్రించిన కరపత్రాన్ని ఫ్యాప్టో నాయకులు ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో కె మోహన్‌రావు, చింతల సుబ్బారావు, ఇమామ్ బాషా తదితరులు పాల్గొన్నారు.

68 పనులు వెనక్కి

- ఒప్పందం రద్దు చేసుకుంటామన్న నాబార్డు
- రాష్ట్రానికి లేఖ

ప్రజాశక్తి ప్రత్యేక ప్రతినిధి - అమరావతి

నిధులిచ్చినా జరగని పనులపై నాబార్డు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేసింది. 36 నెలల్లోగా పనులను ప్రారంభించాలన్నది నిబంధన కాగా, ఇప్పటివరకు 68 పనులు ప్రారంభం కాలేదని నాబార్డు పేర్కొంది. ఇందుకు సంబంధించిన ఒప్పందాన్ని రద్దు చేసుకుంటున్నట్లు వెల్లడించింది. నాలుగేళ్ల క్రితం రాష్ట్రంలోని పలు పనుల కోసం ఆర్ఐడిఎఫ్ నిధుల ద్వారా వంద కోట్ల వరకు నాబార్డు కేటాయించింది. ఇందులో 68 చిన్న చిన్న పనుల కోసం నిధులను కేటాయించారు. నాబార్డు నిబంధనలకనుగుణంగా మూడేళ్లలో ఈ పనులు ప్రారంభం కావాలి. అయినా పనులు జరగకపోవడంతో రాష్ట్ర ఆర్థికశాఖ దృష్టికి నాబార్డు ఇప్పటికే పలుమార్లు తీసుకెళ్లినా ఫలితం లేకపోవడంతో ఒప్పందాన్ని రద్దు చేసుకుంటున్నామని తెలిపింది. నాబార్డు రుణాలు ఇచ్చిన పథకాల్లో విద్యా సంస్థల్లో మౌలిక వసతులు, తాగునీటి సరఫరా మరమ్మతులు, అంగన్వాడీ కేంద్రాల నిర్మాణం వంటివి ఉన్నాయి. ఈ పనులను గ్రామీణాభివృద్ధి, విద్యాశాఖ, మహిళా సంక్షేమశాఖ, జలవనరుల అభివృద్ధి శాఖ వంటి వాటి ద్వారా నిర్వహించేందుకు అప్పట్లో అనుమతులు ఇచ్చారు. పనులకు ఆర్థికసాయం, అనుమతులు వచ్చి మూడేళ్లు దాటినా పనులు ప్రారంభం కాలేదు. ఇదే సమయంలో పనులను జాబితా నుంచి తొలగించడం వల్ల వచ్చిన ఆ నిధులను తిరిగి వాపసు ఇవ్వాల్సిన పరిస్థితి ఉంటుందని అధికారులు చెబుతున్నారు.

ఇపిఎఫ్ఒ సర్వర్ మళ్లీ డౌన్

న్యూఢిల్లీ : ఉద్యోగుల భవిష్య నిధి సంస్థ (ఇపిఎఫ్ఒ) సర్వర్ పదే పదే మొరాయిస్తోంది. బుధవారం కూడా సర్వర్ డౌన్ కావడంతో ఇ-పాస్‌బుక్ సేవల కోసం ప్రయత్నించిన లక్షలాది చందాదారులు అసహనం వ్యక్తం చేశారు. ఇపిఎఫ్ఒ పోర్టల్‌లోకి లాగిన్ అయ్యి ఇ-పాసుబుక్ సేవలు పొందాలని ప్రయత్నించినప్పుడు 404 పేజ్ నాట్ ఫౌండ్ అని ఎర్రర్ వస్తోంది. అసౌకర్యానికి చింతిస్తున్నామనే సందేశం దర్శనం ఇస్తుంది. దీనిపై ఇపిఎఫ్ఒకు ఫిర్యాదులు వెల్లువెత్తాయి. సర్వర్ డౌన్‌పై స్పందించిన ఆ సంస్థ త్వరలోనే సమస్యను పరిష్కరిస్తామని తెలిపింది.

సస్పెన్షన్లు అక్రమం

- విద్యాశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ తీరుపై మండిపడ్డ ఉపాధ్యాయులు
- రాష్ట్ర వ్యాప్తంగా ఫ్యాప్టో నిరసనలు

విజయవాడ బిషప్ అజరయ్య ఉన్నత పాఠశాల వద్ద నిరసన తెలుపుతున్న ఉపాధ్యాయులు

ప్రజాశక్తి - యంత్రాంగం

ఉపాధ్యాయుల పట్ల విద్యాశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ ప్రవీణ్ ప్రకాష్ అనుసరిస్తోన్న విధానాలను నిరసిస్తూ, ఉపాధ్యాయులు, అధికారుల అక్రమ సస్పెన్షన్లు రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ నల్లబ్యాడ్జీలు ధరించి ఉపాధ్యాయులు నిరసన తెలిపారు. ఫ్యాప్టో ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా బుధవారం పదో తరగతి స్పాట్ వ్యాల్యువేషన్ కేంద్రం వద్ద మధ్యాహ్న భోజన విరామ సమయంలో నిరసనకు దిగారు. ఉపాధ్యాయుల సస్పెన్షన్‌ను పలువురు నాయకులు తీవ్రంగా ఖండించారు. ప్రిన్సిపల్ కార్యదర్శి వ్యవహారశైలిని తప్పుపడుతూ నినాదాలు చేశారు.

విజయవాడలోని బిషప్ అజరయ్య ఉన్నత పాఠశాల వద్ద నిరసన తెలిపారు. ఫ్యాప్టో చైర్మన్ నక్కా వెంకటేశ్వర్లు మాట్లాడుతూ.. విద్యాశాఖ ముఖ్య కార్యదర్శి పర్యవేక్షణ... విద్యారంగాన్ని బాగుచేయడం కోసమా? లేదా టీచర్లను శిక్షించడం కోసమా? ఉపాధ్యాయులను కించపరచడం ద్వారా నాణ్యమైన విద్య అందుతుందా..? అని ప్రశ్నించారు. ఫ్యాప్టో రాష్ట్ర సెక్రటరీ జనరల్ చెన్నుపాటి మంజుల మాట్లాడుతూ..విద్యార్థులు, వారి తల్లిదండ్రుల ఎదుట ఉపాధ్యాయులను కించపరుస్తూ మాట్లాడటం ఉపాధ్యాయ వృత్తిని అవమానించడమేనన్నారు. యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి ఎస్.పి. మనోహర్ కుమార్ మాట్లాడుతూ...ఉపాధ్యాయుల తప్పులు ఉంటే సరిదిద్దే విధంగా విద్యాశాఖ ముఖ్యకార్యదర్శి పర్యవేక్షణ ఉండాలని తెలిపారు. యన్‌టియు రాష్ట్ర నాయకులు తిమ్మన్న, యుటిఎఫ్, బిటిఎ, బిఇఇడి అసోసియేషన్ నాయకులు పాల్గొన్నారు.

బాపట్ల మున్సిపల్ హైస్కూల్‌లోని పదో తరగతి స్పాట్ వ్యాల్యువేషన్ కేంద్రంలో మధ్యాహ్న భోజన విరామ సమయంలో నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. కడపలో కలెక్టరేట్ ఎదుట ఆందోళన చేపట్టారు. అన్నమయ్య జిల్లా రాయచోటిలో నిరసన తెలిపారు. అనంతపురం జిల్లా కేంద్రంలోని కెఎస్ఆర్ బాలికల జూనియర్ కళాశాల వద్ద ఆందోళన కార్యక్రమం నిర్వహించారు. అనంతరం డిఇఒ సాయిరాంకు వినతిపత్రం అందజేశారు. విజయనగరం,చిత్తూరులో నిరసన తెలిపారు. అనకాపల్లి, విశాఖ క్వీన్ మేరీ పాఠశాల వద్ద నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు.

అల్లూరి సీతారామరాజు జిల్లా అనంతగిరి ఎంఇఒ ఎల్‌బి.వెంకటరావు ఆధ్వర్యాన జరిగిన సోషల్ అడిట్ ఓరియంటేషన్ సమావేశానికి మండలంలోని ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలల ప్రధానోపాధ్యాయులు నల్ల బ్యాడ్జీలతో హాజరయ్యారు.

డార్విన్ పాఠ్యాంశం తొలగించరాదు

- ఎస్ఎఫ్ఐ డిమాండ్

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

సిబిఎస్ఇ సిలబస్ నుంచి డార్విన్ సిద్ధాంతానికి సంబంధించిన పాఠ్యాంశాన్ని తొలగించడం దుర్మార్గమని ఎస్ఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షులు కె ప్రసన్నకుమార్ పేర్కొన్నారు. డార్విన్ సిద్ధాంతాన్ని తప్పుడు సిద్ధాంతంగా మతోన్మాద బిజెపి ప్రభుత్వం చేస్తున్న ప్రయత్నాలను తిప్పికొట్టాలని, చరిత్ర వక్రీకరణ ఆపాలని ఎస్ఎఫ్ఐ డిమాండ్ చేస్తోందన్నారు. సిలబస్ నుంచి డార్విన్ సిద్ధాంతాన్ని తొలగించడాన్ని నిరసిస్తూ బుధవారం విజయవాడ ఎస్ఆర్ఆర్ కళాశాల వద్ద ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యాన నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షులు ప్రసన్న కుమార్ మాట్లాడుతూ.. కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం పాఠ్యాంశాల్లో చరిత్రను మార్చడం ద్వారా మరోసారి తమ మతోన్మాద పోకడలను బలవంతంగా ప్రజలపై రుద్దేందుకు ప్రయత్నిస్తున్నట్లు అర్థమవుతోందన్నారు. గుజరాత్ అల్లర్లు వాటి పూర్వాపరాలను తొలగించి చరిత్రకు మసిపూసి మారేడుకాయ చేయాలని ప్రయత్నిస్తోందన్నారు. మహాత్మాగాంధీ హత్యలో గాడ్సే, ఆర్ఎస్ఎస్ పాత్రను చెరిపేసిందన్నారు. కర్ణాటక రాష్ట్రంలో భగత్‌సింగ్ పాఠ్యాంశం స్థానంలో బ్రిటీషర్లను క్షమాభిక్ష కోరిన సావర్కర్ పాఠ్యాంశం తీసుకురావడాన్ని చూశామన్నారు. చరిత్రకు సంబంధించిన పాఠాలను తొలగించడం, వక్రీకరించడమంటే దేశ చారిత్రక మూలాలను విధ్వంసం చేయడమేనన్నారు.

ఇకనైనా కేంద్ర ప్రభుత్వం చరిత్రను మార్చే ఆలోచనను మానుకోవాలని ఎస్ఎఫ్ఐ డిమాండ్ చేస్తోందన్నారు. ఈ నిరసన కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ ఎన్‌టిఆర్ జిల్లా అధ్యక్షులు ఎం సోమేశ్వరరావు, విజయవాడ నగర నాయకులు రాజుకుమార్, భార్గవ్, శైని పాల్గొన్నారు.

వసంతకుమార్‌కు నివాళులర్పిస్తున్న సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు తదితరులు

మార్క్సిజం కలకాలం ఉంటుంది

- వసంతకుమార్ సంస్మరణ సభలో వి శ్రీనివాసరావు

ప్రజాశక్తి-కాకినాడ ప్రతినిధి, అమలాపురం

భూమిపై మానవాళి ఉన్నంత కాలం మార్క్సిజం బతికే ఉంటుందని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు అన్నారు. డాక్టర్ బిఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లా సిపిఎం జిల్లా కమిటీ సభ్యుడు, కెవిపిఎస్ జిల్లా కార్యదర్శి, పచ్చిమాల వసంత్‌కుమార్ సంస్మరణ సభ అమలాపురం రూరల్ మండలం వన్నెచింతలపూడిలో సిపిఎం జిల్లా కన్వీనర్ కె.వెంకటేశ్వరరావు అధ్యక్షతన బుధవారం జరిగింది. సభలో శ్రీనివాసరావు మాట్లాడుతూ వసంతకుమార్ మృతి సిపిఎంకు తీరని లోటని, అనేక నిర్బంధాలను తట్టుకుని ఉద్యమాల్లో పాల్గొన్న వ్యక్తి వసంతకుమార్ అని కొనియాడారు. కుల వివక్ష, అంటరానితనానికి వ్యతిరేకంగా జరిగిన అనేక పోరాటాలలో పాల్గొన్నారన్నారు. తన ప్రథమ శత్రువు మార్క్సిజమని అమెరికా అధ్యక్షుడు చెప్పడంలోనే మార్క్సిజానికి ఉన్న విశిష్టత అర్థమవుతోందని తెలిపారు. ప్రపంచంలో కమ్యూనిజానికి నానాటికి విలువ పెరుగుతోందన్నారు. మార్క్సిజాన్ని నమ్మి శ్రమజీవులు, దళితుల పక్షాన పోరాటాలు జరిపిన వసంత కుమార్ ఆశయాలను కోనసీమ జిల్లాలో మరింత ముందుకు తీసుకువెళ్లాలని ఈ సందర్భంగా శ్రీనివాసరావు పిలుపునిచ్చారు. ఎమ్మెల్సీ ఐ.వెంకటేశ్వరరావు మాట్లాడుతూ వసంతకుమార్ విద్యార్థి, వ్యవసాయ కార్మిక, కెవిపిఎస్ ఉద్యమాల్లో పాల్గొని సమాజాన్ని చైతన్యవంతం చేశారన్నారు. సిపిఎం రాష్ట్ర నాయకులు, వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షులు దడాల సుబ్బారావు మాట్లాడుతూ కోనసీమలో మార్క్సిజం ప్రభావితం అయ్యేలా వసంతకుమార్ పనిచేశారన్నారు. కెవిపిఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆండ్ర మాల్యాద్రి మాట్లాడుతూ వసంతకుమార్ ఉద్యమకారుడిగానే కాకుండా విపత్తుల సమయంలో చేపట్టిన సేవా కార్యక్రమాలు స్ఫూర్తిదాయకం అన్నారు. కుల వివక్షతకు వ్యతిరేకంగా ఆయన ఈ జిల్లాలో జరిపిన పోరాటాలను గుర్తు చేశారు. తొలుత వసంతకుమార్ చిత్రపటానికి వి.శ్రీనివాసరావు తదితరులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. సిపిఎం కాకినాడ జిల్లా కన్వీనర్ ఎం.రాజశేఖర్, యుటిఎఫ్ జిల్లా కార్యదర్శి జ్యోతిబసు, ఆర్‌పిఐ రాష్ట్ర నాయకులు రామేశ్వరరావు తదితరులు పాల్గొని మాట్లాడారు.

తాడిపత్రి ఇసుక అక్రమ రవాణాపై చర్యలు

- సిఎస్‌కు చంద్రబాబు లేఖ

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

అనంతపురం జిల్లా తాడిపత్రి నియోజకవర్గం పెద్దపప్పూరు మండలంలోని పెన్నానదిలో ఇసుక అక్రమ తవ్వకాలు జరుగుతున్నాయని, అధికార వైసిపిలోని ఒక వర్గం, అధికారులు కుమ్మక్కై, అక్రమంగా ఇసుక రవాణా చేస్తున్నారని, వారిపై తక్షణమే చర్యలు తీసుకోవాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని టిడిపి అధినేత చంద్రబాబు నాయుడు డిమాండ్ చేశారు. ఈ మేరకు సిఎస్ జవహర్‌రెడ్డికి బుధవారం ఆయన లేఖ రాశారు. అనుమతించిన దానికి మించి జయప్రకాష్ వెంచర్స్ ఇసుక తవ్వకాలు చేస్తోందని, ఇసుక అక్రమ తవ్వకాలపై హైకోర్టులో కూడా విచారణ జరిగిందని లేఖలో పేర్కొన్నారు. నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్, ఇతర కోర్టుల నుంచి అనేక ఆదేశాలు ఉన్నప్పటికీ ఇసుక అక్రమ తవ్వకాలను అరికట్టలేదని, నిబంధనలకు విరుద్ధంగా జరుగుతున్న ఇసుక తవ్వకాలపై అభ్యంతరం వ్యక్తం చేస్తున్న వారిపై దాడులు చేస్తున్నారని, అక్రమాలను అరికట్టడంలో ప్రభుత్వ శాఖలు, అధికారులు విఫలం అవుతున్నారని పేర్కొన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా ఇసుక అక్రమ తవ్వకాలను తక్షణమే అరికట్టడంతోపాటు సహజ వనరులను కాపాడుకోవడం కూడా చాలా ముఖ్యమని సిఎస్‌కు రాసిన లేఖలో చంద్రబాబు పేర్కొన్నారు.

అవినాష్‌రెడ్డి అరెస్టు తప్పదు

- ప్రొద్దుటూరు ఎమ్మెల్యే 'రాచమల్లు'

ప్రజాశక్తి-కడప/పులివెందుల టౌన్

మాజీ మంత్రి వైఎస్.వివేకానందరెడ్డి హత్య కేసు వ్యవహారంపై ప్రొద్దుటూరు ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాద్‌రెడ్డి ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. ఈ కేసులో కడప ఎంపి అవినాష్‌రెడ్డిని అనవసరంగా ఇరికించారని, ఒక వేళ అరెస్టయినా కడిగిన ముత్యంలా బెయిల్‌పై బయటకు వస్తారని పేర్కొన్నారు. కడప ఆర్‌అండ్‌బి అతిథి గృహంలో అవినాష్‌రెడ్డి ముఖ్య నాయకులతో బుధవారం ఆయన సమావేశమయ్యారు. ఈ సమావేశానికి ఉప ముఖ్యమంత్రి అంజాద్‌బాషా, జడ్‌పి చైర్మన్ అమర్‌నాథ్‌రెడ్డి, ఎమ్మెల్యేలు శివప్రసాద్‌రెడ్డి, రఘురామిరెడ్డి, కడప మేయర్ కె.సురేష్‌బాబుతో పాటు పలువురు ముఖ్య నేతలు హాజరయ్యారు. అవినాష్‌రెడ్డిని అరెస్టు చేస్తే ఎలా ముందుకెళ్లాలనే దానిపై సమావేశంలో చర్చించారు. అనంతరం ఎమ్మెల్యే శివప్రసాద్‌రెడ్డి మీడియాతో మాట్లాడుతూ.. 'ఈ కేసులో అవినాష్‌రెడ్డి అరెస్టు తప్పదు. అరెస్టయినా ఆయన బెయిల్‌పై బయటకు వస్తారు. నిందితుడిగా చేర్చినంత మాత్రన నేరం చేసినట్లు కాదు' అని తెలిపారు. అవినాష్‌ను కేసులో ఇరికించేందుకు చంద్రబాబు కుట్ర చేస్తున్నారని ఆరోపించారు. అవినాష్‌రెడ్డి హత్య చేశారని రుజువైతే ఇక రాజకీయాల్లో ఉండనని మాత్రమే చెప్పానని, నిందితుడిగా చేర్చితే రాజీనామా చేస్తానని చెప్పలేదని తెలిపారు.

ప్రజాదర్బార్ నిర్వహించిన అవినాష్

కడప ఆర్‌అండ్‌బి అతిథి గృహంలో ఎంపి అవినాష్‌రెడ్డి ప్రజాదర్బార్ నిర్వహించారు. ప్రజల సమస్యల గురించి అడిగి తెలుసుకున్నారు. మీడియాతో మాట్లాడకుండానే ఆయన హైదరాబాద్‌కు వెళ్లిపోయారు.

ప్రజాదర్బార్‌లో సమస్యలు తెలుసుకుంటున్న ఎంపీ అవినాష్‌రెడ్డి

పులివెందులలో హైటెన్షన్

మాజీ మంత్రి వైఎస్.వివేకానందరెడ్డి హత్య కేసులో పులివెందులలో హై టెన్షన్ నెలకొంది. రెండు రోజుల పాటు ప్రజలకు అందుబాటులో ఉంటానని అవినాష్‌రెడ్డి తెలిపారు. ముందస్తు బెయిల్ పిటిషన్‌ను హైకోర్టు వాయిదా వేయడంతో ఉన్నపళంగా ఆయన కడప నుంచి హైదరాబాద్‌కు వెళ్లారు. తీర్పు ఏమి వస్తుందోనన్న ఉత్కంఠ పులివెందుల ప్రజల్లో నెలకొంది. బెయిల్ వస్తుందా? రాకపోతే అరెస్టు చేస్తారా? అన్న టెన్షన్ మొదలైంది.

యుసిఎల్ ఉద్యోగులకు నోటీసులు

యురేనియం కర్మాగారం అధికారులకు సిబిఐ అధికారులు నోటీసులు ఇచ్చారు. మాజీ మంత్రి వైఎస్.వేకానందరెడ్డి హత్య కేసులో నిందితుడు గజ్జల ఉదయ్ కుమార్‌రెడ్డి యురేనియం కర్మాగారంలో ఉద్యోగిగా పనిచేస్తున్నారు. సిబిఐ అధికారులు సోమవారం యురేనియం కర్మాగానికి చేరుకొని ఉద్యోగుల విధులను పరిశీలిస్తున్న వెంకట రాజేష్, చంద్రశేఖర్‌రెడ్డి, రాజులకు నోటీసులు జారీ చేసినట్టు సమాచారం. హైదరాబాదులోని సిబిఐ కార్యాలయంలో గురువారం హాజరు కావాల్సిందిగా నోటీసులో పేర్కొన్నట్లు సమాచారం.

రైతుల సమావేశంలో మాట్లాడుతున్న నారాలోకేష్

కౌలు రైతుల కోసం ప్రత్యేక చట్టం

- యువగళం పాదయాత్రలో లోకేష్

ప్రజాశక్తి-కర్నూలు ప్రతినిధి

కౌలు రైతులను ఆదుకునేందుకు ప్రత్యేక చట్టం తెస్తామని తెలుగుదేశం పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ హామీ ఇచ్చారు. యువగళం పేరుతో లోకేష్ చేపట్టిన పాదయాత్ర బుధవారం కర్నూలు జిల్లా మంత్రాలయం నియోజకవర్గంలో సాగింది. కోసిగి శివారు క్యాంప్ సైట్ నుంచి ప్రారంభమైన పాదయాత్ర డి.బెళగల్, పల్లెపాడు క్రాస్, గురురాఘవేంద్ర ప్రాజెక్టు క్రాస్, లచ్చుమర్రి మీదుగా మాధవరం వరకు కొనసాగింది. వివిధ వర్గాల ప్రజలు లోకేష్‌ను కలిసి తమ సమస్యలు విన్నవించారు. దారిలో కోసిగికి చెందిన 20 మంది వలస కార్మికులు ఒక వాహనంలో మిర్చి కోత పనులకు గుంటూరు వెళ్లి తిరిగివస్తుండగా లోకేష్ వారిని పలకరించారు. స్థానికంగా పనుల్లేకపోవడంతో గుంటూరు వెళ్లి వస్తున్నామని వారు చెప్పారు. ఈ సందర్భంగా లోకేష్ మాట్లాడుతూ వ్యవసాయ కార్మికులకు పనులు కల్పించలేని చెత్త ప్రభుత్వం రాజ్యమేలుతోందని అన్నారు. టిడిపి అధికారంలోకి వచ్చాక వలసలు వెళ్లే అవసరం లేకుండా పంటలకు సాగునీరందించి స్థానికంగానే పనులు లభించేలా చేస్తామని భరోసా ఇచ్చారు. మార్గమధ్యంలో పొలాల్లోకి దిగి పలువురు రైతులను పలకరించి వారి కష్టాలను తెలుసుకున్నారు. గురురాఘవేంద్ర బసలదొడ్డి ఎత్తిపోతల పథకాన్ని పరిశీలించారు. కరెంటు బిల్లులు, నిర్వహణ నిధులు విడుదల చేయకుండా ఈ పథకాన్ని మూలనబెట్టడంపై ఆయన మండిపడ్డారు. లచ్చుమర్రి క్రాస్ వద్ద రైతులతో ముఖాముఖి నిర్వహించారు. ఉల్లి రైతులను ఆదుకోవడానికి కోల్డ్ స్టోరేజ్‌లు ఏర్పాటు చేస్తామని, గిట్టుబాటు ధర ఇస్తామని లోకేష్ హామీ ఇచ్చారు. టిడిపి అధికారంలోకి వచ్చిన వెంటనే నాణ్యమైన విత్తనాలు అందజేస్తామని, నకిలీ విత్తనాలు అమ్మే కంపెనీలపై చర్యలు తీసుకుంటామని తెలిపారు. పెండింగ్ ప్రాజెక్టులు పూర్తి చేసి ప్రతి ఎకరాకు సాగునీరు అందిస్తామని, గోదావరి, కృష్ణా, పెన్నా నదులు అనుసంధానం చేసి రాయలసీమ రైతులకు సాగునీరు అందిస్తామని హామీ ఇచ్చారు. పాదయాత్ర సాయంత్రానికి మాధవరం శివార్లలోని విడిది కేంద్రానికి చేరుకుంది. రాత్రి లోకేష్ అక్కడే బసచేశారు.

వివేకా పేరిట ఆస్తులు లేవు

- వాటికోసం హత్య జరగలేదు : షర్మిల

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

మాజీ మంత్రి వైఎస్ వివేకానంద రెడ్డి పేరున ఆస్తులేమీ లేవనీ వైఎస్సార్‌టిపి అధ్యక్షులు వైఎస్ షర్మిల తెలిపారు. వివేకాకు చెందిన ఆస్తులన్నీ తన కుమార్తె సునీత పేరు మీద గతంలోనే రాశారని, ఆ విషయం కుటుంబ సభ్యులు, సమీప బంధువులకు తెలుసునని అన్నారు. ఆస్తుల కోసం వివేకాను హత్య చేశారనడంలో అర్థం లేదన్నారు.

హైదరాబాద్‌లో నిర్వహించిన ప్రెస్‌మీట్‌లో విలేకరులు అడిగిన ప్రశ్నలకు ఆమె పైవిధంగా బదులిచ్చారు. ఆస్తుల కోసమే అల్లుడు రాజశేఖర్‌రెడ్డి హత్య చేయాలనుకుంటే... వివేకానందరెడ్డిని చంపేవాడు కాదనీ.. సునీతను చంపేవాడని అన్నారు. చిన్నాన్న వివేకా పేరిట ఉన్న అరకొర ఆస్తులు కూడా సునీత పిల్లలకే చెందేలా ఆయన వీలునామ రాశారని చెప్పారు. కొన్ని మీడియా సంస్థలు ఆయన వ్యక్తిగత జీవితం గురించి తక్కువ చేసి మాట్లాడుతున్నాయనీ..మా చిన్నాన్న పర్సనల్ లైఫ్ గురించి మాట్లాడే నైతిక అర్హత ఎవరికీ లేదన్నారు. వివేకాపై చేస్తున్న తప్పుడు ఆరోపణలను షర్మిల తీవ్రంగా ఖండించారు.

ప్రయివేటుకు ప్రభుత్వ టెల్కోల ఆస్తులు

- అమ్మకానికి ఆస్తులను గుర్తించండి
- సిజిఎంలకు కేంద్రం ఆదేశాలు

న్యూఢిల్లీ : ప్రభుత్వ రంగ టెలికం కంపెనీల ఆస్తుల విక్రయ ప్రక్రియను కేంద్రం వేగవంతం చేస్తోంది. అమ్మకానికి వీలున్న ఆస్తులను వేగంగా గుర్తించాలని బిఎస్ఎన్ఎల్, ఎంటిఎన్ఎల్ సంస్థలకు టెలికం శాఖ ఆదేశాలు జారీ చేసిందని సమాచారం. రూ.10 కోట్ల వరకు విలువ కలిగిన కీలక, కీలకేతర ఆస్తులను గుర్తించాలని సూచించినట్లు ఈ వ్యవహారంతో సంబంధ కలిగిన వ్యక్తులు పేర్కొన్నట్లు ఎఫ్ఇ రిపోర్ట్ చేసింది. ఇప్పటికే ప్రతీ సర్కిల్‌లో బిఎస్ఎన్ఎల్ కనీసం 10 ఆస్తులను అమ్మకానికి వీలుగా గుర్తించింది. ప్రభుత్వ టెల్కోలకు ఇచ్చిన రూ.1.65 లక్షల కోట్ల పునరుద్ధరణ ప్యాకేజీకి సంబంధించిన రుణ, వడ్డీ చెల్లింపులు, మూలధన వ్యయాల కోసం ఆస్తుల నగదీకరణ చేయాలని టెలికం శాఖ పేర్కొందని సమాచారం. సులభంగా అమ్మకానికి వీలయ్యే ఆస్తులను తొలుత గుర్తించాలని ఆయా సర్కిళ్ల చీఫ్ జనరల్ మేనేజర్లను ఆదేశించినట్లు ప్రభుత్వ వర్గాలు తెలిపాయి. మూడు నెలల్లోనే ఈ ప్రక్రియను పూర్తి చేయాలని సిజిఎంలకు సూచనలు ఇచ్చారు. ఇంతక్రితం ఫిబ్రవరిలో రూ.50 కోట్ల విలువ చేసే తొమ్మిది ఆస్తుల విక్రయానికి గాను బిఎస్ఎన్ఎల్ బోర్డు ఆమోదం తెలిపింది. రూ.10 కోట్ల లోపు విలువ చేసే ఆస్తుల విక్రయానికి మంత్రి వర్గం ఆమోదం అవసరం ఉండదు. రూ.10 కోట్ల పైబడిన ఆస్తులకు మాత్రమే మంత్రివర్గ ఆమోదం తప్పనిసరి. బిఎస్ఎన్ఎల్‌కు చెందిన రూ.18,200 కోట్ల ఆస్తులు, ఎంటిఎన్ఎల్‌కు సంబంధించి రూ.5,158 కోట్ల ఆస్తులను విక్రయించడానికి గత ఫిబ్రవరిలో దీపమ్ ఆమోదం తెలిపింది. 2022 నవంబర్‌లో ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, మధ్యప్రదేశ్,



గుజరాత్, ఉత్తరప్రదేశ్‌లోని బిఎస్ఎన్ఎల్‌కు సంబంధించిన 13 ఆస్తులను కేంద్రం వేలానికి పెట్టింది. వీటికి డిసెంబర్ 5 నుంచి బిడ్డింగ్‌లను అహ్వానించింది. ఆస్తుల నగదీకరణలో భాగంగా వీటిని అమ్మేస్తున్నట్లు కేంద్రం పేర్కొంది. ఆంధ్రప్రదేశ్‌లోని తాడేపల్లిగూడెం, కొండపల్లిలోని ఆస్తులు, తెలంగాణలోని పటాన్‌చెరు ఆస్తులు ఈ వేలంలో ఉన్నాయి. ఈ ప్రక్రియ ఎక్కడి వరకు వచ్చిందో తెలియాల్సి ఉంది.

ధరల కట్టడిపై దృష్టి : మంత్రి సీతారామన్

కలబురగి : సీజనల్ ఉత్పత్తుల సరఫరాలోని సమస్యల వల్లే ద్రవ్యోల్బణం పెరుగుతుందని కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ పేర్కొన్నారు. వీటి పరిష్కారానికి నిరంతరం పర్యవేక్షణ చేస్తున్నామన్నారు. నిత్యావసర వస్తువుల ధరల తగ్గుదలపై దృష్టి సారిస్తున్నామని మంత్రి పేర్కొన్నారు. గ్లోబల్ మార్కెట్‌లో ఇంధనం, గ్యాస్ ధరలు అధికంగా ఉన్నాయన్నారు. గ్యాస్, ఇంధన ధరలను తాము అర్థం చేసుకుంటున్నామని.. కానీ ఇవి దిగుమతుల ధరలపై ఆధారపడి ఉంటాయన్నారు.

ఐఎఫ్ఎల్‌కు రూ.67 కోట్ల ఎగుమతి ఆర్డర్లు

IFL ENTERPRISES LIMITED

హైదరాబాద్ : అన్ని రకాల పేపర్లు, స్టేషనరీ వస్తువుల వ్యాపారంలో ఉన్న ఐఎఫ్ఎల్ ఎంటర్‌ప్రైజెస్‌కు 8.16 మిలియన్ డాలర్లు (దాదాపు రూ.67 కోట్లు) ఎగుమతి ఆర్డర్లు దక్కినట్లు ఆ సంస్థ పేర్కొంది.

కెన్యా కంపెనీ ప్రెరీనా హోల్డింగ్ లిమిటెడ్ నుంచి ఈ ఆర్డర్‌ను పొందినట్లు పేర్కొంది. అక్కడి పాఠశాలలకు రాత పుస్తకాలు, పాఠ్యపుస్తకాలు, బాండ్ పేపర్లు, కాపీ పేపర్లను సరఫరా చేయనుంది. ఎగుమతులు 2023 జూన్ నుంచి మార్చి 2024 నాటికి వీటి సరఫరా పూర్తి చేయనున్నామని ఐఎఫ్ఎల్ ఎంటర్‌ప్రైజెస్ ఎండి, సిఎఫ్ఒ డోలార్ షా పేర్కొన్నారు.

రూ.3వేల కోట్ల టర్నోవర్ లక్ష్యం

- తెలుగు రాష్ట్రాల్లో మరో 10 శాఖలు వి-ట్రాన్స్ ఛైర్మన్ వెల్లడి

హైదరాబాద్ : ఆర్థిక సంవత్సరం 2025-26 నాటికి రూ.3,000 కోట్ల టర్నోవర్ సాధించాలని లక్ష్యంగా పెట్టుకున్నామని లాజిస్టిక్స్ సంస్థ వి-ట్రాన్స్ ఛైర్మన్ మహీంద్రా షా తెలిపారు. బుధవారం హైదరాబాద్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆ సంస్థ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ రాజేష్ షాతో కలిసి మహీంద్రా షా మాట్లాడారు. గడిచిన ఆర్థిక సంవత్సరంలో రూ.1450 కోట్ల టర్నోవర్ సాధించామన్నారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో 26 శాతం వృద్ధితో రూ.1,800 కోట్ల రెవెన్యూ సాధించాలని లక్ష్యంగా పెట్టుకున్నామన్నారు. తెలుగు రాష్ట్రాల్లో తమకు ప్రస్తుతం 50 శాఖలు ఉన్నాయని తెలిపారు. ఏడాదిలో మరో 10 శాఖలను ఏర్పాటు చేయాలని నిర్దేశించుకున్నామన్నారు. దేశ వ్యాప్తంగా 10 లక్షల చదరపు అడుగుల గిడ్డంగులు ఉన్నాయని.. వీటిని 20 లక్షల చదరపు అడుగులకు విస్తరించుకోవాలని యోచిస్తున్నామన్నారు. ప్రస్తుతం దేశ వ్యాప్తంగా తమకు 1000 పైగా శాఖలున్నాయని.. వచ్చే ఏడాది కాలంలో మరో 100 శాఖలను తెరువనున్నామన్నారు.

పెట్టుబడులకు సిప్ ఉత్తమం

- బంధన్ ఎఎంసి సేల్స్ హెడ్ గౌరబ్

హైదరాబాద్ : పెట్టుబడులకు ఉత్తమ మార్గాల్లో ఒక్కటని బంధన్ మ్యూచువల్ ఫండ్ పేర్కొంది. ఇంతక్రితం ఈ సంస్థ ఐడిఎఫ్‌సి ఎంఎఫ్‌గా ఉంది. సిప్ పెట్టుబడిదారులకు నిర్ధిష్ట కాల వ్యవధిలో క్రమం తప్పకుండా పెట్టుబడులకు అనుమతిస్తుందని బంధన ఎఎంసి సేల్స్ అండ్ మార్కెటింగ్ హెడ్ గౌరబ్ పారిజా పేర్కొన్నారు. గడిచిన ఆర్థిక సంవత్సరం 20 22-23లో సిప్‌ల్లో పెట్టుబడులు 25 శాతం పెరిగి రూ.1.56 లక్షల కోట్లకు చేరాయని తెలిపారు.

వైసిపి అక్రమాలు, అవినీతిపై బిజెపి చార్జిషీట్

- శివప్రకాష్‌జీ ఆధ్వర్యంలో చార్జిషీట్ దాఖలు కమిటీ
- 11 మంది సభ్యులతో మరో కమిటీ : సోము వీర్రాజు

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

రాష్ట్రంలోని వైసిపి ప్రభుత్వం అవలంభిస్తున్న ప్రజా వ్యతిరేకపాలన, అవినీతి, అనైతిక చర్యలపై ప్రజలకు వాస్తవాలు వెలువరించేందుకు బిజెపి రాష్ట్ర కమిటీ బుధవారం రెండు కమిటీలను నియమించింది. కోర కమిటీలో అఖిల భారత సంహసంఘటనా ప్రధాన కార్యదర్శి శివప్రకాష్‌జీ, బిజెపి ఎపి ఇన్‌చార్జి, కేంద్రమంత్రి మురళీధరన్, సహ ఇన్‌చార్జి సునీల్‌దేవధర్‌ల ఆధ్వర్యంలో నియమించారు. వీరితో పాటు 11 మంది సభ్యులతో చార్జిషీట్ కమిటీని నియమించింది. ఈ మేరకు ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షులు సోము వీర్రాజు ఒక ప్రకటన విడుదల చేశారు. ఈ కమిటీలో పార్టీ జాతీయ కార్యదర్శి దగ్గుపాటి పురంధరేశ్వరి, వై.సత్యకుమార్‌ల నేతృత్వంలో కమిటీ పనిచేస్తుందని తెలిపారు. కమిటీ కన్వీనరుగా, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పివిఎన్ మాధవ్, కమిటీ సభ్యులుగా రాజ్యసభ సభ్యులు సిఎం రమేష్, జివిఎల్ నరసింహారావు, ఎమ్మెల్సీ వాకాటి నారాయణరెడ్డి, మాజీ ఎంపి కొత్తపల్లి గీత, మాజీ సిఎస్ ఐవైఆర్ కృష్ణారావు, జాతీయ ఓబిసి మోర్చా సెక్రటరీ డాక్టర్ పార్ధసారధి, మాజీఎమ్మెల్యే జయరాములు, ఆర్‌టిఐసెల్ స్టేట్ కన్వీనరు వి.శ్రీనివాస్‌బాబులను నియమించినట్లు తెలిపారు.

సంపాదకీయం

ద్రోహానికి సమర్థన!

ప్రధాని మోడీ విధానాలకు, చర్యలకు మద్దతిస్తున్నానని మంగళవారం ఆంగ్ల వార్తా చానల్ రిపబ్లికన్ టి.వి. నిర్వహించిన ముఖాముఖిలో మాజీ ముఖ్యమంత్రి, తెలుగుదేశం పార్టీ అధినేత చంద్రబాబు వ్యక్తపర్చిన అభిప్రాయం దేశం, రెండు తెలుగు రాష్ట్రాల రాజకీయ వర్గాల్లో చర్చకు దారితీసింది. ఇంకో ఏడాదిలో ఎన్నికలనగా చంద్రబాబు నోట మోడీ అనుకూలత 'జాలువారడం'తో సహజంగానే పరిపరి విధాల ఊహాగానాలకు కథా వస్తువుగా మారింది. మోడీ పాలనా వైఫల్యాలపై దేశ వ్యాప్తంగా ప్రతిపక్షాలు పోరాటానికి సమాయత్తమవుతున్న సమయాన ఎన్‌డిఎ యేతర పార్టీ టిడిపికి జాతీయ అధ్యక్షునిగా ఉన్న బాబు, మోడీ ప్రభుత్వ విధానాలను బేషరతుగా సమర్థించడం దేనికి సంకేతం? దేశాభివృద్ధి కోసం మోడీ ప్రతిపాదించిన 'విజన్ 2047'కు తాను అనుకూలమని బాబు ప్రకటించారు. తాను పాతికేళ్ల కింద ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ అభివృద్ధికి 'విజన్ 2020'ని తీసుకురాగా అదే తరహాలో మోడీ రాబోయే కాలానికి దేశానికి విజన్ అందించారని బాబు శ్లాఘించడానికి 'విజన్' అనే పదమొక్కటే సారూప్యత కాదు. విజన్ మాటున దాగున్న ప్రభుత్వరంగ ధ్వంసరచన, కార్పొరేట్ల దోపిడీని సులభతరం చేసే ఎన్నో అంశాలు పుష్కలంగా ఉన్నాయి. అందుకే చంద్రబాబు మోడీని రెండు చేతులా సమర్థిస్తున్నారు.

తొమ్మిదేళ్ల మోడీ పాలనలో ఏ విధానాలు, చర్యలు చంద్రబాబుకు అమితంగా నచ్చాయో ఆయన చెబితేనే బాగుంటుంది. ప్రభుత్వరంగాన్ని చుట్టచుట్టి అమ్మడమా? దేశ ఆర్థిక వ్యవస్థను కబళించిన అదానీకి కొమ్ముకాయడమా? పార్లమెంట్‌ను నడవనీకుండా అధికారపక్షమే అడ్డుకొని ప్రజాస్వామ్యానికి తూట్లు పొడవడమా? గవర్నర్ల వ్యవస్థను ఉపయోగించుకొని ప్రజలతో ఎన్నిక కాబడ్డ విపక్ష రాష్ట్ర ప్రభుత్వాలను మోడీ ప్రభుత్వం వేధిస్తోంది. లౌకికవాదాన్ని దెబ్బ తీస్తోంది. రాజ్యాంగ వ్యవస్థల్లోకి హిందూ మతోన్మాద శక్తులను చొప్పిస్తోంది. మత ఘర్షణలను తన కుట్రలతో ప్రేరేపిస్తోంది. మోడీ చర్యలతో రాజ్యాంగానికే పెను ప్రమాదం ఏర్పడిందని, దేశ ఐక్యతకు ముప్పు వాటిల్లిందని ప్రతిపక్షాలు, మేధావులు, ప్రజలు ఘోషిస్తున్నారు. చంద్రబాబు మాత్రం ఇవన్నీ ఆమోదయోగ్యంగా కితాబిస్తున్నారు. తెలుగుదేశం పార్టీ పుట్టింది తెలుగు ప్రజల ఆత్మగౌరవ నినాదంతో. కేంద్ర పెత్తనం, రాష్ట్రాల హక్కుల హననం, గవర్నర్ వ్యవస్థకు వ్యతిరేకంగా నాడు పోరాడింది. మోడీ ప్రభుత్వం సమాఖ్య వాదాన్ని తుంగలో తొక్కుతుండగా చంద్రబాబు ఆ విధానాలపై హర్షం తెలపడం తన పార్టీ అసలు లక్ష్యాన్ని వదిలేయడమే. జమ్మూకాశ్మీర్ విభజన, పౌరసత్వ బిల్లు, యు.పి.లో ముస్లింల ఎన్‌కౌంటర్లు, ముస్లిం రిజర్వేషన్ల రద్దు, దళితులు, ముస్లింలపై గోగూండాల పాశవిక దాడులు... మోడీ జమానాలో జరుగుతున్న ఈ దారుణాలను చంద్రబాబు సమర్థిస్తున్నారనుకోవాలా? ఆకలి, పేదరికం, ప్రజాస్వామ్యం, పౌర స్వేచ్ఛ అంశాల్లో దేశం అధమంగా ఉందని రేటింగ్ సంస్థలు చెబుతుండగా మోడీ దేశ విశిష్టతను ప్రపంచానికి చాటారనడం సబబేనా?

ప్రత్యేక హోదా సహా విభజన హామీలు అమలు చేయకుండా రాష్ట్రానికి ద్రోహం చేసిన మోడీ ప్రభుత్వానికి బాబు మద్దతివ్వడం రాష్ట్రానికి అన్యాయం తలపెట్టడమే. ప్రజల మనోభావాలతో ముడిపడిన విభజన హామీల కోసం కేంద్రంపై పోరాడాను, విభేదించాను తప్ప ఏనాడూ కేంద్ర విధానాలను వ్యతిరేకించలేదన్నారు చంద్రబాబు. ఈ కాలంలో రాష్ట్రానికి కేంద్రం ఏం ఒరగబెట్టిందని మోడీ విధానాలకు ఇప్పుడు జై కొడుతున్నారు? విభజన హామీల సాధనకు వైసిపి సర్కారు కేంద్రంపై పోరాడకుండా గమ్మున కూర్చుంది. ఈ విషయంపై వైసిపిని తప్పుబడుతున్న చంద్రబాబు, ద్రోహం చేసిన మోడీకి మద్దతివ్వడం ఏ విధంగా రాష్ట్ర ప్రయోజనాల పరిరక్షణ అవుతుంది? మోడీ సర్కారు ఆదేశాలతో చెత్తపన్ను, ఆస్తి పన్ను, వ్యవసాయ విద్యుత్ మీటర్లు, నగదు బదిలీతో లబ్ధిదారుల కోతలు అమలవుతున్నాయి. ఈ చర్యలన్నీ ప్రజా సంక్షేమాన్ని కాలరాస్తాయి. వీటికే చంద్రబాబు మద్దతివ్వడం ప్రజలకు నష్టం తప్ప లాభం కాదు. వీటిపై టిడిపి, చంద్రబాబు ప్రజలకు సమాధానం చెప్పాలి.

మహనీయుల మాట



యజమాని నిశ్చలత్వాన్ని, నిలకడను కోరుకుంటాడు. పూర్తిగా ఒంటరిగా వుండాలనుకుంటాడు. కాని ఆందోళనకారుడు అలా ఎన్నటికీ కోరుకోడు. కార్మిక సమస్య వెనుక లెక్క కట్టలేనంత శత్రుత్వం దాగి వుంటుంది. కార్మిక ఆందోళనకారులు దీన్ని వెలికితీసి నగ్నంగా ప్రదర్శించడానికి, ఎండగట్టడానికీ అంతిమంగా ప్రపంచంలో అది లేకుండా చేయడానికీ ప్రయత్నిస్తారు.

- యూజిన్ డెబ్స్,
అమెరికా సోషలిస్టు పార్టీ నాయకుడు.

కార్పొరేట్ల గుప్పెట్లోకి సహకార డెయిరీలు

విశ్లేషణ

కె.ఎస్.వి. ప్రసాద్



> స్వతంత్ర పాల సంఘాల ఏర్పాటు ద్వారా అమూల్ పాలను సేకరించి నందినికి సమాంతరంగా వ్యాపారం చేస్తుందన్నమాట. ఇది కచ్చితంగా నందిని మనుగడకు హానికరం. దాని సరఫరా గొలుసును దెబ్బతీయడంతోపాటు, కార్యకలాపాలను ఆక్రమించుకుంటుంది. ఈ క్రమం కర్ణాటక రైతుల భయం నిజమని తేలుస్తుంది. ఇది కేవలం అమూల్-నందినికే పరిమితం కాదు. పాల సహకార సంస్థలను కార్పొరేట్లు స్వాధీనం చేసుకునే కేంద్రీకరణ. మొదట్లో పాల ఉత్పత్తిదారులకు ఎక్కువ ఆదాయం లభించినా భవిష్యత్తులో మొత్తం పాల ఆర్థిక వ్యవస్థకు ప్రభుత్వ రక్షణ ఉండదు. స్వేచ్ఛా మార్కెట్‌లో ప్రపంచ పాల ఆర్థిక వ్యవస్థకు లోబడి ఉంటుంది. ఇప్పటికే వ్యవసాయ సంక్షోభంతో కొట్టుమిట్టాడుతున్న గ్రామీణ భారతాన్ని మరింత అతలాకుతలం చేస్తుంది. పాల రంగం పల్లె కుటుంబాలను కొంత వరకు నిలబెట్టగా కార్పొరేటీకరణ ఆ ఆసరానూ తొలగిస్తుంది.

మోడీ నేతృత్వంలోని కేంద్ర బిజెపి ప్రభుత్వం వాగ్దానం చేసిన సహకార సమాఖ్య వాదం బలవంతపు సమాఖ్య వాదంగా మారిపోయింది. 2019 నుంచి జరిగిన సంఘటనలను పరిశీలిస్తే గుజరాత్‌కు చెందిన కోఆపరేటివ్ అమూల్ డెయిరీ ఇతర రాష్ట్రాలకు విస్తరించడం ద్వారా ప్రైవేటు కార్పొరేట్ పెట్టుబడి ప్రవేశిస్తున్న క్రమం బిజెపి సహకార ఫెడరలిజం అసలు రంగు బయట పెడుతుంది. కొత్తగా మోడీ సర్కారు కేంద్రంలో సృష్టించిన సహకార మంత్రిత్వశాఖకు ఇన్‌ఛార్జిగా ఉన్న హోం మంత్రి అమిత్‌షా, కర్ణాటకలోని మాండ్యాలో పర్యటిస్తూ గుజరాత్‌కు చెందిన కోఆపరేటివ్ డెయిరీ అమూల్‌లో కర్ణాటక రాష్ట్ర సహకార డెయిరీ నందినిని విలీనం చేయాలన్న ఉద్దేశాన్ని బహిరంగపరిచారు. షా ప్రకటనపై కర్ణాటకలో రైతులే కాకుండా అన్ని రాజకీయ పార్టీల నుంచీ తీవ్ర వ్యతిరేకత వచ్చింది. బిజెపి రాజకీయంగా ఒంటరిపాటుకు గురైంది. దాంతో కర్ణాటక బిజెపి ముఖ్యమంత్రి బొమ్మయ్ వివరణిస్తూ దేశంలోనే అతిపెద్ద సహకార పాల ఉత్పత్తిదారుల సంఘాలైన అమూల్, నందిని మధ్య సహకారం కోసం షా పిలుపునిచ్చారన్నారు. విలీనం ప్రతిపాదన లేదన్నారు. ఇదిలా ఉండగా, ఏప్రిల్ 5న అమూల్ తన ట్విటర్‌లో బెంగళూరు నగరంలో అమూల్ పాలు, పెరుగును ప్రవేశపెడుతున్నట్లు ప్రకటించి మరోమారు అమూల్- నందిని విలీనంపై చర్చను లేవదీసింది. అమూల్‌లో నందినిని విలీనం చేయడం, లేదంటే కర్ణాటకలో నందినికి సమాంతరంగా అమూల్ నెట్‌వర్క్‌ను చొప్పించడం ద్వారా స్థానికంగా నందినిని ధ్వంసం చేయాలని కేంద్ర ప్రభుత్వం నిశ్చయించుకుందని ఇప్పుడు కర్ణాటక ప్రజలు నమ్ముతున్నారు. ఈ నమూనాను తతిమ్మా రాష్ట్రాల్లో కూడా అమలు చేయడానికి కేంద్రం అడుగులేస్తోంది.

స్వేచ్ఛగా కార్పొరేట్ల ప్రవేశం

కర్ణాటక రాష్ట్రం గుజరాత్ రాష్ట్రానికి ఆనుకొని లేదు. గుజరాత్, బెంగళూరు మధ్య పాల రైళ్లు కూడా లేవు. కర్ణాటక మార్కెట్‌లో చాలా కాలంగా ఉన్న ప్యాకేజి, ప్రాసెస్ చేసిన పాల ఉత్పత్తులు ఉండగా, బెంగళూరు మార్కెట్‌లో తాజా అమూల్ పాలు, పెరుగు అమ్మకాలపై స్థానిక సహకార డెయిరీలలో భయాలు కలుగుతున్నాయి. ఇది అమిత్‌షా నేతృత్వంలోని సహకార మంత్రిత్వ శాఖ నిజమైన ఉద్దేశాల గురించి తీవ్రమైన ప్రశ్నలు లేవనెత్తుతున్నాయి. ఒక సహకార సంస్థను మరొక సహకార సంస్థ కబళించడం సహకార స్ఫూర్తికి విరుద్ధం. కర్ణాటకలోని బిజెపి ప్రభుత్వంకానీ కేంద్రంలోని బిజెపి ప్రభుత్వంకానీ అమూల్, నందిని విషయంలో బహిరంగంగా చెప్పేవాటి కంటే దాచిపెట్టేవే ఎక్కువ. కర్ణాటక బిజెపి ప్రభుత్వం నందినికి అనుకూలమనడం కేవలం నటన మాత్రమే. కర్ణాటక మిల్క్ ఫెడరేషన్ (కెఎంఎఫ్) బ్రాండ్ పేరు నందిని. రాష్ట్రంలోని 16 జిల్లాల్లో అత్యంత శక్తిమంతమైన యూనియన్లతో ఏర్పడ్డ ఫెడరేషన్. దాదాపు 25 లక్షల మంది రైతులు ఉపాధి పొందుతున్నారు. 2021-22 ఆర్థిక సంవత్సరంలో రూ.25 వేల కోట్ల టర్నోవర్ నమోదు చేసింది. దేశంలో అమూల్ తర్వాత నందిని మాత్రమే పెద్ద టర్నోవర్ కలిగి ఉంది. ఆ ఏడాది అమూల్ టర్నోవర్ రూ.65 వేల కోట్లు. ఇటీవలి అధ్యయనాల ప్రకారం దేశంలో రూ.15 లక్షల కోట్ల పాల వ్యాపారం జరుగుతోంది. దీనిలో 10 శాతం మాత్రమే వ్యవస్థీకృత రంగంలో ఉంది. పాల రంగంలో ప్రైవేటు పెట్టుబడి ప్రవేశించేందుకు అనుకూలంగా ఉండే సరికొత్త మోడల్ రావాలని ప్రైవేటు, కార్పొరేట్ సంస్థలు ప్రతిపాదిస్తున్నాయి. 2019లో కేంద్రంలో రెండవ తడవ అధికారంలోకొచ్చిన బిజెపి సర్కారు పాల సహకార వ్యవస్థలో స్వేచ్ఛగా కార్పొరేట్ల ప్రవేశం కోసం, సహకార డెయిరీల విచ్ఛిన్నానికి సరికొత్త నమూనా అమలుకు సిద్ధమైంది. పాలల్లో ప్రైవేట్లు గరిష్ట లాభాలు పొందేందుకు ఈ నమూనా సులభతరం చేస్తుంది.

మల్టీ స్టేట్ కో-ఆపరేటివ్స్

భారత రాజ్యాంగంలోని 7వ షెడ్యూల్ ప్రకారం సహకార సంస్థలు రాష్ట్రాల జాబితాలోకొస్తాయి కాబట్టి సహకార కార్యకలాపాలు రాష్ట్ర, ప్రైవేటు రెండింటిలోనూ, మూడవ రంగ స్వయంప్రతిపత్తిగా నిర్వహించబడతాయి. అవి ప్రజల ఉమ్మడి ప్రయోజనాల కోసం పని చేస్తాయి. సంస్థలో పెట్టుబడితో నిమిత్తం లేకుండా ఒక వ్యక్తికి ఒక ఓటు ఉంటుంది. వివిధ రాష్ట్రాల్లో నడుస్తున్న పెద్ద పెద్ద కోఆపరేటివ్స్‌లోకి భారీ ప్రైవేటు పెట్టుబడులను ఆకర్షించాలంటే కేంద్ర ప్రభుత్వ పాలనా పర్యవేక్షణ అసరమని తొలుత యుపిఎ సర్కారు భావించి, రాజ్యాంగానికి 97వ సవరణ చేయగా సుప్రీంకోర్టు కొట్టేసింది. కానీ కేంద్రం ఆధ్వర్యంలో బహుళ రాష్ట్ర సహకార సంఘాల ఏర్పాటుకు అనుమతించింది. సహకార వ్యవస్థలో కార్పొరేట్ల ప్రత్యక్ష, పరోక్ష పెట్టుబడి మోడీ రెండోసారి అధికారంలోకొచ్చే వరకు వేచి ఉండాల్సి వచ్చింది. కార్పొరేట్ మధ్యవర్తిత్వ, నియంత్రిత రైతు ఉత్పత్తిదారు సంస్థల ఏర్పాటుకు మూడు నల్ల వ్యవసాయ చట్టాలతో కఠోర ప్రయత్నం జరిగింది. రైతుల చారిత్రాత్మక పోరాటం కారణంగా మూడు వ్యవసాయ చట్టాలూ రద్దయినప్పటికీ రాష్ట్ర వ్యవసాయ చట్టాలలో ఇటువంటి నిబంధనలున్నాయి. పాల సహకార సంస్థలతో సహా ఇతర సంస్థల కార్పొరేటీకరణకు వ్యతిరేకంగా వెల్లువెత్తుతున్న రైతుల ప్రతిఘటనను అధిగమించేందుకు మోడీ ప్రభుత్వం అనేక 'వినూత్న' మార్గాలను అనుసరిస్తోంది. ఈ నేపథ్యాన్ని దృష్టిలో ఉంచుకొంటే అమూల్ ఇతర రాష్ట్రాలకు విస్తరించడం, దాని ద్వారా ప్రైవేటు కేపిటల్ ప్రవేశం అసలు కథ బోధ పడుతుంది. 2019లో బహుళ దేశ ప్రాంతీయ సమగ్ర ఆర్థిక భాగస్వామ్యం (ఆర్‌సిఇపి) చర్చల్లో ఈ ప్రక్రియను గుర్తించవచ్చు. ఆర్‌సిఇపి చర్చల్లో ముఖ్యమైన వివాదాల్లో ఒకటి న్యూజిలాండ్, ఆస్ట్రేలియా వంటి ప్రపంచ పాడి దిగ్గజాలు ప్రపంచ వ్యాప్తంగా పాల ఉత్పత్తులపై జీరో సెస్ ప్రతిపాదన. భారతీయ పెద్ద వ్యాపారులు అటువంటి వెసులుబాటు కోసం ఎదురు చూస్తుండగా, రైతులు దేశ వ్యాప్తంగా వ్యతిరేక ఆందోళనలు చేశారు. పలు కారణాల వలన చివరికి ఆర్‌సిఇపి నుంచి భారత్ ఉపసంహరణ జరిగింది. ఆర్‌సిఇపి ఎదురుదెబ్బ ఉన్నప్పటికీ, దోపిడీ చేయడం కోసం పాడి రంగంపై కార్పొరేట్లు ఆసక్తి పెంచుకున్నారు. ఫిక్కీ 2020లో 'భారతదేశంలో పాల రంగం అభివృద్ధి' పేరిట స్ట్రేటజీ పేపర్ వెల్లడించింది. ప్రైవేటు పెట్టుబడిని తప్పక అనుమతించాలని, మధ్యవర్తిత్వం, నియంత్రిత వ్యవస్థలతో సులభతరం చేయాలని సూచించింది. ఎగుమతి సామర్థ్యాన్ని ఉపయోగించుకోవాలని పేర్కొంది. మరో సంస్థ సిఐఐ 2022లో పాల వ్యాపారానికి అదనపు ప్రేరణ ఇవ్వడానికి ప్రభుత్వ-ప్రైవేటు భాగస్వామ్యం పెంచాలని తెలిపింది. రైతులకు సబ్సిడీలు, సంస్థాగత పరపతి కోసం కార్పొరేట్ రంగం ఎక్కువగా పాల్గొనాలని, కొత్త సాంకేతిక పరిజ్ఞానం, మెరుగైన ప్రాసెసింగ్, మార్కెటింగ్, రైతులతో టై-అప్ పెరగాలని పేర్కొంది.

కేంద్ర నియంత్రణలోకి

2021 వరకు సహకార విభాగం వ్యవసాయ మంత్రిత్వశాఖలో ఒక చిన్న విభాగం. అకస్మాత్తుగా మోడీ ప్రభుత్వం సహకార విభాగాన్ని కేబినెట్ మంత్రి బాధ్యతలతో స్వతంత్ర మంత్రిత్వశాఖ స్థాయికి పెంచింది. కేబినెట్‌లో రెండవ స్థాయిలో ఉన్న అమిత్‌షా ఆ విభాగానికి మంత్రి కావడం గమనార్హం. సహకార మంత్రిత్వశాఖ ఏర్పడిన రెండు వారాల వ్యవధిలో భారత పాల రంగంలో ప్రైవేటు పెట్టుబడులను ప్రోత్సహించడానికి ఒక ప్రైవేటు ఇన్వెస్టుమెంట్ యాక్సిలరేటర్‌ను నెలకొల్పుతున్నట్లు మోడీ ప్రభుత్వం ప్రకటించింది. ఇది పెట్టుబడిదారులతో పని చేయడానికి ఏర్పాటు చేసిన నిర్వహణ బృందమని పేర్కొంది. కేంద్రం నియంత్రణ కిందికి సహకార వ్యవస్థను తీసుకొచ్చే ప్రక్రియ మొదలు పెట్టింది. పెట్టుబడిదారులకు వ్యాపార సౌలభ్యం కలిగించేందుకు, సరఫరా గొలుసులో కార్పొరేట్ల ప్రవేశానికి ఇది పనికొస్తుంది. కొత్త మంత్రి అమిత్‌షా, బహుళ రాష్ట్ర సహకార సంఘాల (ఎంఎస్‌సిఎస్) బిల్లును ప్రవేశపెట్టారు. సొసైటీలో ముగ్గురు పాలనాధికారుల నియామకం, ఎన్నికల నిర్వహణ, ఆడిటింగ్‌కు కేంద్రానికి అధికారం ఇస్తుంది. ఎంఎస్‌సిఎస్ రాష్ట్రాల హక్కులను కాలరాస్తుంది. పార్లమెంట్‌లో బిల్లు ప్రవేశపెట్టడానికి కొద్ది నెలల ముందు, సిక్కింలో అమిత్‌షా మాట్లాడుతూ మల్టీ స్టేట్ మిల్క్ కోఆపరేటివ్ అన్నారు. ఐదు పాల సహకార సంస్థలతో ఏర్పడింది. అందువల్ల నందిని, అమూల్ విలీనం, షా చెప్పినట్లు దేశంలో రెండు పెద్ద కోఆపరేటివ్స్ మధ్య పరస్పర సహకారం కోసం కాదు. ప్రైవేటు పెట్టుబడి ప్రవేశంతో కేంద్ర పాలనలో మల్టీ స్టేట్ సొసైటీగా మార్చడం. అందుకే కర్ణాటక బిజెపి నేతలు హోం మంత్రి ప్రకటనను తిమ్మినిబమ్మిని చేసే ప్రయత్నం చేస్తున్నా ప్రజలు నమ్మడంలేదు. పాల సహకార రంగాన్ని కార్పొరేటీకరించడం ద్వారా ప్రపంచ పాల మార్కెట్‌లో చేరేందుకు మూడు ఎగుమతి ఆధారిత మల్టీ స్టేట్ మిల్క్ సొసైటీలను ఏర్పాటు చేస్తున్నామని, ఎగుమతులను ప్రోత్సహించేందుకు పని చేస్తాయని ఈ ఏడాది జనవరి 11న ప్రధాని ప్రకటించారు. అమూల్‌ను పాల ఎగుమతికి ప్రమోటర్‌గా జనవరి 23న నియమించారు. ప్రపంచ పాల ఎగుమతుల్లో 33 శాతం వాటా సాధించడం, ప్రాసెసింగ్, ఎగుమతి వాణిజ్యంలో పెట్టుబడులు ఆకర్షించడం లక్ష్యమని చెప్పారు.

రెండు లక్షల సంఘాల నిర్మాణం

ఈ ఏడాది మార్చి 10న జరిగిన గుజరాత్‌లోని ఇండియన్ డెయిరీ అసోసియేషన్ వార్షిక సమావేశంలో అమిత్‌షా మాట్లాడుతూ దేశ వ్యాప్తంగా రెండు లక్షల పంచాయతీలలో స్వతంత్ర పాల సొసైటీలను ఏర్పాటు చేస్తామని, ఇవి అమూల్ నేతృత్వంలోని ఎగుమతి ఆధారిత సొసైటీతో ముడిపడి ఉంటాయన్నారు. ప్రస్తుత సహకార వ్యవస్థ ఎగుమతి మార్కెటింగ్‌కు వడ్డించే అమూల్ సామ్రాజ్యంలో భాగమని స్పష్టం చేశారు. ఈ వ్యూహాన్ని కొనసాగిస్తూ అమూల్ మేనేజింగ్ డైరెక్టర్ మెహతా ఏప్రిల్ 5న అమూల్ తాజా పాలు, పెరుగు అమ్మకాలు బెంగళూరులో ప్రారంభమవుతాయని ప్రకటించారు. ఏప్రిల్ 9న ఫైనాన్షియల్ ఎక్స్‌ప్రెస్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో ఆరు మాసాల్లోనే బెంగళూరులో ఆధునిక వాణిజ్యంతో అమూల్ ప్రవేశం జరుగుతుందని స్పష్టం చేశారు. స్వతంత్ర పాల సంఘాల ఏర్పాటు ద్వారా అమూల్ పాలను సేకరించి నందినికి సమాంతరంగా వ్యాపారం చేస్తుందన్నమాట. ఇది కచ్చితంగా నందిని మనుగడకు హానికరం. దాని సరఫరా గొలుసును దెబ్బతీయడంతోపాటు, కార్యకలాపాలను ఆక్రమించు కుంటుంది. ఈ క్రమం కర్ణాటక రైతుల భయం నిజమని తేలుస్తుంది. ఇది కేవలం అమూల్-నందినికే పరిమితం కాదు. పాల సహకార సంస్థలను కార్పొరేట్లు స్వాధీనం చేసుకునే కేంద్రీకరణ. మొదట్లో పాల ఉత్పత్తిదారులకు ఎక్కువ ఆదాయం లభించినా భవిష్యత్తులో మొత్తం పాల ఆర్థిక వ్యవస్థకు ప్రభుత్వ రక్షణ ఉండదు. స్వేచ్ఛా మార్కెట్‌లో ప్రపంచ పాల ఆర్థిక వ్యవస్థకు లోబడి ఉంటుంది. ఇప్పటికే వ్యవసాయ సంక్షోభంతో కొట్టుమిట్టాడుతున్న గ్రామీణ భారతాన్ని మరింత అతలాకుతలం చేస్తుంది. పాల రంగం పల్లె కుటుంబాలను కొంత వరకు నిలబెట్టగా కార్పొరేటీకరణ ఆ ఆసరానూ తొలగిస్తుంది. ఇది కర్ణాటకలోని 25 లక్షల మంది రైతులనే కాకుండా గుజరాత్‌లో పాల ఉత్పత్తిదారులతో సహా దేశంలో గల పది కోట్ల మంది రైతులను దెబ్బతీస్తుంది. రైతుల ఉమ్మడి ప్రయోజనాల కోసం పని చేసే నిజమైన సహకార విధానమే నందినికి, అమూల్‌కు, యావత్ దేశానికి రక్ష. ★

ఆధిపత్య సంస్కృతి - గ్రాంసీ వెలుగులో ప్రతిఘటన

నివాళి

కె. శాంతారావు

> సాంస్కృతిక రంగంలో వర్గపోరాటం అంటే కేవలం రాజ్యంపై అస్త్రాలను ఎక్కుపెడితే చాలదు. తనతో సహా తన చుట్టూ ఉన్న సమాజాన్ని నిత్య జాగరూకతతో పరిశీలించడం, సరిచేసుకోవడం, అధ్యయనం చేయడం, శాంతియుత సహజీవనానికి నడుం కట్టడం అనివార్యం. ఈ కృషిలో పీడిత వర్గాల నుండి లేదా నిస్వార్థంగా ఆ వర్గాల హక్కులకు కట్టుబడే సజాతి కళాకారులు, మేధావుల (ఆర్గానిక్ ఆర్టిస్ట్స్, ఇంటలెక్టువల్స్) కృషి అపారంగా తోడ్పడుతుందని తెలుపుతాడు. ఇప్పుడు మనకు ఎదురవుతున్న ఫాసిస్టు ప్రమాదంలో సాంస్కృతిక ప్రతివ్యూహంగా మనం చేపట్టాల్సిన పనులు ఇవే.

వర్గ చైతన్యమే వర్గ పునాది అని భావించినవారు, ఆ చైతన్యాన్నే పరమావధిగా తలచి ఎప్పటికప్పుడు అధ్యయనంతో తమ ప్రాపంచిక వర్గ దృక్పథాన్ని పదునుపెట్టుకుంటూ ఉంటారు. తాము తెలుసుకున్న జ్ఞానాన్ని శ్రేణులకు, స్నేహితులకు, ఆ తర్వాత ప్రజలకు ఉద్యమాల ద్వారా వంట పట్టించేలా పాటుపడతారు. తత్సంబంధిత వ్యూహాలు, ప్రణాళికలు రచించి పాఠశాలలు, గోష్ఠులు, సదస్సులు నిర్వహించడం కమ్యూనిస్టులకు కొత్తేం కాదు. అయితే ఇది నిబద్ధతతో కూడిన నిత్య ప్రక్రియ. ఈ ప్రక్రియలో ఏ మాత్రం అలక్ష్యం, శూన్యం ఆవహించినా, ఆ శూన్యంలోకి అన్యవర్గ భావజాలమో, ఆధిపత్య భావజాలమో రాకమానదు. అందుకే చైతన్య వంతమైన కార్యకర్తలు నిత్య జాగరూకతతో ఎప్పటికప్పుడు అప్రమత్తులవుతూ ఉంటారు. ఎందుకంటే మానవాళి విముక్తికి దారిదీపం వర్గ సంఘర్షణే కదా!

సాంస్కృతిక చైతన్యం అనేది విడదీయలేని జంటపదం. సంస్కృతి స్థలకాలాదులకు లోబడి ఉంటుంది. ప్రాంతానికి ప్రాంతానికి, తరానికి తరానికి మారుతూనే ఉంటుంది. ఓ సామూహిక జీవన విధానంగా 'సంస్కృతి'ని నిర్వచించినప్పుడు ఆచార వ్యవహారాలు, కట్టుబాట్లు, అలవాట్లతో పాటు భాష, భావధార (ఆలోచనా తీరు) కూడా సంస్కృతిలో అంతర్భాగం అవుతుంది.

సాంస్కృతిక ఆధిపత్యం (హెజిమోని) అంటే సైద్ధాంతిక సాంస్కృతిక మార్గాల్లో పాలకులు పట్టు సంపాయించడం అని గ్రాంసీ పేర్కొంటాడు. అందుకు విలువలు, ఆలోచనలు, అంచనాలు చివరకు ప్రాపంచిక దృక్పథాన్ని సైతం వారు తలకిందులు చేయగలరు. ఆచరణలో అవి అలా బలంగా సాగేలా అధికారంలో ఉన్నవారు వ్యవహరిస్తారు. మీడియాతో సహా సకల రాజకీయ, ఆర్థిక సంస్థలను వారికి దాసోహం అయ్యేలా వారు చేసుకుంటారు.

పాలకవర్గం తనదైన ఆధిపత్యాన్ని, దృక్పథాన్ని రూపొందించే క్రమంలో సాంస్కృతిక జాతీయవాదాన్ని సృష్టించి బలంగా రుద్దుతుంది. దేశ సమాజం కోసమే తమ ఆర్థిక, రాజకీయ, నిర్మాణాలని పదే పదే చెబుతుంది. నిజంగానే వీటిని మేధావులతో సహా చాలామంది విశ్వసిస్తారు కూడా. అయితే వాస్తవంగా ఆ నిర్మాణాలు పాలకవర్గానికే ఉపయోగపడతాయి. 'పాలకవర్గం వాటిని గుప్పెట పట్టి వాటి ద్వారా సమాజంపై పట్టును బిగదీస్తుంది' అంటాడు గ్రాంసీ.

రాజ్యాంగ వ్యవస్థలు - ఎన్నికల కమిషన్, కోర్టు, ఇ.డి, ఐ.టి, మీడియా మొదలైన వాటిని తమకు అనుకూలంగాను, ప్రత్యర్థులకు వ్యతిరేకంగానూ ఉపయోగించడం నేడు మనం కళ్ళారా చూస్తున్నాం.

దీనినే మరోలా కూడా చెప్తాడు గ్రాంసీ. 'పాలకవర్గ భావాలు కేవలం రాజ్యం ద్వారా మాత్రమే తమ ఆధిపత్యాన్ని చెలాయించలేవు. రాజ్యం అనేది కేవలం కోట ముంగిట ఉండే కందకం వంటిది మాత్రమే. కోట - కోట లోపల అనేక మార్గాలు, కట్టడాలు మాదిరి అనేక అంశాలు, వ్యవస్థలు పాలకవర్గ సాంస్కృతిక ఆధిపత్యాన్ని బలోపేతం చేస్తాయి.

20వ శతాబ్దంలో ప్రజాస్వామ్య సంస్కృతి బలోపేతం అయ్యింది. రెండు ప్రపంచ యుద్ధాల ద్వారా పెల్లుబికిన విశ్వశాంతి ఉద్యమం, సామ్రాజ్యవాద వ్యతిరేక పోరాటాలు, వలసపాలనా విముక్తి స్వతంత్ర పోరాటాలు, అన్నింటికీ మించి దోపిడీ. అణచివేత వ్యతిరేక పోరాటాలు మానవీయ పతాకను ఎత్తిపట్టాయి. మనిషిని మనిషిగా చూడాలనే ఆధునిక భావనకు ఊపిరిలూదాయి. ఈ క్రమంలో ప్రజాస్వామ్య సంస్కృతి అనేది ఓ జీవన విధానంగా రాజకీయ కార్యకలాపాల్లోనే కాకుండా నిత్య దైనందిన కార్యక్రమాల్లో భాగస్వామ్యం అయ్యింది. అంతిమంగా సాటి మనిషిని గౌరవించడం, వారి హక్కులను గుర్తించడం, బాధితులకు, శ్రామికులకు అండగా నిలబడటం ఓ మానవీయ సంస్కృతిగా పరిఢవిల్లింది.

గ్రాంసీ మానవ హక్కుల కోణంలో మనిషి సంస్కృతిని పరిశీలించే తీరు ఆసక్తిగా ఉంటుంది. ఇందుకు నాలుగు ప్రతిపాదనలు చేశాడు.

1. ప్రతి వ్యక్తి సమాజాన్ని ఏ విధంగా ప్రభావితం చేస్తాడో, తిరిగి సమాజంచేత ఏ విధంగా ప్రభావితం అవుతాడో తెలుసుకోవడం అవసరం. మనిషి సంఘ జీవి అయినప్పుడు, అతని సామాజిక స్పృహను అంచనా వేసుకోవాలి. తన వ్యక్తిత్వాన్ని మార్చుకోవడం అంటే సమాజాన్ని మార్చుకోవడం అని గ్రహించాలి.
   మనిషిని గురించి అంచనా వేసే మార్గంలో ఆ మానవ సమాజానికి లభిస్తున్న విజ్ఞాన శాస్త్రానికి, పారంపర్యంగా వస్తున్న తత్వజ్ఞానానికి మధ్య గల సంబంధాన్ని కూడా అధ్యయనం చేయాలని చెపుతాడు. ఇదే వైయుక్తిక అంశానికి - ప్రాకృతిక ప్రపంచానికి గల అంతర్లీన సంబంధంగా భావిస్తాడు.
2. మానవ హక్కుల కేంద్రం సమాజమే తప్ప రాజ్యం కాదు అని తేల్చిచెబుతాడు. అంతేకాదు చైతన్య రహిత తిరుగుబాటు మానవ హక్కులకు ప్రమాదం అని కూడా అంటాడు.
   మనిషి తన అవసరాలు తీర్చుకునే క్రమంలో ఏర్పరుచుకున్న ఉత్పత్తి (మానవ) సంబంధాలను, ప్రకృతిని మార్చుకోవలసి ఉంటుంది. ఆ ఘర్షణలో మానవ హక్కులు ఉనికిలోకి వస్తాయి.
   మానవ హక్కుల ఉద్యమం - మనుగడ పరిణతిపైనే రాజ్యం స్వభావం ఆధారపడి ఉంటుంది. రాజ్యాన్ని ప్రధాన చోదక శక్తిగా చేసి సమాజాన్ని ద్వితీయ శ్రేణిగా భావిస్తే మానవ హక్కుల అభివృద్ధి తిరోగమనంలో పడుతుందని గ్రాంసీ వివరిస్తాడు.
   అంటే ఇక్కడ ఉపశ్రేణులను, ప్రజా సంఘాలను, ప్రజా ఉద్యమాలను నిత్యం పనిలో ఉంచుతూ సామాజిక చైతన్యానికి అగ్రతాంబూలం ఇవ్వాలని వక్కాణిస్తాడు.
3. కింది వర్గాలలో చైతన్యమవుతున్నవారిని తమకు అనుకూలంగా మార్చుకుని, ఆ కింది వర్గాలపైనే పెత్తనం చేసే పద్ధతిని 'అణుపరిణామం'గా వర్ణిస్తాడు. నయానో, భయానో వారిని రాజ్యాధికారంలో కలుపుకోవడం. ఇది నిజంగా పీడితవర్గాల స్వేచ్ఛాభివృద్ధికి పెద్ద ఆటంకం. ఈ ప్రక్రియ ద్వారా వారి సాంస్కృతిక చైతన్యం గందరగోళంలో పడుతుంది.
   సమాజంలో అణచివేతకు గురయ్యే అట్టడుగు వర్గాలవారు సహజంగానే తమ హక్కులను కోల్పోతారు. ఆ కోల్పోయే తీరును అనివార్యంగా తమ కళల్లో వ్యక్తీకరిస్తారు. అటువంటి కళాకృతులను 'సబ్-ఆల్ టర్న్' అంటాడు గ్రాంసీ. వీటిని లోతుగా అధ్యయనం చేస్తేనే సామాజిక - సాంస్కృతిక చైతన్యం ఒకదానితో ఒకటి పెనవేసుకున్న తీరు అర్థం కాదు. వీటిని శ్రద్ధగా వృద్ధిచేసుకోవాలి.
4. ఇక చివరిగా రాజ్యం - పౌర సమాజం - వర్గం అనే త్రికోణంలో బందీ అయిన మనిషి, ఏ ఒక్కదాన్నో విమర్శించి, మిగిలినవాటి పట్ల అంత శ్రద్ధ చూపకపోతే మనిషి సమూలంగా విముక్తి కావడం అసాధ్యం అని పేర్కొంటాడు.

అందుకే సాంస్కృతిక రంగంలో వర్గపోరాటం అంటే కేవలం రాజ్యంపై అస్త్రాలను ఎక్కుపెడితే చాలదు. తనతో సహా తన చుట్టూ ఉన్న సమాజాన్ని నిత్య జాగరూకతతో పరిశీలించడం, సరిచేసుకోవడం, అధ్యయనం చేయడం, శాంతియుత సహజీవనానికి నడుం కట్టడం అనివార్యం. ఈ కృషిలో పీడిత వర్గాల నుండి లేదా నిస్వార్థంగా ఆ వర్గాల హక్కులకు కట్టుబడే సజాతి కళాకారులు, మేధావుల (ఆర్గానిక్ ఆర్టిస్ట్స్, ఇంటలెక్టువల్స్) కృషి అపారంగా తోడ్పడుతుందని తెలుపుతాడు. ఇప్పుడు మనకు ఎదురవుతున్న ఫాసిస్టు ప్రమాదంలో సాంస్కృతిక ప్రతివ్యూహంగా మనం చేపట్టాల్సిన పనులు ఇవే.

/ వ్యాసకర్త సెల్: 9959745723 /
(నేడు ఆంటోనియా గ్రాంసీ 86వ వర్ధంతి)

జనవాక్యం

గ్రంథాలయాలలో పుస్తకాలేవీ...

గ్రంథాలయాలలో అన్ని రకాల పుస్తకాలు వుంచాలని పాఠకులు కోరుతున్నారు. లైబ్రరీలో వార, మాస పత్రికలు లేకపోవడంతో గ్రంథాలయాలకు వచ్చే పాఠకులు సంఖ్య గణనీయంగా తగ్గిపోతుందని పుస్తక ప్రియులు ఆవేదన చెందుతున్నారు. కరోనా తర్వాత పుస్తకాలు రేట్లు పెరగటంతో గ్రంథాలయాలకు వార, మాస పత్రికలను తగ్గించారు. దీంతో యువత గ్రంథాలయాలకు రావటం పూర్తిగా మానివేశారు. ఈ నేపథ్యంలో లైబ్రరీలో పాఠకులు లేక వెలవెల పోతున్నాయి. ఈ విషయాన్ని సిబ్బంది దృష్టికి తీసుకెళితే...బడ్జెట్ లేని కారణంగా అన్ని రకాల పుస్తకాలు పాఠకులకు అందించలేక పోతున్నామని వారు చెబుతున్నారు. గ్రంథాలయాల సెస్‌ను స్థానిక పంచాయితీలు ప్రజల నుంచి వసూలు చేస్తున్నారు. ఆ సొమ్ముతో గ్రంథాలయాలలో పాఠకుల అభిరుచిగల పుస్తకాలు వుంచాలి. లేదంటే మండల, గ్రామీణ స్థాయి గ్రంథాలయాలు మొక్కుబడిగా తయారవుతాయనటం అతిశయోక్తి కాదేమో!

- జి.సూర్యనారాయణ,
బందలాయి చెరువు, కృష్ణా జిల్లా.

మీ రచనలను పంపాల్సిన మెయిల్ :
editpageps@ gmail.com

Chola Enter a better life

చోళమండలం ఇన్వెస్ట్‌మెంట్ & ఫైనాన్స్ కంపెనీ లిమిటెడ్

కార్పొరేట్ ఆఫీసు: 1వ అంతస్తు, 'దరే హౌస్', నం.2, ఎన్.ఎస్.సి.బోస్ రోడ్, చెన్నై-600001.
బ్రాంచి చిరునామా: 1&4వ అంతస్తు, శాంతి ప్లాజా, డోర్ నం.59-14-2ఎ, గాయత్రి నగర్, బెంజ్ సర్కిల్, విజయవాడ-520008.

స్వాధీనతా ప్రకటన (రూల్ 8(1) క్రింద)

ఏదైతే, క్రింది సంతకందారు **మెసర్స్ చోళమండలం ఇన్వెస్ట్‌మెంట్ & ఫైనాన్స్ కంపెనీ లిమిటెడ్** యొక్క అధీకృత అధికారిగా, సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ అండ్ ఎన్ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటెరెస్ట్ యాక్ట్, 2002 (54 ఆఫ్ 2002), మరియు ది సెక్యూరిటీ ఇంటెరెస్ట్ (ఎన్ఫోర్స్‌మెంట్) రూల్స్, 2002 యొక్క రూల్ 9తో చదువబడే సెక్షన్ 13(12) క్రింద సంక్రమించిన అధికారాలను వినియోగించుకొని, దిగువ పేర్కొన్న తేదీనాటి డిమాండ్ నోటీసు జారీచేసి, సదరు నోటీసు స్వీకరణ తేది నుండి 60 రోజుల్లోగా కాలం (సి)లో సూచించిన తేదీన దిగువ కాలం (బి)లో సూచించిన పేర్లకు ఎదురుగా, కాలం (డి)లో పేర్కొన్న సదరు నోటీసులో పేర్కొనబడిన మొత్తాలు మరియు దానిపై వడ్డీని తిరిగి చెల్లించవలసిందిగా కోరబడినది. ఇందు దిగువ పేర్కొనబడిన రుణగ్రహీతలు మొత్తాలను తిరిగి చెల్లించుటలో విఫలం చెందియున్నందున, ఇందు దిగువ పేర్కొనబడిన రుణగ్రహీతలకు మరియు సర్వజనులకు ఇందుమూలంగా ప్రకటన ఇవ్వడమేమనగా, ది సెక్యూరిటీ ఇంటెరెస్ట్ (ఎన్ఫోర్స్‌మెంట్) రూల్స్, 2002 యొక్క రూల్ 9తో చదువబడే చట్టం యొక్క సెక్షన్ 13(4) క్రింద నాకు సంక్రమించిన అధికారాలను వినియోగించుకొని కాలం (ఇ)లో వివరించిన కంపెనీతో తాకట్టుపెట్టి ఆస్తులను, కాలం (ఎఫ్)లో పేర్కొన్న తేదీలలో క్రింది సంతకందారు **స్వాధీనంచేసుకున్నారు.** ప్రత్యేకించి ఇందు పై పేర్కొన్న రుణగ్రహీతలు మరియు సర్వజనులను ఇందుమూలంగా హెచ్చరించడమేమనగా, ఇందు దిగువ పేర్కొన్న కాలం (డి)లో పేర్కొన్న మొత్తాలును దానిపై వడ్డీతోసహా **మెసర్స్ చోళమండలం ఇన్వెస్ట్‌మెంట్ అండ్ ఫైనాన్స్ కంపెనీ లిమిటెడ్**కు చార్జ్‌చేయుట ప్రాతిపదికన ఆస్తితో లావాదేవీలు జరుపరాదు. చట్టం యొక్క సెక్షన్ 13(8) యొక్క నియమాల క్రింద, రుణగ్రహీతలు సెక్యూర్డ్ అసెట్స్‌ను విడిపించుకొనుటకు, అందుబాటులోగల సమయంకు సంబంధించి, అమ్మకం ప్రకటనకు ముందు అన్ని ఖర్చులు, చార్జీలు మరియు వ్యయాలతో పూర్తి బకాయిని చెల్లించుటకు లోబడి రుణగ్రహీత సెక్యూర్డ్ అసెట్‌ను విడిపించుకొనవచ్చును.

క్ర.సం. [A]	రుణగ్రహీతలు పేరు & చిరునామా & రుణఖాతా నంబరు [B]	డిమాండ్ నోటీసు తేది [C]	బకాయి మొత్తాలు [D]	ఆస్తి వివరణ [E]	స్వాధీనత తేది [F]
1	1. **శ్రీ ముంగపాటి గోపి,** తండ్రి ముంగపాటి నారాయణ స్వామి (దరఖాస్తుదారు). 2. **శ్రీమతి రాధ ముంగపాటి,** భర్త ముంగపాటి గోపి (సహ-అభ్యర్థి): ఇరువురి నివాస చిరునామా: డోర్ నం.8-310, భార్గవ పేట, మంగళగిరి, గుంటూరు, ఆం.ప్ర.-522503. 3. **శ్రీ ముంగపాటి గోపి,** తండ్రి ముంగపాటి నారాయణ స్వామి (దరఖాస్తు), **కేరాఫ్ మెసర్స్ ముంగపాటి గోపి గోల్డ్ వర్క్ షాపు,** డోర్ నం.11-57-9, వేంకటేశ్వర కాంప్లెక్స్, షాపు నం.19, శివాలయం వీధి, వన్ టౌన్, విజయవాడ-520001. **(రుణ ఖాతా నం.లు X0HEVIJ00002432072 & X0HEVIJ00003289817)**	10-02-2023	07.02.2023 నాటికి రూ. 21,39,308/- మరియు దానిపై వడ్డీ	గుంటూరు జిల్లా, మంగలగిరి సబ్-డివిజన్, మంగలగిరి మున్సిపల్ ఏరియా, భార్గవపేట, డోర్ నం.8-310, అసెస్మెంట్ నం.1023004909, వార్డు నం.8, విస్తీర్ణం 103చ.గ.లు లేదా 86.11చ.మీ.ల మొత్తం ల్యాండ్ మరియు దానిపై నిర్మాణం. **సరిహద్దులు:** తూర్పు: ఎఫ్-షెడ్యూలు (ఎం. చంద్రశేఖర్), దక్షిణం: ఎం. సుబ్బారావు ఆస్తి, పడమర: 5 వెడల్పు బజార్, ఉత్తరం: ఎం. సాంబశివ రావు ఆస్తి.	26.04.2023

ప్రదేశం: విజయవాడ, తేది: 27.04.2023 సం/- అధీకృత అధికారి, మెసర్స్ చోళమండలం ఇన్వెస్ట్‌మెంట్ & ఫైనాన్స్ కంపెనీ లిమిటెడ్ తరపున

ఐఐటి ఖరగ్‌పూర్ విద్యార్థి మృతదేహానికి
మరోసారి పోస్ట్‌మార్టం

- కోల్‌కతా హైకోర్టు ఆదేశం

కోల్‌కతా : అనుమానాస్పద మృతిగా ఆరోపిస్తున్న ఐఐటి ఖరగ్‌పూర్ విద్యార్థి మృతదేహానికి మరోసారి పోస్ట్‌మార్టమ్ నిర్వహించాలంటూ బుధవారం కోల్‌కతా హైకోర్టు ఆదేశించింది. ఫైజాన్ అహ్మద్ గతేడాది అక్టోబర్ 14న హాస్టల్ రూమ్‌లో విగతజీవిగా కనిపించాడు. అతను ఆత్మహత్య చేసుకున్నట్లు కళాశాల యాజమాన్యం ఆరోపిస్తుండగా, తమ కుమారుడిని హత్య చేశారని విద్యార్థి తల్లిదండ్రులు చెబుతున్నారు. అప్పటికే విద్యార్థి మృతదేహానికి అస్సాంలో అంత్యక్రియలు నిర్వహించారు. దీంతో వాస్తవాలు వెలుగులోకి వచ్చేందుకు తప్పనిసరిగా మరోసారి పోస్ట్‌మార్టమ్ నిర్వహించాలని జస్టిస్ రాజశేఖర్ మంథా ఆదేశించారు. ఈ విషయంలో దర్యాప్తు అధికారి అస్సాం పోలీసుల సమన్వయంతో మృతదేహాన్ని బయటకు తీసి... కోల్‌కతాకు తీసుకువచ్చి మరోసారి పోస్ట్‌మార్టమ్ నిర్వహించాలని ఆదేశించారు. ఈ కేసులో కోల్‌కతా ప్రముఖ న్యాయవాది సందీప్ భట్టాచార్య అమికస్ క్యూరీ పిటిషన్ దాఖలు చేశారు. విద్యార్థి శరీరంపై రెండు గాయాలు కనిపిస్తున్నాయని పేర్కొన్నారు. బాధితుడి తల వెనుక భాగంలో వైద్యపరంగా 'హెమటోమా' అని పిలువబడే రెండు గాయాల తాలూకు గుర్తులు ఉన్నాయని, పోస్ట్‌మార్టమ్ రిపోర్ట్‌లో గాయాల ప్రస్తావన లేదని పేర్కొన్నారు. మృతదేహంపై సోడియం నైట్రేట్ రసాయనం పదార్థాన్ని పోలీసులు గుర్తించారని తెలిపారు. సాధారణంగా ఈ రసాయనాన్ని మాంసం నిల్వ చేసేందుకు వినియోగిస్తారని వివరించారు. మూడురోజులైనా మృతదేహం నుండి ఎలాంటి వాసన రాలేదని, ఒక విద్యార్థి మరణిస్తే తోటి హాస్టల్ విద్యార్థులు గుర్తించకపోవడం ఆశ్చర్యమని పేర్కొన్నారు. మృతదేహంపై రసాయనం ఆనవాళ్ల ప్రకారం, విద్యార్థి మరణించిన అనంతరం మూడు రోజుల పాటు భద్రపరిచేందుకు వినియోగించి ఉంటారని... ఇది తీవ్రమైన నేరంగా పేర్కొన్నారు. ఈ కేసుకు సంబంధించి గతేడాది డిసెంబర్‌లో ఐఐటి ఖరగ్‌పూర్ డైరెక్టర్ను తొలగించిన సంగతి తెలిసిందే.

ఆర్‌కె.బీచ్‌లో మహిళ మృతదేహం

ప్రజాశక్తి -ఎంవిపి కాలనీ

విశాఖపట్నం ఆర్‌కె.బీచ్ వైఎంసిఎ సమీపంలో బుధవారం మహిళ మృతదేహాన్ని స్థానికులు గుర్తించారు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. మృతురాలు పెదగంట్యాడకు చెందిన శ్వేతగా గుర్తించారు. శ్వేత మంగళవారం నుంచి కనిపించడంలేదంటూ న్యూ పోర్టు పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదై ఉంది. ఆమె సూసైడ్ నోట్ రాసినట్టుగా, శరీరంపై గాయాలుండటం, కేవలం లోదుస్తులు మాత్రమే ఉండటంతో పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. శ్వేత భర్త మణికంఠ హైదరాబాద్‌లో ఐటి కంపెనీలో ఉద్యోగం చేస్తున్నారు. శ్వేత పెదగంట్యాడలో అత్తమామలతో కలిసి ఉంటుంది. మృతురాలు ఇంటి నుంచి బయలుదేరడానికి ముందు తన భర్తతో ఫోన్‌లో గొడవపడినట్లు తెలుస్తోంది. తమ కుమార్తె ఆత్మహత్యకు భర్త, అత్తమామలే కారణమని, అత్తింటి వేధింపులు తట్టుకోలేక తమ కూతురు చనిపోయిందని శ్వేత తల్లి రమాదేవి ఆరోపిస్తున్నారు. పెళ్లైన నెల రోజుల నుంచే వేధింపులు ప్రారంభమయ్యాయని, నెల రోజుల క్రితం విడాకులు ఇప్పించాలని శ్వేతను తన భర్త మణికంఠ బెదిరించాడని శ్వేత తల్లి తెలిపారు. తన కూతురు ఐదు నెలల గర్భిణి అని, అయినా కూడా కనికరించకుండా అత్తమామలు చిత్రహింసలు పెట్టేవారని, తల్లిదండ్రుల చర్యలను కొడుకు సమర్థించేవాడని ఆరోపించారు.

ది ఆంధ్రప్రదేశ్ స్టేట్ కో-ఆపరేటివ్ బ్యాంక్ లిమిటెడ్

APCOB

(గవర్నమెంట్ పార్ట్‌నర్డ్ షెడ్యూల్డ్ బ్యాంక్)
హెడ్ ఆఫీస్: 27-29-28, ఎన్.టి.ఆర్. సహకార భవన్, గవర్నర్‌పేట, విజయవాడ-520002,
ఫోన్ : 91333 30132, 94918 15197

బహిరంగ వేలము

(డిప్యూటీ రిజిస్ట్రార్, సహకార సంఘములు / ఆఫీసర్ ఆన్ స్పెషల్ డ్యూటీ, ది ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సహకార బ్యాంక్ లిమిటెడ్, విజయవాడ వారి ఉత్తర్వుల మేరకు)

డిక్రీదారు బ్యాంకు : ది ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సహకార బ్యాంక్ లిమిటెడ్, మొగల్రాజపురం బ్రాంచ్

ARC No.24/SOD/Vijayawada/2019 dt.19.12.2019 EP No.1342/915/3/Vijayawada/2021

తీర్పు ఋణగ్రస్తులు : శ్రీ షేక్ గాలబ్ జానీ

పైన తెలుపబడిన తీర్పు ఋణగ్రస్తుల నుండి బకాయి మొత్తంతేది.**26.04.2023** నాటికి రూ.**7,66,564/-** (అక్షరాల ఏడు లక్షల అరవై ఆరు వేల ఐదు వందల అరవై నాలుగు రూపాయలు మాత్రమే) + తదుపరి వడ్డీ మరియు ఇతర ఖర్చులు.

ARC No.45/SOD/Vijayawada/2019 dt.19.12.2019 EP No.1343/915/19/Vijayawada/2021

తీర్పు ఋణగ్రస్తులు : శ్రీ షేక్ అహ్మద్

పైన తెలుపబడిన తీర్పు ఋణగ్రస్తుల నుండి బకాయి మొత్తం తేది.**26.04.2023** నాటికి రూ.**13,77,597/-** (అక్షరాల పదమూడు లక్షల డెబ్బై ఐదు వేల ఐదు వందల తొంబై ఏడు రూపాయలు మాత్రమే) + తదుపరి వడ్డీ మరియు ఇతర ఖర్చులు

పైన తెలుపబడిన తీర్పు ఋణగ్రస్తులు చెల్లించకపోయినందున ఈ దిగువ తెలుపబడిన స్థిరాస్తులు **APCOB**, మొగల్రాజపురం బ్రాంచ్, ఎన్.టి.ఆర్. జిల్లా ఆవరణములో **ఉ॥ గం॥ 11.30 ని.లకు** బహిరంగ వేలము ద్వారా విక్రయించబడును.

స్థిరాస్తుల వివరములు

క్ర సం	బకాయిదారు పేరు/ చిరునామా	ప్రాంతము/ మండలం	సర్వే నెం. విస్తీర్ణము	సరిహద్దులు	వేలము తేది సమయం	ధరావత్తు
1)	శ్రీ షేక్ గాలబ్ జానీ	ఎన్.టి.ఆర్ జిల్లా, ఇబ్రహీంపట్నం మండలం, కేతన కొండ గ్రామం	సర్వే నెం.43/7, 193.6 చ॥గ॥లు లేదా 161.874 చ॥మీ॥లు విస్తీర్ణం అమ్మకం దస్తావేజు నెం & తేదీ **5184/2016, తేది.18.10.2016**	**తూర్పు** :పంచాయితీ రోడ్డు **పడమర**: షేక్ మౌలాలి & ఇతరులకు చెందిన ఆస్తి, **ఉత్తరం** :షేక అమీర్ గారికి చెందిన ఆస్తి, **దక్షిణం** :సయ్యద్ ఖాసీమ్ గారికి చెందిన ఆస్తి	**04-05-2023 ఉ॥ గం. 11.30 ని॥లకు**	రూ. **10,000/-** మాత్రమే
2)	శ్రీ షేక్ అహ్మద్	కృష్ణా జిల్లా, కంకిపాడు (మం), కంకిపాడు (గ్రా)	సర్వే నెం.3/2, 63.5 చ॥గ॥లు విస్తీర్ణం అమ్మకం దస్తావేజు నెం & తేదీ **7164/2013, తేది.30.11.2013**	**తూర్పు** :పంచాయితీ రోడ్డు **పడమర**: వుండి మద్దిరావమ్మ గారికి చెందిన ఆస్తి, **ఉత్తరం** :షేక్ ఖాసీమ్ సాహెబ్ గారికి చెందిన ఆస్తి, **దక్షిణం** :కంకిపాటి శేషరత్నం గారికి చెందిన ఆస్తి	**04-05-2023 ఉ॥ గం. 11.30 ని॥లకు**	రూ. **10,000/-** మాత్రమే

పైన తెలుపబడిన స్థిరాస్తుల బహిరంగ వేలములో పాల్గొనదలచినవారు ధరావత్తు రూపేణా చూపబడిన మొత్తము **రూ.10,000/-** లు నగదు రూపముగా **సేల్ ఆఫీసర్, O/o డిప్యూటీ రిజిస్ట్రారు / ఓ.యస్.డి, ది ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సహకార బ్యాంక్, గవర్నర్‌పేట, విజయవాడ** వేలము ముందురోజు కాని లేదా వేలము రోజు **ఉ॥ గం॥ 11.00 లకు** జమ చేయవలయును.

గమనిక :

1. వేలములో నిర్ణయించిన పాట మొత్తములో 15% వెనువెంటనే సేల్ ఆఫీసర్ ఖాతాలో జమ చేయవలెను. లేని యెడల పాటదారుడు తాను చెల్లించిన ధరావత్తు తిరిగి ఇవ్వబడదు.
2. మిగిలిన సొమ్ము పాట తేది నుండి 15 రోజులలోగా జమ చేయవలెను. లేని యెడల పాటదారుడు తాను చెల్లించిన మొత్తము సొమ్ము తిరిగి ఇవ్వబడదు.
3. పాటదారుడు పాట సొమ్ము మొత్తముతో పాటు రాష్ట్ర ప్రభుత్వము వారు నిర్ణయించిన స్టాంపు డ్యూటీని కూడా జమచేయవలెను.
4. పై విధముగా చెల్లించని యెడల మళ్ళీ తిరిగి బహిరంగ వేలము ద్వారా అమ్మబడును. దీనికి అగు ఖర్చులకు మరియు ఏర్పడే ఇబ్బందులకు మొదటి పాటదారుడే బాధ్యత వహించవలెను.
5. వేలములో పాల్గొన్నవారు ఇతరుల తరపున అయితే వారి నుంచి వ్రాత పూర్వకముగా ఒక ఆవెూదిత ఉత్తరమును దాఖలు చేయవలెను. లేని యెడల వేలము తిరస్కరించబడును.
6. వేలము తేది నుంచి 30 రోజుల తర్వాత, సేల్ కన్ఫర్మేషన్ సర్టిఫికేట్ రిజిస్ట్రారు గారిచే జారీ చేయబడును.
7. అత్యధిక పాటదారుడు మినహా ధరావత్తు సొమ్మును మిగతా పాటదారులందరికీ పాట అనంతరము అనగా సా॥ గం.5.00 లకు తిరిగి ఇవ్వబడును.
8. వేలము ఏ నిమిషములోనైనను ఎట్టి కారణము తెలుపకుండా నిలిపివేయుటకు, వాయిదా వేయుటకు, రద్దు పరచుటకు సేల్ ఆఫీసర్ గారికి సర్వహక్కులు గలవు.
9. బకాయి దారుడు పాట ముందురోజు సూర్యాస్తమయము లోపల తన ఋణమును పూర్తి పరిష్కారము కావించినచో పాట నిలిపి వేయబడును. ఆసక్తి కలిగిన పాటదారులు ఇతర వివరములకు **సేల్ ఆఫీసర్, O/o డిప్యూటీ రిజిస్ట్రారు / ఓ.యస్.డి, ది ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సహకార బ్యాంకు లి., గవర్నర్‌పేట, విజయవాడ (ఫోన్ : 94918 15197 వారి కార్యాలయ సమయములో సంప్రదించవచ్చును.)**

స్థలము : విజయవాడ
తేది : 27.04.2023

సం/- సేల్ ఆఫీసర్, O/o డిప్యూటీ రిజిస్ట్రార్ / ఓ.యస్.డి.
ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సహకార బ్యాంకు లి., గవర్నర్‌పేట, విజయవాడ

నైపుణ్య కోర్సులపై దృష్టి పెట్టాలి : వాసిరెడ్డి పద్మ

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

ప్రస్తుతం టెక్నాలజీ పెరగడంతో యువత పెడదారి పట్టకుండా టెక్నాలజీని మంచిని స్వీకరించి చెడును తిరస్కరించాలని రాష్ట్ర మహిళా కమిషన్ చైర్‌పర్సన్ వాసిరెడ్డి పద్మ తెలిపారు. నైపుణ్య కోర్సులపై దృష్టి పెట్టాలన్నారు. విజయనగరంలోని గిరిజన విశ్వవిద్యాలయంలో బుధవారం విద్యార్థులకు కెపాసిటీ బిల్డింగ్ అండ్ పర్సనాలిటీ డెవలప్‌మెంట్‌పై సెమినార్ నిర్వహించారు. సెమినార్‌కు రాష్ట్ర మహిళా కమిషన్ చైర్‌పర్సన్ వాసిరెడ్డి పద్మ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ యువతకు ఇలాంటి కెపాసిటీ బిల్డింగ్ శిక్షణలు వారి కెరీర్ లో ఎంతోగానో ఉపయోగపడుతాయని అన్నారు. విద్యార్థులు కేవలం మార్కుల కోసమే చదవకుండా ప్రాక్టికల్ నాలెడ్జ్‌ను పెంపొందించుకోవాలని, కళాశాలల్లో కూడా ఇలాంటి నైపుణ్య శిక్షణలు పెట్టి వాటితో శిక్షణ ఇవ్వాలని అన్నారు. విద్యార్థులు పట్టుదలతో తమలో ఉన్న శక్తిని పెంచుకోవాలని, సెల్ఫ్ మోటివేషన్ ను మించిన మరొకటి లేదని అన్నారు.

ఇఎస్‌జెడ్ పరిధిలో
అభివృద్ధి కార్యకలాపాలపై నిషేధం ఎత్తివేత

న్యూఢిల్లీ : పర్యావరణ సున్నిత జోన్ (ఇఎస్‌జెడ్) పరిధిలో అభివృద్ధి కార్యకలాపాలపై ఉన్న పూర్తి నిషేధాన్ని సుప్రీంకోర్టు బుధవారం ఎత్తివేసింది. ఇఎస్‌జెడ్ పరిధిలో ఫిబ్రవరి 2011 మార్గదర్శకాలను అనుసరించి కేంద్ర పర్యావరణ, అడవులు మరియు వాతావరణ మార్పుల (ఎంఒఇఎఫ్‌సిసి) మంత్రిత్వ శాఖ సూచించిన, ఇఎస్‌జెడ్ నిబంధనలు కమిటీ 2022 ఆఫీస్ మెమోరాండం ప్రకారం అభివృద్ధి కార్యక్రమాలను చేపట్టవచ్చని ఆదేశించింది. ఎంఒఇఎఫ్‌సిసి ద్వారా తగిన నోటిఫికేషన్ జారీ చేయబడిన సందర్భాల్లో 2022 జూన్ 3 నాటి తీర్పు వర్తించదని జస్టిస్ బి.ఆర్.గవాయి, జస్టిస్ విక్రమ్ నాథ్, జస్టిస్ సంజీవ్ కరోల్‌లతో కూడిన త్రిసభ్య ధర్మాసనం పేర్కొంది. అంతర్ రాష్ట్ర సరిహద్దుల్లో ఉన్న లేదా ఉమ్మడి సరిహద్దులను పంచుకునే ఇఎస్‌జెడ్‌లకు ఈ నిషేధం వర్తించదని పేర్కొంది. జాతీయ పార్కులు, సరిహద్దులకు ఒక కిలోమీటరు పరిధి వరకు మైనింగ్ వంటివి చేపట్టకూడదని స్పష్టం చేసింది. పర్యాటకానికి అనుమతిస్తాం.. హోటల్స్, రిసార్ట్ వంటి నిర్మాణాలు చేపట్టవచ్చని పేర్కొంది. రక్షిత వన్యప్రాణుల అభయారణ్యాలు, జాతీయ ఉద్యానవనాలు, అడవుల చుట్టూ కనీసం ఒక కిలోమీటర్ దూరంలో ఉన్న ఇఎస్‌జెడ్ జోన్లలో మైనింగ్‌తో సహా శాశ్వత నిర్మాణాలు చేపట్టకూడదని గతేడాది జూన్‌లో సుప్రీంకోర్టు ఆదేశించిన సంగతి తెలిసిందే. ఈ ఆదేశాలపై కేరళ ప్రభుత్వంతోపాటు పలు రాష్ట్రాలు రివ్యూ పిటిషన్ దాఖలు చేశాయి. రాష్ట్ర భూభాగంలో సుమారు 30 శాతం అడవులే విస్తరించాయని, జనాభా సాంద్రత దృష్ట్యా కోర్టు ఆదేశాలతో రాష్ట్రంలో ఇబ్బందులను ఎదుర్కోవలసి వస్తుందని పిటిషన్‌లో పేర్కొంది. ఈ ఆదేశాల ప్రభావం కేరళ హైకోర్టు భవనంపై కూడా పడిందని పేర్కొంది. కేరళ హైకోర్టు మంగళవనమ్ పక్షి సంరక్షణా కేంద్రానికి 200 మీటర్ల పరిధిలోనే ఉంది.

పబ్లిక్ నోటీసు

ICICI Home Finance

రిజిష్టర్డ్ కార్యాలయం: ఐసిఐసిఐ బ్యాంక్ టవర్స్, బంద్రా-కుర్లా కాంప్లెక్స్, బాంద్రా (ఈస్ట్), ముంబాయి-400051
కార్పోరేట్ ఆఫీసు: ఐసిఐసిఐ హెచ్ఎఫ్‌సి టవర్స్, జెబి నగర్, అందేరి కుర్లా రోడ్, అందేరి తూర్పు, ముంబాయి- 400059
బ్రాంచ్ ఆఫీసు: సుప్రియ టవర్స్, 1వ అంతస్థు, డోర్ నెం. 5-37-155, 4/15 బ్రాడీపేట, గుంటూరు, ఆంధ్రప్రదేశ్ - 522002
బ్రాంచ్ ఆఫీసు: 2వ అంతస్తు, 40-1-129/1, ఆర్‌సిసి భవనం, మహాత్మా గాంధీ రోడ్డు, చంద్రమౌళీపురం, విజయవాడ-520010.

దిగువ రుణగ్రహీత/లు ఐసిఐసిఐ హోమ్ ఫైనాన్స్ కంపెనీ లిమిటెడ్ ("ఐసిఐసిఐ హెచ్ఎఫ్‌సి") నుండి వారి ద్వారా రుణాల సౌకర్యాలు అసలు మరియు వడ్డీ తిరిగిచెల్లించుటలో విఫలమైనారు మరియు రుణాలు నాన్-ఫర్‌ఫార్మింగ్ అస్సెట్స్ (ఎన్‌పిఎ) గా వర్గీకరించబడినాయి. వారి చివరిగా తెలిసిన చిరునామాల మీద సెక్షన్ 13 (2) యొక్క సెక్యూరిటీజైషన్ అండ్ రీ-కన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అస్సెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యురిటీ ఇంటరెస్ట్ యాక్ట్-2002 క్రింద నోటీసు జారీచేయబడింది, అయినప్పటికీ ఇది తీసుకొనబడలేదు మరియు కావునా పబ్లిక్ నోటీసు ద్వారా వారు ఇక్కడ గమనించవలసిందిగా కోరుతున్నాము.

క్ర. సం	రుణగ్రహీత/సహ-రుణగ్రహీత/ హామీదారుడు/ (లోను ఖాతా నంబర్) & చిరునామా	సెక్యుర్డ్ అస్సెట్ ఆస్థి చిరునామా/అమలుచేయబడిన ఆస్థి	పంపబడిన నోటీసు తేది/నోటీసు తేది నాటికి బకాయిలు	ఎన్‌పిఎ తేది
1.	లేట్ నాయుడోల్ల వెంకటేష్ (రుణగ్రహీత), సురేఖ (భర్త. లేట్ నాయుడోల్ల వెంకటేష్ యొక్క చట్టపరమైన వారసులు) (సహ-రుణగ్రహీత), డో.నం.1 1 190 వావిలాల నగర్, సత్తెనపల్లి గుంటూరు గుంటూరు ఆంధ్రప్రదేశ్-522004. LHGTR00001395813.	డో.నం.23 1 64 వావిలాల గ్రామం సత్తెనపల్లి సత్తెనపల్లి 73/2 74/3 గుంటూరు-522004. హద్దులు: ఉత్తరం: ప్లాట్ నం.31 37, దక్షిణం: ఇతరుల యొక్క ఆస్తి 51, తూర్పు: 25 అడుగుల వెడల్పు రోడ్డు 26, పడమర: ఇతరుల యొక్క ఆస్తి 32.	18-04-2023 Rs. 26,01,536/-	09-Apr-2023
2.	లేట్ నాయుడోల్ల వెంకటేష్ (రుణగ్రహీత) సురేఖ (భర్త. లేట్ నాయుడోల్ల వెంకటేష్ యొక్క చట్టపరమైన వారసులు) (సహ-రుణగ్రహీత), డో.నం.1 1 190 వావిలాల నగర్, సత్తెనపల్లి గుంటూరు గుంటూరు ఆంధ్రప్రదేశ్-522004. LHGTR00001398815.	డో.నం.23 1 64 వావిలాల గ్రామం సత్తెనపల్లి సత్తెనపల్లి 73/2 74/3 గుంటూరు-522004. హద్దులు: ఉత్తరం: ప్లాట్ నం.31 37, దక్షిణం: ఇతరుల యొక్క ఆస్తి 51, తూర్పు: 25 అడుగుల వెడల్పు రోడ్డు 26, పడమర: ఇతరుల యొక్క ఆస్తి 32.	18-04-2023 Rs. 1,06,928/-	09-Apr-2023
3.	బోరుగడ్డ విజయ్ కుమార్ (రుణగ్రహీత), నలిగల అనూష (సహ రుణగ్రహీత), డో.నం.16 5 138 పాత గుంటూరు కొత్తపేట బాలాజీ నగర్, గుంటూరు ఆంధ్రప్రదేశ్-522001. LHGTR00001479705.	డో.నం.1019 క్రిస్టియన్ పేట, గుంటూరు గ్రామ పాత గుంటూరు-522001. హద్దులు: ఉత్తరం: బోలమల దాసు యొక్క ఆస్తి, దక్షిణం: 6 అడుగుల వెడల్పు గల్లి బజార్, తూర్పు: బోలమల పెద యొక్క ఆస్తి, పడమర: 20 అడుగుల వెడల్పు రోడ్డు.	13-04-2023 Rs. 26,96,316/-	04-Apr-2023
4.	బోరు గడ్డ విజయ కుమార్ (రుణగ్రహీత), నల్లిగల అనూష (సహ రుణగ్రహీత), డో.నం.16 5 138 పాత గుంటూరు కొత్తపేట బాలాజీ నగర్ గుంటూరు ఆంధ్రప్రదేశ్-522001. LHGTR00001480072.	డో.నం.1019 క్రిస్టియన్ పేట గుంటూరు గ్రామ పాత గుంటూరు-522001. హద్దులు: ఉత్తరం: బోలమల దాసు యొక్క ఆస్తి, దక్షిణం: 6 అడుగుల వెడల్పు గల్లి బజార్, తూర్పు: బోలమల పెద యొక్క ఆస్తి, పడమర: 20 అడుగుల వెడల్పు రోడ్డు.	13-04-2023 Rs. 1,10,742/-	04-Apr-2023
5.	కల్లం లక్ష్మి (రుణగ్రహీత), మాగంటి రాఘవ (సహ రుణగ్రహీత), డో.నం.1 69 ప్రత్తిపాడు రోడ్డు ప్రత్తిపాడు గుంటూరు ఆంధ్రప్రదేశ్-522019. LHGTR00001421944 .	724 బి 723 ఎ లో ఉన్న డో.నం.1-205 బ్లాక్ నం.01 ప్రత్తిపాడు గ్రామ పంచాయతీ మరియు మండలం గుంటూరు జిల్లా-522019. హద్దులు: ఉత్తరం: సర్కార్ బజార్, దక్షిణం: నల్లపాటి ఆది నారాయణ సన్స్ ఆస్తి, తూర్పు: విప్పల వెంకట రెడ్డి, పడమర: బోలె సాయి బాబా.	17-04-2023 Rs. 27,57,751/-	09-Apr-2023
6.	అప్పల ఆనంద కుమార్ (రుణగ్రహీత), ఎ. వెంకటేశ్వరరావు (సహ రుణగ్రహీత), ప్లాట్ నం.302 ఎలైట్ వద్ద ఆంధ్రప్రదేశ్ శ్రీనగర్ గన్నవరం గన్నవరం ఆంధ్రప్రదేశ్-521101. LHVJW00001324972.	హౌ.నం.2-239 బుధవరం రోడ్డు గన్నవరం గ్రామ పంచాయతీ గన్నవరం మండలం 477 2 విజయవాడ-520010. హద్దులు: ఉత్తరం: డా॥ఏకాంబరేశ్వరరావు, దక్షిణం: భాదవరం రోడ్డు, తూర్పు: మహమ్మద్ గాలిబ్బీ యొక్క స్థలం, పడమర: ఎ.వి. సుబ్బయ్య యొక్క స్థలం.	13-04-2023 Rs. 45,77,202/-	04-Apr-2023
7.	అప్పల ఆనంద కుమార్ (రుణగ్రహీత), ఎ. వెంకటేశ్వరరావు (సహ రుణగ్రహీత), ప్లాట్ నం.302 ఎలైట్ వద్ద ఆంధ్రప్రదేశ్ శ్రీనగర్ గన్నవరం గన్నవరం ఆంధ్రప్రదేశ్-521101. LHVJW00001358370.	హౌ.నం.2-239 బుధవరం రోడ్డు గన్నవరం గ్రామ పంచాయతీ గన్నవరం మండలం 477 2 విజయవాడ-520010. హద్దులు: ఉత్తరం: డా॥ఏకాంబరేశ్వరరావు, దక్షిణం: భాదవరం రోడ్డు, తూర్పు: మహమ్మద్ గాలిబ్బీ యొక్క స్థలం, పడమర: ఎ.వి. సుబ్బయ్య యొక్క స్థలం.	13-04-2023 Rs. 2,99,098/-	04-Apr-2023
8.	కొండూరు సునీల్ (రుణగ్రహీత), కొండూరు అనురాధ (సహ రుణగ్రహీత), వాస వైపైప్స్ (సహ రుణగ్రహీత), "డో.నం.21-10/3-104, ఎస్ ఆర్ డబ్ల్యూ నం.321 ఎమ్ఎస్ఎన్ రెసిడెన్సీ, 3వ లైన్ ఫ్లాట్ నం.ఎస్ఎఫ్2, శ్రీ నగర్" విజయవాడ ఆంధ్రప్రదేశ్-520011. LHVJW00001423715.	డోర్ నెం. 42-55-13, ఆర్ఎస్ నం. 17పి, సబ్ డివిజన్ ఆర్ఎస్‌నెం.17/1 , కొత్త మూల్యాంకనం నం.1073056544, గంగానమ్మ గుడి వద్ద అజిత్‌సింగ్ నగర్, విజయవాడ 17/1 విజయవాడ ఆంధ్రప్రదేశ్-520015. హద్దులు: ఉత్తరం: ప్లాట్ నం.1358, దక్షిణం: మున్సిపల్ రోడ్డు, తూర్పు: ప్లాట్ నం.1364, పడమర: ప్లాట్ నం.1360.	13-04-2023 Rs. 49,34,292/-	09-Apr-2023

నోటీసు సర్వీసు ప్రత్యమ్నాయం కొరకు ముందడగు వేయడమైనది. పై రుణగ్రహీత/లు మరియు వారి హామీదారులు (వర్తించబడతారు) ఈ నోటీసు ప్రచురించిన తేది నుండి 60 రోజులలోపట బకాయిలు చెల్లించవలసిందిగా కోరుతున్నాము లేనియెడల సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అస్సెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ యాక్ట్, 2002 ప్రకారం తదుపరిగా ముందడగు వేయడం జరుగుతుంది.

వ.నెం.: 2 ఋణగ్రహీత/తనఖాదారు/హామీదారు యొక్క పేరు & చిరునామా, సింబాలిక్ స్వాధీనత యొక్క తేదీ మరియు సెక్యూర్డ్ ఆస్తుల యొక్క వివరములు:

(1) శ్రీ చేపూరి సుబ్బరాయుడు, (2) శ్రీ సుబ్బ నరసింహులు చేపూరి మరియు (3) శ్రీ శ్రీహరి చేపూరి, 1, 2 & 3 చిరునామా: డోర్ నెం.3-29-13/26, వైట్ హౌస్ దగ్గర, కృష్ణనగర్, గుంటూరు, ఆంధ్రప్రదేశ్- 522006. **సింబాలిక్ స్వాధీనత తేది:** 05.01.2023.
బకాయి మొత్తం: PSTL A/C NO. 2557001600312001 క్రింద బకాయిపడిన మొత్తం అగు **రూ.29,12,919.34/- (అక్షరాల ఇరవై తొమ్మిది లక్షల పన్నెండు వేల తొమ్మిది వందల పంతొమ్మిది రూపాయలు మరియు ముప్పై నాలుగు పైసలు మాత్రమే)** 14-03-2023 తేదీనుండి భవిష్యవడ్డీ + వ్యయాలు.
ఆస్తి యొక్క వివరము: ఆంధ్రప్రదేశ్-522003, గుంటూరు సిటీ మరియు జిల్లా, గుంటూరు మునిసిపల్ కార్పొరేషన్ లిమిట్స్, పెదపలకలూరు గ్రామము, తారకరామనగర్, 10వ లైను, డి.నెం. 280/F నందు మీనాక్షి పామ్స్ అపార్ట్‌మెంట్, మొదటి అంతస్తులో **శ్రీ చేపూరి సుబ్బరాయుడుకి చెందిన** 1050 చ॥అ॥ నిర్మాణపు ఏరియాలోని రెసిడెన్షియల్ ఫ్లాట్ నెం.103 మరియు అవిభాజ్యపు మరియు అనిర్ధిష్టపు భాగమైన 46.59 చ॥గ॥ల స్థలముతో సహా యావదాస్తి. **దీనికి హద్దులు: తూర్పు:** ఇతరుల యొక్క ఆస్తి; **దక్షిణం:** మనిసిపల్ రోడ్డు; **పడమర:** ఇతరుల ఆస్తి; **ఉత్తరం:** ఇతరుల ఆస్తి.

రిజర్వుధర: **రూ.25,55,100/- (అక్షరాల ఇరవై ఐదు లక్షల యాభై ఐదు వేల ఒక వంద రూపాయలు)**
చెల్లించవలసిన బయానా: **రూ.2,55,510/- (అక్షరాల రెండు లక్షల యాభైఐదు వేల ఐదు వందల పది రూపాయలు)**

వ.నెం.: 3 ఋణగ్రహీత/తనఖాదారు/హామీదారు యొక్క పేరు & చిరునామా, సింబాలిక్ స్వాధీనత యొక్క తేదీ మరియు సెక్యూర్డ్ ఆస్తుల యొక్క వివరములు:

(1) మెస్సర్స్ విజయదుర్గ కాటన్ ట్రేడర్స్ తరపున యజమాని: శ్రీ శాఖమూరి ప్రభాకరరావు, చిరునామా: డి.నెం.19/10/136, ఏటుకూరు రోడ్డు, గుంటూరు, ఆంధ్రప్రదేశ్-522003. **(2) శ్రీ రాంబాబు బోడేపూడి, తండ్రి: శ్రీ సుబ్బారావు, (3) శ్రీమతి శాఖమూరి గిరిజకుమారి, భర్త: శ్రీ శాఖమూరి ప్రభాకరరావు, (4) శ్రీమతి భారతిదేవి బోడేపూడి, భర్త: శ్రీ రాంబాబు బోడేపూడి, నెం.(2) నుండి (4) చిరునామా:** ఫ్లాట్ నెం.301, సాయి టవర్స్, శాంతినగర్, 1వ లైను, కొరిటెపాడు, చంద్రమౌళినగర్, గుంటూరు, ఆంధ్రప్రదేశ్-522007. **(5) శ్రీమతి పొలడుగు సుస్మిత, భర్త: శ్రీ వెంకట నారాయణ, నివాసం:** డి.నెం.1-45బి, శివాలయం వీధి, పెదరావూరు, నేలపాడు, గుంటూరు, ఆంధ్రప్రదేశ్-522202. **నిర్మాణాత్మక స్వాధీనత తేది:** 23.03.2022.
బకాయి మొత్తం: PSOD A/c 2557000600474101 క్రింద **రూ.2,21,75,468.37 (అక్షరాల రెండు కోట్ల ఇరవై ఒక్క లక్షల డెబ్బై ఐదు వేల నాలుగు వందల అరవై ఎనిమిది రూపాయలు మరియు ముప్పైఏడు పైసలు మాత్రమే)** 01.04.2023 తేదీనుండి భవిష్యవడ్డీ + వ్యయాలు.
ఆస్తి యొక్క వివరము: ఐటమ్ నెం.1): గుంటూరు, చంద్రమౌళినగర్, 5వ లైను, 2వ క్రాస్ రోడ్డు, డోర్ నెం.5-91-38 నందు కీర్తి టవర్స్, రెండవ అంతస్తులో **శ్రీ రాంబాబు బోడేపూడికి చెందిన** రెసిడెన్షియల్ ఫ్లాట్ నెం.3 మరియు మొత్తం 943 చ॥గ॥ విస్తీర్ణములో అవిభాజ్యపు మరియు అనిర్ధిష్టపు భాగమైన 42.8/9 చ॥గ॥తో సహా యావదాస్తి. **స్థలమునకు హద్దులు: తూర్పు:** సిహెచ్.లక్ష్మీపార్వతి యొక్క ఆస్తి; **దక్షిణం:** యు.వెంకటలక్ష్మి మరియు బి.గోపయ్య యొక్క ఆస్తి; **పడమర:** లక్ష్మీ అపార్ట్‌మెంట్స్ యొక్క ఆస్తి మరియు ఈ ఆస్తి సరిహద్దు గోడ; **ఉత్తరం:** 40 అ॥ వెడల్పుగల రోడ్డు. **ఫ్లాట్‌నకు హద్దులు: తూర్పు:** గ్రౌండ్‌లోని కామన్‌ఏరియా; **దక్షిణం:** ఈ ఫ్లాట్‌కు మరియు ఫ్లాట్ నెం.4 ఉమ్మడిగోడ; **పడమర:** ఉమ్మడి వరండా; **ఉత్తరం:** ఉమ్మడి వరండా మరియు ఈ ఫ్లాట్‌కు మరియు ఫ్లాట్ నెం.1కి మధ్యలోని శూన్యాకాశము.

రిజర్వుధర : **రూ.33,13,000/- (అక్షరాల ముప్పైమూడు లక్షల పదమూడు వేల రూపాయలు మాత్రమే)**
చెల్లించవలసిన బయానా : **రూ.3,31,300/- (అక్షరాల మూడు లక్షల ముప్పై ఒక్క వేల మూడు వందల రూపాయలు మాత్రమే)**

ఐటమ్ నెం.2): గుంటూరు, గుంటూరు మునిసిపల్ కార్పొరేషన్ లిమిట్స్, కొరిటెపాడు గ్రామము, శాంతినగర్, 1వ లైను, డి.నెం.204, డోర్ నెం.4-5-67/6A నందు సాయి టవర్స్ అపార్ట్‌మెంట్, రెండవ అంతస్తులో **శ్రీ శాఖమూరి ప్రభాకరరావు కి చెందిన** రెసిడెన్షియల్ ఫ్లాట్ నెం.301 మరియు మొత్తం 786.6/9 చ॥గ॥ విస్తీర్ణములో అవిభాజ్యపు మరియు అనిర్ధిష్టపు భాగమైన 26 చ॥గ॥తో సహా యావదాస్తి. **స్థలమునకు హద్దులు: తూర్పు:** 40'.0 అ॥ వెడల్పుగల మునిసిపల్ రోడ్డు; **దక్షిణం:** టెలిఫోన్ డిపార్ట్‌మెంట్ యొక్క సరిహద్దు గోడ కొంత మేరకు అక్కడి నుండి మునిసిపల్ స్కూల్ కాంపౌండ్; **పడమర:** టెలిగ్రాఫ్ అసోసియేషన్ మరియు పోస్టల్ యొక్క సరిహద్దు గోడ మరియు ఈ ఆస్తి యొక్క సరిహద్దు గోడ; **ఉత్తరం:** బి.రామారావు యొక్క సరిహద్దు గోడ మరియు ఈ ఆస్తి యొక్క సరిహద్దు గోడ. **ఫ్లాట్‌నకు హద్దులు: తూర్పు:** గ్రౌండ్‌లోని సాయిటవర్స్ యొక్క ఖాళీ ఏరియా; **దక్షిణం:** ఫ్లాట్ నెం.SF2; **పడమర:** వరండా మరియు ఈ ఫ్లాట్‌కు మరియు ఉమ్మడి మెట్లకు మధ్యలోని శూన్యాకాశము; **ఉత్తరం:** గ్రౌండ్‌లోని సాయిటవర్స్ యొక్క ఖాళీ ఏరియా.

రిజర్వుధర : **రూ.28,00,000/- (అక్షరాల ఇరవై ఎనిమిది లక్షల రూపాయలు మాత్రమే)**
చెల్లించవలసిన బయానా : **రూ.2,80,000/- (అక్షరాల రెండు లక్షల ఎనభై వేల రూపాయలు మాత్రమే)**

(సెక్షన్ 13 సబ్ సెక్షన్ (8) చట్టం ప్రకారము ఋణగ్రహీతలు / తనఖాదారులు తమ తనఖా ఆస్తులను విడిపించుకోవటానికి ఉన్న కాలవ్యవధిని వినియోగించుకోగలరు.) (సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్ 2002 యొక్క రూల్ (8) సబ్ రూల్ (6) క్రింద దీనిని నోటీసుగా కూడా పరిగణించబడుతుంది) అమ్మకానికి సంబంధించిన సవివరమైన నియమ నిబంధనల కొరకు **కర్ణాటక బ్యాంక్** యొక్క వెబ్‌సైట్ అనగా **www.karnatakabank.com** లో **"mortgaged assets for sale"** హెడ్ క్రింద సందర్శించండి.
ఇ-వేలము 17.05.2023 తేదీన ఉ॥ 11.00 గం॥ నుండి ఉ॥ గం॥ 11.20 ని॥ల వరకు https://bankauctions.in/ పోర్టల్ ద్వారా 5 నిమిషాల అపరిమిత పొడిగింపుతో నిర్వహించబడును.
ఉద్దేశించిన బిడ్డర్ తమ పేరును **https://bankauctions.in/** నందు నమోదు చేసుకొని, యూజర్ ఐడి మరియు పాస్‌వర్డ్‌ను ఉచితంగా పొందండి మరియు ఇ-వేలంపై శిక్షణను **(తాత్కాలికంగా 16.05.2023న)** ఆన్‌లైన్ ద్వారా **M/s.4closure,** 605ఎ, HMDA మైత్రీవనం, అమీర్‌పేట, హైదరాబాద్, తెలంగాణ-500038, సంప్రదించవలసిన నెం: **040-23736405,** mobile **8142000061/66,** Email: **subbarao@bankauctions.in** and **info@bankauctions.in** నుండి పొందవచ్చును.

తేది: 13-04-2023, ప్రదేశం: హైదరాబాద్ సం/- ఛీఫ్ మేనేజర్ & అధీకృత అధికారి, కర్ణాటక బ్యాంక్ లిమిటెడ్

ప్రపంచ ఆరోగ్య సంరక్షణే లక్ష్యం : ప్రధాని మోడీ

న్యూఢిల్లీ : కేవలం మన దేశ పౌరులకు మాత్రమే కాకుండా.. ప్రపంచం మొత్తానికి ఆరోగ్య సంరక్షణను అందుబాటులోకి తీసుకురావడమే భారత్ లక్ష్యమని ప్రధానమంత్రి నరేంద్ర మోడీ తెలిపారు. బుధవారం వన్ ఎర్త్ వన్ హెల్త్- అడ్వాంటేజ్ హెల్త్‌కేర్ ఇండియా 2023 సదస్సు 6వ ఎడిషన్ ప్రారంభోత్సం సందర్భంగా మోడీ తన వీడియో సందేశంలో ఈ విషయాన్ని తెలిపారు. ఆందోళన, అధునిక జీవన శైలి కారణంగా వచ్చే అనేక వ్యాధులకు భారతీయ సాంప్రదాయ ఆరోగ్య సంరక్షణ వ్యవస్థల్లో అనేక చికిత్సలు ఉన్నాయని అన్నారు. ప్రపంచంలో మనం ఏర్పాటు చేసుకున్న సరిహద్దులు ఆరోగ్య ముప్పును నిరోధించలేవని కోవిడ్ మహమ్మారి నిరూపించిందని మోడీ గుర్తు చేశారు. అనేక దేశాలకు టీకాలు, ఔషధాలు అందచేస్తున్న నోబుల్ మిషన్‌లో భాగస్వామి అయినందుకు భారత్ గర్విస్తుందని చెప్పారు. పశ్చిమ ఆసియా, దక్షిణ ఆసియా దేశాల ప్రతినిధులతోపాటు ఆయా దేశాల ఆరోగ్య శాఖల మంత్రులు ఈ సమావేశంలో పాల్గొన్నారు. కేంద్ర ఆర్యోగ, కుటుంబ సంక్షేమ శాఖతో కలిసి ఫెడరేషన్ ఆఫ్ ఇండియన్ ఛాంబర్స్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీ ఈ సదస్సును ఏర్పాటు చేసింది. న్యూఢిల్లీలోని ప్రగతి మైదాన్‌లో రెండు రోజులపాటు ఈ సదస్సు జరగనుంది.

రాహుల్ పిటిషన్ విచారణ నుంచి తప్పకున్న జడ్జి

అహ్మదాబాద్ : కాంగ్రెస్ నాయకులు రాహుల్‌గాంధీ దాఖలు చేసిన పిటిషన్ విచారణ నుంచి గుజరాత్ హైకోర్టు జడ్జి ఒకరు తనకు తానుగా తప్పుకున్నారు. 'మోడీ ఇంటిపేరు' కేసులో కింద కోర్టు తనకు విధించిన రెండేళ్ల శిక్షను సవాల్ చేస్తూ గుజరాత్ హైకోర్టును రాహుల్ గాంధీ ఆశ్రయించిన సంగతి తెలిసిందే. బుధవారం ఈ పిటిషన్ విచారణ జరగాల్సి ఉంది. ఈ పిటిషన్ విచారణ నుంచి జస్టిస్ గీతాగోపి తప్పుకున్నారు. ఈ విషయాన్ని రాహుల్ గాంధీ తరపు న్యాయవాది పిఎస్ ఛాంపనేరి తెలిపారు. జస్టిస్ గీతా గోపి క్రిమినల్ రివిజన్ కేసులను విచారిస్తుంటారని, ఈ కారణంతోనే ఆమె ఈ కేసు విచారణ నుంచి తప్పుకున్నట్లు న్యాయవాది తెలిపారు. ఈ పిటిషన్‌ను వేరే ధర్మాసనానికి లిస్ట్ చేయాలని ప్రధాన న్యాయమూర్తికి విజ్ఞాపన పంపినట్లు చెప్పారు.

బిజెపికి ఓటమే!

- అవినీతి, ధరల పెరుగుదల, నిరుద్యోగం ఎఫెక్ట్
- సర్వేలో వెల్లడైన కన్నడ ఓటరు మనోగతం

బెంగళూరు : కర్నాటకలో రాబోయే అసెంబ్లీ ఎన్నికల్లో అధికార బిజెపికి ఎదురుదెబ్బ తగిలే పరిస్థితులే కనిపిస్తున్నాయి. ఈ ఎన్నికల్లో అవినీతి కీలక అంశంగా మారనున్నది. అలాగే, ధరల పెరుగుదల, నిరుద్యోగం అంశాలు కూడా ఇక్కడి ఓటింగ్‌పై ప్రభావం చూపనున్నది. కన్నడ సంస్థ 'ఈడిన' నిర్వహించిన సర్వేలో ఈ విషయం వెల్లడైంది. ఈ సర్వేలో భాగంగా రాబోయే ఎన్నికలను దృష్టిలో ఉంచుకొని కొత్త ప్రభుత్వాన్ని ఎన్నుకోనున్న తరుణంలో ఏవైనా రెండు సమస్యలను తెలపాల్సిందిగా సర్వేలో పాల్గొన్న ప్రజలను అడిగారు. ఇందులో 68 శాతం మంది అవినీతి సమస్య తమ ఓటింగ్ నిర్ణయాన్ని ప్రభావితం చేస్తుందని చెప్పారు. ధరల పెరుగుదలపై 47 శాతం మంది, నిరుద్యోగంపై 34 శాతం మంది తమ వ్యతిరేకతను వ్యక్తం చేశారు. 13 శాతం మంది ప్రజలు మాత్రం మహిళల భద్రత, తాగునీరు, విద్యుత్తు వంటివి మేజర్ సమస్యలను.. అవి తమ ఓటింగ్ నిర్ణయంపై ప్రభావం చూపుతాయని చెప్పారు. 12 శాతం మంది ఆరోగ్యం, విద్య అని చెప్పగా.. 10 శాతం మంది నేరాలు, అల్లర్లు, వేధింపుల గురించి మాట్లాడారు. ఎస్‌సి, ఎస్‌టి, ముస్లింలు, వొక్కలిగ, కురుబ సామాజిక వర్గం వారు ప్రస్తుత బిజెపి సర్కారు పట్ల తీవ్ర వ్యతిరేకతతో ఉన్నారని కిందటి సర్వేలో తేలిందని 'ఈడిన' వెల్లడించింది. రాష్ట్రంలో బసవరాజ్ బొమ్మై నేతృత్వంలోని ప్రభుత్వంపై తీవ్ర అవినీతి ఆరోపణలు వెల్లువెత్తుతున్న విషయం విదితమే. ఈ విషయంలో గతేడాది ఆగస్టులో రాష్ట్రంలోని 13వేల పాఠశాలలు ప్రధాని మోడీకి కూడా లేఖలు రాశాయి. విద్యా శాఖ ముడుపులు డిమాండ్ చేస్తున్నదని ఆరోపించాయి. కర్ణాటక మంత్రి అవినీతిని పేర్కొంటూ సంతోశ్ కె. పాటిల్ అనే కాంట్రాక్టర్ గతేడాది ఏప్రిల్‌లో బలవన్మరణానికి పాల్పడటం తీవ్ర సంచలనం సృష్టించింది. నిత్యావసర ధరలు, ఎల్‌పిజి గ్యాస్ సిలిండర్ ధరల పెరుగుదల రాష్ట్రంలోని ప్రజల్లో బిజెపి ప్రభుత్వం పట్ల వ్యతిరేకత పెరగడానికి కారణాలయ్యాయని నిపుణులు తెలిపారు.

ఇక్కడి యువత నిరుద్యోగం విషయంలో తీవ్ర ఆగ్రహంగా ఉన్నదన్నారు. దీనికితోడు సహజంగా ఉండే ప్రభుత్వ వ్యతిరేకత.. రాబోయే అసెంబ్లీ ఎన్నికల్లో బిజెపి ఓటమి దిశగా తీసుకెళ్లడం ఖాయమని చెప్పారు.

లైంగిక వేధింపులు నివారించేందుకు విధానాన్ని రూపొందించండి

కళాక్షేత్ర ఫౌండేషన్‌ను ఆదేశించిన మద్రాసు హైకోర్టు

చెన్నై : చెన్నైలోని కళాక్షేత్ర ఫౌండేషన్ సిబ్బందిపై, ఆ సంస్థ నిర్వహించే కాలేజీ, స్కూళ్ల విద్యార్థులపై లైంగిక వేధింపులు, లింగ వివక్షను నివారించేందుకు ఒక విధానాన్ని రూపొందించాల్సిందిగా మద్రాసు హైకోర్టు బుధవారం కళాక్షేత్ర ఫౌండేషన్‌ను ఆదేశించింది. ఆ సంస్థకు చెందిన పాఠశాలల ఫిర్యాదుల కమిటీల్లో తల్లిదండ్రులు, టీచర్లు తప్పనిసరిగా సభ్యులుగా వుండాలని ఆదేశించింది. ఫౌండేషన్ నిర్వహిస్తున్న రుక్మిణీ దేవి కాలేజీ ఆఫ్ ఫైన్ ఆర్ట్స్‌కి చెందిన ఏడుగురు విద్యార్థులు దాఖలు చేసిన రిట్ పిటిషన్‌పై జస్టిస్ ఎం.దండపాణి ఈ తాత్కాలిక ఉత్తర్వులు జారీ చేశారు. లైంగికపరమైన వేధింపులు, ఇతర రకాలైన వేధింపులకు సంబంధించిన ఫిర్యాదులను పరిష్కరించేందుకు క్రియాశీల యంత్రాంగం వుండాలని, సక్రమమైన భద్రతా విధానం రూపొందించాలని విద్యార్థినుల తరపున న్యాయవాది ఆర్.వేగై కోరారు. వారి వాదనలు అంగీకరించిన న్యాయమూర్తి తక్షణమే ఇందుకు సంబంధించి విధానాన్ని రూపొందించాలని ఆదేశించారు. తమను లైంగికంగా వేధిస్తున్న ఫ్యాకల్టీ సభ్యులపై చర్యలు తీసుకోవాలంటూ గత నెల చివరిలో కళాక్షేత్ర ఫౌండేషన్ విద్యార్థులు ప్రదర్శన నిర్వహించారు. ఆ వెంటనే పోలీసులు ఆరోపణలు ఎదుర్కొంటున్న ఫ్యాకల్టీ సభ్యుడిని అరెస్టు చేశారు.

సజ్జ సరితకు డాక్టరేట్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

కృష్ణా జిల్లా పెడనకు చెందిన సజ్జ సరితకు గుంటూరులోని ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం డాక్టరేట్‌ను ప్రదానం చేసింది. సజ్జ సరిత పర్యావరణ విభాగంలో ఎన్నో పరిశోధనలు చేశారు. పెడన మండలంలోని భూమి, భూఉపరితలం, నీటి కాలుష్యంపై అధ్యయనం చేశారు. 'వ్యవసాయ నేలల్లో హెవీ మెటల్ కాన్సంట్రేషన్‌తో ఫిజికో కెమికల్ క్యారెక్టర్‌స్టిక్స్' అంశంపై ఆమె అందజేసిన పిహెచ్‌డి పరిశోధనా పత్రానికి డాక్టరేట్‌ను ప్రదానం చేశారు.

ఎన్‌సిఇఆర్‌టి తొలగించిన పాఠ్యాంశాలను స్టేట్ సిలబస్‌లో చేర్చేందుకు కేరళ నిర్ణయం

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

పాఠ్యపుస్తకాల్లోని కొన్ని పాఠ్యాంశాలను తొలగించాలని నేషనల్ కౌన్సిల్ ఆఫ్ ఎడ్యుకేషన్ రీసెర్చ్ అండ్ ట్రెనింగ్ (ఎన్‌సిఇఆర్‌టి) తీసుకున్న నిర్ణయంతో విభేదిస్తున్న కేరళ ప్రభుత్వం ఇందుకు ప్రత్యామ్నాయ చర్యలకు ఉపక్రమించింది. తొలగించిన పాఠ్యాంశాలను స్టేట్ సిలబస్‌లో చేర్చడం ద్వారా అనుబంధ పాఠ్య పుస్తకాలను తీసుకురావాలని నిర్ణయించింది. ఎన్‌సిఇఆర్‌టి ఇటీవల 10, 11, 12 తరగతులకు చెందిన చరిత్ర, రాజకీయ శాస్త్రం పుస్తకాల నుంచి కొన్ని పాఠ్యాంశాలను తొలగించింది. మహాత్మాగాంధీ హత్య, గుజరాత్ అల్లర్లు, మొఘలుల చరిత్ర, ఆర్‌ఎస్‌ఎస్‌పై నిషేధం, డార్విన్ జీవ పరిణామ సిద్ధాంతాన్ని మినహాయించడం వంటి కొన్ని ముఖ్యమైన భాగాలను పాఠ్యాంశాల నుంచి తొలగించింది. ఈ చర్యను కేరళ ప్రభుత్వం బహిరంగంగానే విమర్శించింది. పాఠ్యపుస్తకాల్లో చరిత్రను వక్రీకరించే కేంద్రప్రభుత్వ చర్య గర్హనీయమని పేర్కొంది. ఎన్‌సిఇఆర్‌టిని పునర్వ్యవస్థీకరించాలని, ఇందులో రాష్ట్ర ప్రతినిధులకు చోటు కల్పించాలని డిమాండ్ చేసింది. తొలగించిన పాఠ్యాంశాలతో అనుబంధ పాఠ్యపుస్తకాలను తీసుకురావడానికి గల అవకాశాలను పరిశీలిస్తామని తెలిపింది. ఇందుకు అనుగుణంగానే స్టేట్ కౌన్సిల్ ఆఫ్ ఎడ్యుకేషన్ రీసెర్చ్ అండ్ ట్రెనింగ్ (ఎస్‌సిఇఆర్‌టి) కరిక్యులమ్ స్టీరింగ్ కమిటీ సమావేశమైంది. ముఖ్యంగా ఎన్‌సిఇఆర్‌టి 10, 11, 12వ తరగతి సోషల్, రాజకీయ శాస్త్రంలో తొలగించిన పాఠ్యాంశాలపై సమగ్రంగా చర్చించింది.

ఈ చర్య సహేతుకం కాదని కమిటీ అభిప్రాయపడింది. రేషనలైజేషన్ పేరుతో తొలగించిన పాఠ్యాంశాలపై అసంతృప్తి వ్యక్తం చేసింది. కేరళ పాఠ్యాంశాలలో వీటిని యథాతథంగా ఉంచాలని అభిప్రాయపడింది.

అనుబంధ పాఠ్యపుస్తకాలు

చరిత్ర, రాజకీయ శాస్త్రం, అర్థశాస్త్ర, సోషియాలజీలో కొన్ని పాఠ్యాంశాలను ఎన్‌సిఇఆర్‌టి తొలగించడం సహేతుకం కాదని ఎస్‌సిఆర్‌టి డైరెక్టర్ ఎం.జయచంద్రన్ ఆగ్రహం వ్యక్తం చేశారు. తొలగించిన పాఠ్యాంశాలను అనుబంధ పాఠ్యపుస్తకాలలో చేర్చి, వాటిని రాష్ట్రంలో పంపిణీ చేస్తామని పేర్కొన్నారు. రెండు నెలల్లో పాఠ్యపుస్తకాలను సిద్ధం చేస్తామని, ఆగస్టు నాటికి పుస్తకాలు విద్యార్థులకు చేరుతాయని తెలిపారు. స్టీరింగ్ కమిటీ ఛైర్మన్‌గా ఉన్న కేరళ విద్యాశాఖ మంత్రి వి శివన్‌కుట్టి సైతం ఇప్పటికే పాఠ్యాంశాల్లో ఎన్‌సిఇఆర్‌టి చేసిన మార్పులపై కేంద్రాన్ని, ఎన్‌సిఇఆర్‌టిని తప్పుపట్టారు. రాజకీయ దురుద్దేశంతోనే ఈ మార్పులు చేశారని ఆరోపించారు.

రెజ్లర్ల ఆందోళనకు సత్యపాల్ మాలిక్ మద్దతు

- ఖాప్ పంచాయతీల మద్దతు
- జంతర్ మంతర్ వద్దే క్రీడాకారుల వ్యాయామం, శిక్షణ
- న్యాయం జరిగే వరకు వెనక్కి వెళ్లం : రెజ్లర్లు

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

లైంగిక వేధింపులకు పాల్పడిన డబ్ల్యుఎఫ్ఐ చీఫ్, బిజెపి ఎంపి బ్రిజ్ భూషణ్ శరణ్ సింగ్‌పై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ రెజ్లర్లు చేస్తున్న ఆందోళనకు జమ్ము కాశ్మీర్ మాజీ గవర్నర్ సత్యపాల్ మాలిక్ మద్దతు తెలిపారు. మహిళా అథ్లెట్లపై లైంగిక దోపిడీ, బెదిరింపులకు పాల్పడ్డారని ఆరోపణలు ఎదుర్కొంటున్న బ్రిజ్ భూషణ్‌ను అరెస్టు చేయాలని డిమాండ్ చేస్తూ దేశంలోని అగ్రశ్రేణి రెజ్లర్లు జంతర్ మంతర్ వద్ద చేస్తున్న ఆందోళన బుధవారం నాలుగో రోజు కూడా కొనసాగింది. నిరసన ప్రదేశాన్ని శిక్షణ, వ్యాయామ కేంద్రంగా మార్చుకున్నారు. నిరసన తెలిపే జంతర్ మంతర్ వద్దే కోచ్ సుజీత్ మాన్ పర్యవేక్షణలో మల్లయోధులు ఉదయం 7:30 గంటలకు శిక్షణ ప్రారంభించారు. సెషన్ 8:45 వరకు కొనసాగింది. క్రీడాకారులు కుస్తీ వ్యాయామాలు చేస్తూ కనిపించారు. 'మాకు న్యాయం జరిగే వరకు మేము ఇక్కడ నుంచి వెళ్లం. తప్పు చేస్తే శిక్షను ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉన్నాము. కుస్తీ మాకు సర్వస్వం. మేము మానసికంగా, శారీరకంగా దృఢంగా ఉండాలనుకుంటున్నాము. ఇక్కడ ప్రాక్టీస్ చేస్తూనే ఉంటాం' అని బజరంగ్ పునియా అన్నారు. మల్లయోధులకు గాయాలయ్యే అవకాశం ఉన్నందున, రోడ్లపై శిక్షణ ఇవ్వడం ప్రమాదకరం కాదా? అని అడిగిన ప్రశ్నకు, కోచ్ సుజీత్ మాన్ 'మాకు ఎటువంటి ఎంపిక లేదు. మనం బలవంతంగా రోడ్డుపై శిక్షణ పొందవలసి వచ్చింది. మేము ఏమి చేస్తాము? ఇది ఆసియా క్రీడలు, ప్రపంచ ఛాంపియన్‌షిప్‌ల సంవత్సరం. ఇది ఒలింపిక్ క్వాలిఫైయర్, రెజ్లర్లు లైన్‌లో ఉండలేరు' అని అన్నారు. 'సామగ్రి, జిమ్ లేదు, చాప లేదు, కాబట్టి పరిస్థితుల్లో మనం ఏమి చేయగలం, మేము చేస్తున్నాము. నేను వారిని పరిగెత్తమని అడిగాను. వారు మనిషి నుండి మనిషికి టెక్నిక్ ప్రాక్టీస్ కూడా చేశారు' అని అన్నారు. 'ప్రతి ఫైట్‌లో ఫిట్‌నెస్ ముఖ్యం. మన రెజ్లర్లు దానిని అర్థం చేసుకుంటారు. వారు దేశాన్ని చాలాసార్లు గర్వించేలా చేశారు. స్టేడియంలో ఉండాల్సిన సమయంలో వారు ఇక్కడ ఉండటం బాధగా ఉంది. రెండు నెలల్లో మేజర్ టోర్నీలు రానున్నాయి. ప్రభుత్వం త్వరగా నిర్ణయం తీసుకుని వారికి న్యాయం చేయాలి' అని అన్నారు.

చరిత్ర మిమ్మల్ని గుర్తుంచుకుంటుంది : సత్యపాల్ మాలిక్

జంతర్ మంతర్ వద్ద రెజ్లర్ల నిరసనలో జమ్ముకాశ్మీర్ మాజీ గవర్నర్ సత్యపాల్ మాలిక్ పాల్గొన్నారు. రెజ్లింగ్ బాడీ నిరసన వ్యక్తం చేస్తున్న రెజ్లర్లకు తన మద్దతును అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వివిధ వర్గాల నుండి రెజ్లర్లకు మద్దతు లభిస్తూనే ఉందన్నారు. 'మద్దతు పెరగాల్సిన అవసరం ఉంది. దానిని పెంచడానికి నా వంతు కృషి చేస్తాను. ఈ పోరాటం మన దేశంలోని మహిళలందరికీ సంబంధించినది. చరిత్ర రెజ్లర్ల పోరాటాన్ని గుర్తుంచుకుంటుంది' అని ఆయన విలేకరులతో అన్నారు. 'ఒత్తిడిలో ఉన్నప్పటికీ మీరు పోరాడుతున్నందుకు నేను సంతోషిస్తున్నాను. కొన్ని నెలల క్రితం రైతు సంఘాలు ఆందోళన చేసినప్పుడు, వారి ఆందోళనకు ప్రధాని క్షమాపణ చెప్పాల్సి వచ్చింది. రైతులు మీ పక్షాన ఉన్నందున మీ విజయం ఖాయం' అని స్పష్టం చేశారు. అంతర్జాతీయ స్థాయిలో విజయం సాధించి దేశంలో గౌరవప్రదమైన క్రీడాకారులు న్యాయం కోసం వీధుల్లో పోరాటం చేయాల్సిన పరిస్థితి రావడం సిగ్గుచేటని అన్నారు. వారి పోరాటం ముగిసే వరకు మద్దతు ఇవ్వాలని ఆయన అందరికీ విజ్ఞప్తి చేశారు.

ఎఫ్ఐఆర్ నమోదుకు ప్రాథమిక విచారణ అవసరం : సుప్రీంకు ఢిల్లీ పోలీసులు

బ్రిజ్ భూషణ్ లైంగిక వేధింపులకు పాల్పడ్డారంటూ రెజ్లర్లు చేసిన ఫిర్యాదుపై ఎఫ్ఐఆర్ నమోదు చేయడానికి ముందు కొంత ప్రాథమిక విచారణ అవసరమని ఢిల్లీ పోలీసులు సుప్రీం కోర్టుకు తెలియజేశారు. సుప్రీం ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డివై చంద్రచూడ్, జస్టిస్ పిఎస్ నరసింహతో కూడిన ధర్మాసనం ముందు సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా వాదనలు వినిపించారు. కొంత ప్రాథమిక విచారణ అవసరమని, ఈ కోర్టు ఆదేశిస్తే ఎఫ్ఐఆర్ నమోదు చేయవచ్చని అన్నారు. సాధారణంగా ఇలాంటి పిటిషన్లను స్వీకరించే ముందు ఎదుటివారి అభిప్రాయాన్ని కోరతామని, ఇది భిన్నంగా ఉందని ధర్మాసనం పేర్కొంది. 'మీరు (పోలీసులు) శుక్రవారం అఫిడవిట్‌పై మీ అభిప్రాయాన్ని ఉంచండి, మేము దానిని పరిశీలిస్తాము' అని అందులో పేర్కొన్నారు.

బెదిరింపులు : రెజ్లర్లు

దేశంలోని అగ్రశ్రేణి రెజ్లర్లు బజరంగ్ పునియా, సాక్షి మాలిక్, వినేష్ ఫోగట్ మాట్లాడుతూ రెజ్లింగ్ ఫెడరేషన్ చీఫ్ బ్రిజ్ భూషణ్ శరణ్ సింగ్‌పై లైంగిక వేధింపులు, క్రిమినల్ బెదిరింపులపై వేర్వేరు ఫిర్యాదులు చేసిన ఏడుగురు మహిళా రెజ్లర్లకు భయంకరమైన బెదిరింపులు, డబ్బు ప్రేరేపణలు వస్తున్నాయన్నారు. ఫిర్యాదుదారుల 'సంకల్పాన్ని విచ్ఛిన్నం' చేయాలని బెదిరింపులు జరుగుతున్నాయని విమర్శించారు. టోక్యో ఒలింపిక్స్ కాంస్య పతక విజేత బజరంగ్ పునియా ఫిర్యాదు చేసిన ఏడుగురు వ్యక్తులలో ఒకరైన మైనర్ కుటుంబాన్ని బ్రిజ భూషణ్ బెదిరించారని ఆరోపించారు. అనేక రైతు సంఘాలు, ఖాప్ పంచాయత్ నాయకులు, రాజకీయ నాయకులు, మహిళా సంఘాలు మూడు రోజులుగా నిరసన స్థలంలో మల్లయోధులకు మద్దతునిచ్చాయి. ఆప్ అధికార ప్రతినిధి రీనా గుప్తా మద్దతు తెలిపారు.

జైలు నుండి తప్పించుకున్న సూడాన్ యుద్ధ నేరాల ఖైదీ

ఖార్టూమ్ : సూడాన్‌లో ఇటీవల కొనసాగుతున్న ఘర్షణల సమయంలో యుద్ధ నేరాల ఖైదీ జైలు నుండి తప్పించుకుని పారిపోయాడని సంబంధిత వర్గాలు తెలిపాయి. 2019లో గద్దె దిగిన ప్రభుత్వానికి చెందిన సభ్యులతో కలిసి తాను తప్పించుకుని పారిపోయినట్లు ఆ వ్యక్తి తెలిపాడు. మరోవైపు ఇంధన కొరతలు, పెరుగుతున్న ఆహార ధరలు, కొనసాగుతున్న బాంబు దాడుల కారణంగా అనేక ఆస్పత్రులు చిన్నాభిన్నమవడం వంటి పరిస్థితులతో సూడాన్‌లో మానవతా సంక్షోభం మరింత భయంకరమైన రూపు తీసుకుంటోంది. పలు విదేశాలు తమ పౌరులను సూడాన్ నుండి తరలించేందుకు ముమ్మరంగా చర్యలు తీసుకుంటుండగా, లక్షలాదిమంది సూడాన్ జాతీయులు సరైన సదుపాయాలు లేక అధ్వాన్న స్థితిలో వున్నారు. ప్రస్తుతం దేశంలో నెలకొన్న పరిస్థితులకు పశ్చిమ దేశాలే కారణమని సూడాన్ విశ్లేషకులు పేర్కొంటున్నారు. ఈ నెల 15నుండి సైన్యానికి, పేరా మిలటరీ బలగాలకు మధ్య ఘర్షణలు కొనసాగుతున్నాయి. వీధుల్లో ఎక్కడ చూసినా మృతదేహాలు పడి వుండడం కనిపిస్తోందని, దోపిడీలు యథేచ్ఛగా కొనసాగుతున్నాయని, ప్రజల మధ్య కూడా ఆయుధాలతో ఘర్షణలు చోటు చేసుకుంటున్నాయని పాలస్తీనియన్లు తెలిపారు. వారు సూడాన్ నుండి ఈజిప్ట్‌లోకి వెళ్లేందుకు సరిహద్దుల్లో వేచివున్నారు.

బ్యాంక్‌పై దాడిలో ఇరాన్ మత పండితుడి మృతి

టెహరాన్ : సాయుధ దాడిలో శక్తివంతమైన ఇరాన్ మత పండితుడు మరణించారని అధికారులు బుధవారం తెలిపారు. దేశ సుప్రీం నేతను ఎంపిక చేసే నిపుణుల మండలి సభ్యుడిగా వున్న ఆయతుల్లా అబ్బాస్ అలీ సొలెమని బ్యాంకులో జరిగిన దాడిలో మరణించారని ఇర్నా వార్తా సంస్థ తెలిపింది. వెంటనే ఆ దుండగుడిని కూడా అరెస్టు చేశారని, కేసు దర్యాప్తు జరుగుతోందని పేర్కొంది. ఉత్తర మజంద్రాన్ ప్రావిన్స్‌లో బబూల్‌సర్ నగరంలోని బ్యాంకులో ఈ సంఘటన చోటు చేసుకుందని భద్రతా అధికారి తెలిపారు. ఈ దాడి వెనుక గల కారణమేంటో వెంటనే తెలియరాలేదని, దర్యాప్తు చేస్తున్నామని చెప్పారు. ఇప్పటివరకు వున్న సమాచారం ప్రకారం ఇది భద్రతా చర్య కాదు, తీవ్రవాద చర్య కూడా కాదని అన్నారు. సొలెమనీ గతంలో ఆయతుల్లా అలీ ఖమేని ప్రతినిధిగా పనిచేశారు.

చర్చలు, సంప్రదింపులే ఉక్రెయిన్ సంక్షోభానికి ఏకైక పరిష్కారం

- జిన్‌పింగ్

బీజింగ్ : ఉక్రెయిన్ సంక్షోభాన్ని పరిష్కరించడానికి చర్చలు, సంప్రదింపులే ఏకైక మార్గమని చైనా అధ్యక్షుడు జీ జిన్‌పింగ్ బుధవారం అన్నారు. అణు యుద్ధంలో ఎవరికీ విజయం లభించదని అన్నారు. ఉక్రెయిన్ అధ్యక్షుడు వ్లాదిమిర్ జెలెన్‌స్కీతో ఫోన్లో మాట్లాడుతూ జిన్‌పింగ్ ఈ వ్యాఖ్యలు చేశారు. చైనా-ఉక్రెయిన్ సంబంధాలపై, ఉక్రెయిన్ సంక్షోభంపై ఉభయ పక్షాలు పరస్పరం అభిప్రాయాలు పంచుకున్నాయి. యురేసియన్ వ్యవహారాలపై చైనా ప్రభుత్వ ప్రత్యేక ప్రతినిధిని ఉక్రెయిన్‌లో, ఇతర దేశాల్లో పర్యటించడానికి పంపనున్నట్లు జిన్‌పింగ్ చెప్పారు. ఉక్రెయిన్ సంక్షోభానికి రాజకీయ పరిష్కారంపై అన్ని పక్షాలతో కూలంకషమైన చర్చలు జరిపేందుకే పంపుతున్నట్లు చెప్పారు. ద్వైపాక్షిక సంబంధాలు వ్యూహాత్మక భాగస్వామ్యం స్థాయికి చేరాయని పేర్కొన్నారు. చైనాతో సహకారానికి సంబంధించి, అలాగే ఇరు దేశాల సంబంధాల అభివృద్ధిపై జెలెన్‌స్కీ పదే పదే చేసిన వ్యాఖ్యలను జిన్‌పింగ్ ప్రశంసించారు. సార్వభౌమాధికారం, ప్రాదేశిక సమగ్రత పట్ల పరస్పర గౌరవం అనేది ద్వైపాక్షిక సంబంధాలకు రాజకీయ పునాది వంటిదని అన్నారు. భవిష్యత్‌పై దృష్టి కేంద్రీకరించాల్సిందిగా ఇరు పక్షాలను ఆయన కోరారు. ఉక్రెయిన్‌తో సంబంధాలను అభివృద్ధిపరుచుకోవడానికి చైనా సుముఖతతో వుందన్నారు.

నేడు ప్రకాశ్ సింగ్ బాదల్ అంత్యక్రియలు

- సెలవుదినంగా ప్రకటించిన పంజాబ్ ప్రభుత్వం
- నివాళులర్పించిన మోడీ

చండీగఢ్ : పంజాబ్ మాజీ ముఖ్యమంత్రి, శిరోమణి అకాలీ దళ్ సీనియర్ నాయకులు ప్రకాశ్ సింగ్ బాదల్ అంత్యక్రియలు గురువారం జరగనున్నాయి. బాదల్ స్వగ్రామైన ముక్త్సర్ జిల్లాలోని బాదల్ గ్రామంలో మధ్యాహ్నం 1 గంటలకు అధికారిక లాంఛనాలతో ఈ కార్యక్రమం నిర్వహించనున్నారు. బాదల్ అంత్యక్రియలకు రాజకీయ నాయకులు, ప్రముఖులు, అధికారులతో సహా పెద్ద ఎత్తున ప్రజలు హాజరవుతారని అంచనా వేస్తున్నారు. పంజాబ్ ప్రభుత్వం అందుకుతగినట్లుగా ఏర్పాట్లు చేస్తోంది.

ప్రకాశ్ సింగ్ బాదల్ గౌరవార్థం గురువారం సెలవు దినంగా పంజాబ్ ప్రభుత్వం ప్రకటించింది. రాష్ట్రవ్యాప్తంగా గురువారం అన్ని ప్రభుత్వ కార్యాలయాలు, విద్యా సంస్థలు, బ్యాంకులను మూసివేయనున్నారు. ప్రకాశ్ సింగ్ బాదల్‌కు ప్రధానమంత్రి నరేంద్ర మోడీ బుధవారం నివాళి అర్పించారు. చండీగఢ్‌లోని అకాలీ దళ్ పార్టీ ప్రధాన కార్యాలయంలో బాదల్ భౌతిక కాయం వద్ద పుష్పగుచ్ఛం ఉంచి మోడీ నివాళులర్పించారు. బాదల్ కుమారుడు సుఖ్‌బీర్ సింగ్ బాదల్‌ను ఓదార్చారు. అంతకు ముందు బుధవారం ఉదయం ముందుగా చండీగడ్ విమానాశ్రయం చేరుకున్న మోడీ పంజాబ్ గవర్నర్ బన్వరీలాల్ పురోహిత్, హర్యానా ముఖ్యమంత్రి మనోహర్‌లాల్ ఖట్టర్‌తో కలిసి అకాలీ దళ్ పార్టీ ప్రధాన కార్యాలయానికి చేరుకున్నారు.

పంజాబ్‌కు ఐదు సార్లు ముఖ్యమంత్రిగానూ, కేంద్ర మంత్రిగానూ పనిచేసిన 95 ఏళ్ల బాదల్ అనారోగ్య సమస్యలతో బాధపడుతూ మంగళవారం మొహాలీలోని ఆసుపత్రిలో మరణించిన సంగతి తెలిసిందే. బాదల్ భౌతిక కాయాన్ని ప్రజల సందర్శనార్థం చండీగడ్‌లో పార్టీ ప్రధాన కార్యాలయం వద్దకు తరలించారు.

తేలని ఎపి భవన్ విభజన పంచాయతీ

- వచ్చే వారం మరోసారి సమావేశం

ప్రజాశ-న్యూఢిల్లీ బ్యూరో

రాష్ట్ర విభజన జరిగి తొమ్మిదేళ్లు కావస్తున్నా.. విభజన సమస్యలు మాత్రం పరిష్కారం కాలేదు. ఆస్తుల విభజన పూర్తి కాలేదు. విభజనకు నోడల్ ఏజెన్సీగా ఉన్న కేంద్ర హోంమంత్రిత్వ శాఖ సమావేశాలు నిర్వహించినప్పటికీ సమస్యలు పరిష్కారం కొలిక్కి రాలేదు. ఢిల్లీలోని ఎపి భవన్ విభజనపై బుధవారం కేంద్ర హోంమంత్రిత్వ శాఖ, ఆంధ్రప్రదేశ్, తెలంగాణ అధికారులతో సమావేశం నిర్వహించింది. కేంద్ర హోంశాఖ కేంద్ర, రాష్ట్రాల విభాగం జాయింట్ సెక్రెటరీ సంజీవ్ కుమార్ జిందాల్ అధ్యక్షతన సమావేశం జరిగింది. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం తరపున ఆదిత్యనాథ్ దాస్, ప్రేమ చంద్రారెడ్డి, ఎస్ఎస్ రావత్, హిమాన్షు కౌశిక్ తదితర ఉన్నతాధికారులు హాజరుకాగా, తెలంగాణ ప్రభుత్వం తరపున

రామకృష్ణారావు, గౌరవ్ ఉప్పల్ తదితర ఉన్నతాధికారులు హాజరయ్యారు. ఢిల్లీలో ఇండియా గేట్ పక్కన 20 ఎకరాల్లో ఉన్న ఏడువేల కోట్ల విలువ చేసే ఉమ్మడి ఆస్తిపై చర్చించారు. విభజన చట్టం ప్రకారం ఎపికి 58 శాతం, తెలంగాణకు 42 శాతం వాటా చెందాల్సి ఉంది. ఎపి భవన్ విభజనపై మూడు ప్రతిపాదనలు అధికారులు సిద్ధం చేశారు. తొమ్మిదేళ్లుగా ఒకే ప్రాంగణంలో ఎపి, తెలంగాణ భవన్లు కొనసాగుతున్నాయి. తాత్కాలికంగా 58:42 నిష్పత్తి పద్ధతిలో గదుల విభజన, నిర్వహణ జరిగింది. తాజాగా మరికొన్ని ప్రతిపాదనలు తెరపైకి రావడంతో, వచ్చే వారం మరోసారి సమావేశం నిర్వహించాలని నిర్ణయించారు.లైంగిక వేధింపులు, లింగ వివక్ష నివారించేందుకు విధానాన్ని రూపొందించండి

పిఎంఎల్‌ఎపై సుప్రీంకు ఛత్తీస్‌గఢ్

- మే 4న విచారణ

న్యూఢిల్లీ : మనీలాండరింగ్ నిరోధక చట్టం (పిఎంఎల్ఎ) రాజ్యాంగ చెల్లుబాటును సవాల్ చేస్తూ ఛత్తీస్‌గఢ్ రాష్ట్ర ప్రభుత్వం బుధవారం సుప్రీంకోర్టును ఆశ్రయించింది. పిఎంఎల్ఎకు వ్యతిరేకంగా ఒక రాష్ట్ర ప్రభుత్వం సుప్రీంకోర్టులో పిటీషన్ వేయడం ఇదే మొదటిసారి. ఈ చట్టాన్ని కేంద్ర దర్యాప్తు సంస్థలు బీజేపీయేతర రాష్ట్ర ప్రభుత్వాల సాధరణ పనితీరుపై 'బెదిరింపులు', 'వేధింపులు', 'అంతరాయం' కలిగించడానికి దుర్వినియోగం చేస్తున్నాయని పిటీషన్‌లో ఛత్తీస్‌గఢ్ ప్రభుత్వం ఆరోపించింది. కేంద్రం లేదా ఇతర రాష్ట్రాలతో ఏర్పడిన వివాదాలపై ఒక రాష్ట్రం నేరుగా సుప్రీంకోర్టును ఆశ్రయించడానికి అధికారం ఇచ్చే రాజ్యాంగంలోని ఆర్టికల్ 131 ప్రకారం ఛత్తీస్‌గఢ్ ఈ పిటీషన్ వేసింది. తద్వారా మనీలాండరింగ్ చట్టం, దానిలోని నిబంధనలను సవాల్ చేసిన మొదటి రాష్ట్రంగా ఛత్తీస్‌గఢ్ నిలిచింది. ఇంతకు ముందు కొంతమంది ప్రైవేట్ వ్యక్తులు, కొన్ని రాజకీయ పార్టీలు ఈ చట్టానికి వ్యతిరేకంగా సుప్రీంకోర్టును ఆశ్రయించారు. గత సంవత్సరంలో పిఎంఎల్ఎ చెల్లుబాటుకు అనుకూలంగానే సుప్రీంకోర్టు తీర్పు ఇచ్చింది. మనీలాండరింగ్ కేసు విచారణ సమయంలో ఇడి తమ రాష్ట్ర ప్రభుత్వ అధికారులను, రాష్ట్ర ప్రజలను హింసకు గురిచేయడం, దుర్భాషలాడటం, అసభ్యకరంగా ప్రవర్తించడం వంటి చర్యలకు పాల్పడుతుందని ఛత్తీస్‌గఢ్ పిటీషన్‌లో పేర్కొంది. ఈ కారణంగానే సుప్రీంకోర్టును ఆశ్రయించాల్సి వచ్చిందని తెలిపింది. ఈ పిటీషన్‌ను తక్షణమే విచారించాలని ఛత్తీస్‌గఢ్ తరుపున న్యాయవాదులు ముకుల్ రోహత్గీ, సమీర్ సోధీలు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డివై చంద్రచూడ్, జస్టిస్ పిస్ నరహింహాలతో కూడిన ధర్మాసనాన్ని కోరారు. మే 4న పిటిషన్ విచారణ చేపడతామని ధర్మాసనం సమాధానం ఇచ్చింది.

రిషికొండ తవ్వకాల కేసు వాయిదా

ప్రజాశక్తి-అమరావతి

విశాఖ జిల్లా రిషికొండ తవ్వకాలు, నిర్మాణాలపై వచ్చే నెల మొదటి వారంలో తుది విచారణ చేస్తామని చీఫ్ జస్టిస్ ప్రశాంత్ కుమార్ మిశ్రా, న్యాయమూర్తి జస్టిస్ నైనాల జయసూర్యతో కూడిన డివిజన్ బెంచ్ ప్రకటించింది. మే 4న విచారణ చేపడతామని వెల్లడించింది. యందాడలోని సర్వే నెంబరు 19 పరిధిలోని కోస్టల్ రెగ్యులేషన్ జోన్‌లో చెట్ల నరికివేత, భూమి తవ్వకాలు చట్ట వ్యతిరేకంగా ఉన్నాయంటూ జనసేన కార్పొరేటర్ మూర్తి యాదవ్, విశాఖ తూర్పు ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణ వేర్వేరుగా వేసిన పిల్స్ బుధవారం విచారణకు వచ్చాయి.

మానవ హక్కుల కమిషన్ ఉత్తర్వులను సమర్థించిన హైకోర్టు

కుప్పం మున్సిపాల్టీలోని గల్లేపల్లి అంగన్‌వాడీ కేంద్రంలో గుడ్డు తిని ఓ చిన్నారి మృతి ఘటన నేపథ్యంలో ఆ చిన్నారి కుటుంటానికి రూ.8 లక్షల పరిహారం చెల్లించాలని రాష్ట్ర మానవ హక్కుల కమిషన్ ఉత్తర్వుల్లో జోక్యానికి హైకోర్టు నిరాకరించింది. కమిషన్ ఉత్తర్వులను సవాల్ చేస్తూ అంగన్‌వాడీ టీచర్, అధికారులు దాఖలు చేసిన పిటిషన్‌ను చీఫ్ జస్టిస్ ప్రశాంత్ కుమార్ మిశ్రా, న్యాయమూర్తి జస్టిస్ నైనాల జయసూర్యతో కూడిన డివిజన్ బెంచ్ కొట్టేసింది. ఈ పిటిషన్ వల్ల ప్రభుత్వ ప్రతిష్ట దెబ్బతినే అవకాశం ఉంటుందని అభిప్రాయపడింది.

కాపులకు రిజర్వేషన్ల కేసు జూన్‌కు వాయిదా

ఆర్థికంగా వెనుకబడిన ఉన్నత వర్గాలకు ఉపాధి, విద్యా రంగాల్లో పది శాతం రిజర్వేషన్లు కల్పించేలా కేంద్రం తెచ్చిన చట్టానికి లోబడి రాష్ట్రంలో కాపులకు ఐదు శాతం రిజర్వేషన్లు కల్పించాలని కోరుతూ మాజీ మంత్రి చేగొండి హరిరామజోగయ్య దాఖలు చేసిన పిటిషన్‌పై జూన్ 26న తుది విచారణ చేస్తామని హైకోర్టు ప్రకటించింది. గతంలో కాపులకు 5 శాతం రిజర్వేషన్లు కల్పించేందుకు వీలుగా రాష్ట్రం తెచ్చిన చట్టాన్ని అమలు చేయాలన్న ఆ పిటిషన్‌లో కౌంటర్ దాఖలు చేయాలని ప్రభుత్వాన్ని ఆదేశించింది. కాపులకు మాత్రమే ఐదు శాతం రిజర్వేషన్లు ఇవ్వడం అన్యాయమని, ఈ రిజర్వేషన్లను వ్యతిరేకిస్తూ తమ పిటిషన్ విచారణలో ఉందని మరో న్యాయవాది కారుమంచి ఇంద్రనీల్ బాబు తెలిపారు.

బిజెపిని గద్దె దింపకపోతే.... దేశ భవిష్యత్ అంధకారం

(మొదటి పేజీ తరువాయి)

మోడీ సర్కారు నిరంతర ప్రయత్నాలు సాగిస్తోందని, వామపక్షాలు తిప్పికొడుతున్నాయని అన్నారు. సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సిహెచ్.నర్సింగరావు మాట్లాడుతూ, స్టీల్ కార్మికులు అకుంఠిత దీక్షతో 800 రోజులపైబడి పోరాడుతున్నారని, ప్రయివేటీకరణ అంత సులువేమీ కాదని, వామపక్షాలు ఈ పోరాటానికి అండగా ఉన్నాయని తెలిపారు. సిపిఎం విశాఖ జిల్లా ఎం.జగ్గునాయుడు, సిపిఐ జిల్లా కార్యదర్శి మరుపల్లి ఎం.పైడిరాజు అధ్యక్షతన జరిగిన ఈ సభలో సిపిఎం నాయకులు ఆర్‌కెఎస్‌వి.కుమార్, సిఐటియు స్టీల్‌ప్లాంట్ నాయకులు జె.అయోధ్యరామ్, ఎఐటియుసి నాయకులు ఆదినారాయణ పాల్గొన్నారు.

మీ కోసం

వంట గదిలోకి చీమలు రాకుండా ఉండాలంటే.. ఒక దోసకాయను ముక్కలుగా కోసి చీమలు వచ్చే దగ్గర పెట్టాలి.

జీవనసౌరభం

ప్రతి పనిలోనూ విజయం సాధించాలంటే అతిగా ఆలోచన చేయడం మానాలి.

విజయపథం

విజయపథాన విహరింపజేసే
విలువైన విద్య మనకే
ఆటలు వ్యాయామం
యోగాతో ఆరోగ్య భాగ్యం మనదే
సందేహ నివృత్తికై
సంధించే ప్రశ్నలు మనవే
సమాజ హితవు కోసం
ఎందరో దేశభక్తుల
స్వాతంత్ర్య సమరయోధుల
త్యాగ గుణం ఆదర్శంగా
చేసుకుందాం మనమే
వినోదంతో కూడిన
విజ్ఞాన మయూఖాల
పథముల సాగుదాం మనం

ప్రపంచ జ్ఞానం కలిగింపజేసే
పలు గ్రంథాల పఠనం చేద్దాం మనమే
గ్రంథాలయాల దర్శనం గావిద్దాం
సభ్యతా సంస్కారాలతో
బాటు సంయమనం
సహకారం అలవరచుకుందాం మనమే
మంచి చెడు సారాన్ని
సారాంశాల్ని గ్రహిద్దాం
ఉపాయాలతో బాటు
ఉపకారబుద్ధి నేర్చుకుందాం
అవని నుండి అంతరిక్షం దాకా
అవగాహనా, ఆకళింపు చేసుకుందాం
సమయం విలువ తెలుసుకొని
సమయపాలన గావిద్దాం మనమే
ఎంత చదివినా ఎంత
నేర్చినా అణకువ అంచున చేరి
మానవత్వం చిరునవ్వుల జీవితాన్ని
స్వాగతిద్దాం- మనం!

- డా చిట్యాల రవీందర్
77988 91795

దారి చూపండి



చిన్నారులూ, ఆహారం కోసం తల్లి బాతు బయటకు వెళ్లింది. తిరిగి బాతు పిల్లల వద్దకు చేరుకోవాలి. మరి దారి చూపి సాయం చేయరూ!

నేను గీసిన బొమ్మ

మన్నే జాహ్నవి,
10వ తరగతి,
బ్లూ మింగ్డేల్ ఇంటర్నేషనల్ స్కూలు,
గంగూరు, విజయవాడ.

పిల్లలూ, మీ కథలు, బొమ్మలూ పంపండి. ఇదిగో మెయిల్ ఐడీ: chinnaarips@gmail.com

౯౦లోనూ పర్యావరణహితంగా..

కొంతమందికి ఖాళీగా కూర్చోవడం అంటే ఇష్టం ఉండదు. ఏదో ఒకటి కల్పించుకుని నిత్యం పని చేస్తూనే ఉంటారు. అందులోనే ఆనందం వెతుకుంటారు. అటువంటి వారిలో మధుకాంత ముందుంటారు. 93 ఏళ్ల వయస్సులోనూ చక్కగా మిషన్ కుడుతున్నారు. పర్యావరణహితమైన గుడ్డ సంచులను కుట్టి ఉచితంగా పంపిణీ చేస్తూ అందరినీ ఆశ్చర్యపరుస్తున్నారు.

హైదరాబాద్ నివాసి అయిన మధుకాంత భట్ సొంతూరు గుజరాత్‌లోని జామ్‌నగర్ జిల్లాలోని ఒక చిన్న గ్రామం. అప్పట్లో ఆడపిల్లలు బడికి పంపేవారు కాదు. దాంతో ఆమెకు చదువుకోవాలన్న కోరిక తీరలేదు. కనీసం ఏదో ఒక చేతివిద్య నేర్చుకోవాలని ఆశపడ్డారు. అది తీరలేదు. మధుకాంతకు 18 ఏళ్ల వయస్సులో పెళ్లి అయ్యింది. భర్త ఉద్యోగం రీత్యా హైదరాబాద్‌కు వచ్చారు. కానీ మధుకాంతకు గుజరాతీ తప్ప మరే భాష రాదు. పక్కవాళ్లతో మాట్లాడేందుకు చాలా ఇబ్బంది పడేవారు. దాంతో ఇంట్లో నుంచి బయటకు వెళ్లేవారు కాదు. వీరికి ఐదుగురు సంతానం. నలుగురు ఆడపిల్లలు, ఒక అబ్బాయి. వీరూ తనలాగా ఉండకూడదని నిశ్చయించుకుంది. ఆడపిల్లల చదువు బాధ్యత తానే తీసుకుంది. ఇంట్లో పెద్దవాళ్లు వద్దు అని వారించినా పట్టించుకోలేదు. పిల్లల్ని దగ్గరుండి స్కూలుకు తీసుకెళ్లేది. ఎవరూ సరిగ్గా స్కూలుకు, ట్యూషన్‌కు వెళ్లకపోయినా, చదువుకోకపోయినా మధుకాంత కోప్పడేవారు. పిల్లలు బాగా చదువుకులా సహకరించేవారు. దాంతో అందరూ చదివి ఉద్యోగాల్లో స్థిరపడ్డారు. ఆమె పిల్లలు తెలుగు, ఇంగ్లీషు, గుజరాతీ, ఇతర బాషాలు మాట్లాడగలరు.

పిల్లలు స్కూలుకు వెళ్లినప్పుడు ఖాళీగా ఉండటం ఇష్టం లేక మధుకాంత మిషన్ కుట్టేవారు. బయట ఎక్కడా శిక్షణా తరగతులకు వెళ్లలేదు. మొదట్లో పిల్లలు బట్టలు, చిన్న చిన్నవి మాత్రమే కుట్టారు. మొదటి నుంచి కష్టపడేతత్వం, గ్రహింపుశక్తి ఎక్కువ. ఇంటికి దగ్గర్లో కుట్టుమిషన్ కుట్టేవారిని చూసి చిన్న డ్రెస్‌లు కుట్టారు. ఇంటికి వచ్చి వాటిని కుట్టేవారు. కొన్నాళ్లు నైపుణ్యం సాధించారు.

దాంతో ఇరుగు పొరుగు బట్టలు తీసుకొచ్చి ఇచ్చేవారు. కొద్ది సమయం దొరికినా బట్టలు కుట్టేందుకు మొగ్గు చూపేవారు. ఆమె పిల్లలకు పెళ్లిళ్లు అయ్యాయి. మనవ సంతానం పుట్టారు. వారికీ పెళ్లిళ్లు చేశారు. అయినా మధుకాంత మాత్రం తనకు ఎంతో ఇష్టమైన మిషన్ కుట్టడం మాత్రం ఆపలేదు. ఇంటికి దగ్గర్లో ఉన్న ఓ బట్టల దుకాణ దారుడు దగ్గర మిగిలిన చిన్న చిన్న గుడ్డ ముక్కలను తీసుకొచ్చి సంచులు కుట్టారు. పర్యావరణ పరిరక్షనలో భాగంగా సుమారు 35 వేల సంచులను నగరంలో ఉచితంగా పంపిణీ చేసి ఆదర్శంగా నిలిచారు.

కాళ్లు నొప్పులైనా

వయస్సు మీద పడుతుండటంతో కాళ్లు నొప్పులు వచ్చాయి. కళ్లు మసకబారినా, శరీరం సహకరించకపోయినా, మిషన్ కుడతానంటూ మధుకాంతా ఉత్సాహం చూపుతున్నారు. దాంతో కుటుంబసభ్యులు ఎనిమిదేళ్ల క్రితం మిషన్‌కు కరెంట్ మోటర్‌ను బిగించారు. ఇప్పటికీ సూదిలో దారం ఎక్కించుకుంటారు. క్లాత్‌లను కొలతలు వేసుకుని కత్తెరతో కట్ చేసి సంచులను, మాస్క్‌లను కుడుతున్నారు. వీటిని ప్రభుత్వ, ప్రయివేటు కార్యాలయాల్లో ఉచితంగా పంపిణీ చేస్తున్న మధుకాంత ' పని చేయకుండా కూర్చోవడం అంటే ఇష్టం లేదు. వందేళ్లు వచ్చినా సరే ...ఏదో ఒక పని చేస్తూనే ఉంటా. అప్పుడే మనసుకు హాయిగా ఉంటుంది' అంటారు.

చెమటకాయలు పోవాలంటే..

వేసవి కాలంలో ప్రతి ఒక్కరు ఎదుర్కొనే అతి ముఖ్యమైన సమస్యల్లో చెమటకాయలు ఒకటి. వీటి కారణంగా చర్మం దురద పెట్టటమే కాకుండా చర్మం మృదుత్వాన్ని కోల్పోతుంది. కొన్ని సహజసిద్ధమైన చిట్కాలను పాటిస్తే చాలా సులభంగా చెమటకాయల నుండి బయట పడవచ్చు.

పెరుగు : చెమట కాయలు ఉన్న ప్రదేశంలో చల్లని పెరుగుని అప్లై చేసి పదిహేను నిమిషాలు ఉంచండి. ఆ తరువాత చల్లని నీటితో కడిగేసి మెత్తగా అద్దండి. పెరుగులో సహజంగా ఉండే యాంటీ బ్యాక్టీరియల్, యాంటీ ఫంగల్ ప్రాపర్టీస్ చెమటకాయలు రాకుండా చేస్తాయి.

రోజ్ వాటర్ : 200 ఎంఎల్ రోజ్ వాటర్‌లో నాలుగు టేబుల్ స్పూన్ల తేనె, 200 ఎంఎల్ ప్యూర్ వాటర్ కలపండి. బాగా కలిపి ఐస్ ట్రేలో పోసి ఫ్రీజ్ చేయండి. ఇవి క్యూబ్స్‌లా అయ్యాక నాలుగైదు క్యూబ్స్ తీసుకుని పల్చని మస్లిన్ బట్టలో చుట్టి చెమట కాయలు ఉన్న ప్రదేశంలో మృదువుగా అద్దాలి. రోజ్ వాటర్ చర్మం పీహెచ్ బ్యాలెన్స్‌ని మెయింటెయిన్ చేస్తుంది. ఎక్కువగా ప్రొడ్యూస్ అయ్యే ఆయిల్‌ని కంట్రోల్ చేస్తుంది.

గంధం : గంధానికి చల్లని ఫుల్ ఫ్యాట్ మిల్క్ కలిపి ఆ మిశ్రమాన్ని చెమట కాయలు ఉన్న ప్రదేశంలో పట్టించి గాలికి ఆరనివ్వాలి. ఆ తరువాత చల్లని నీటితో కడిగేయాలి.

ముల్తానీ మిట్టి : మూడు టేబుల్ స్పూన్ల ముల్తానీ మిట్టిలో రెండు టీ స్పూన్ల పుదీనా పేస్ట్ కలిపి తగినన్ని చల్లని పాలు పోసి స్మూత్ పేస్ట్ తయారు చేయండి. ఈ మిశ్రమాన్ని చర్మం మీద అప్లై చేసి గాలికి ఆరనివ్వండి. ఆ తరువాత చల్లని నీటితో కడిగేయండి.

కలబంద : చెమటకాయలు ఉన్న ప్రదేశంలో కొంచెం కలబంద గుజ్జు రాస్తే త్వరగా తగ్గిపోతాయి. కలబందలో ఆస్ట్రిజెంట్ లక్షణాలు ఉండటం వలన చెమటకాయలు త్వరగా తగ్గటానికి సహాయపడతాయి. అంతేకాకుండా చర్మంపై ఉండే ఇన్‌ఫెక్షన్లను కూడా తగ్గిస్తుంది.

టీ ట్రీ ఆయిల్ : టీ ట్రీ ఆయిల్‌లో యాంటీ బాక్టీరియల్, యాంటీ వైరల్ లక్షణాలు సమృద్ధిగా ఉంటాయి .కొంచెం టీ ట్రీ ఆయిల్‌ను తీసుకుని దానికి కొంచెం నీటిని కలిపి మిశ్రమంగా తయారు చేయాలి. ఆ మిశ్రమంలో కాటన్ బాల్‌ను ముంచి చర్మంపై రాస్తే చెమట కాయలు చాలా త్వరగా తగ్గిపోతాయి.

వెనిగర్ : టిష్యూ పేపర్‌ను తీసుకుని వెనిగర్‌లో ముంచి చెమట కాయలు ఉన్న ప్రదేశంలో అద్దాలి. ఇలా చేస్తే చెమట కాయలు త్వరగా తగ్గిపోతాయి.

లవంగ నూనె : కాటన్ బాల్‌ను తీసుకుని లవంగ నూనెలో ముంచి చెమటకాయలు ఉన్న ప్రదేశంలో రాస్తే చెమట కాయలు తగ్గుముఖం పడతాయి. తరచూ ఇలా చేయడం వల్ల మంచి ఫలితం కనిపిస్తుంది.

ఎన్టీఆర్‌తో పనిచేయాలనుంది ...

'గతేడాది బ్లాక్‌బస్టర్‌గా నిలిచిన ఆర్‌ఆర్‌ఆర్ సినిమాలో సూపర్‌గా కనిపించిన ఆ హీరో ఎవరు? అతడి పేరు ఏంటి? పులులతో కలిసి బోనులో నుంచి ఓ వ్యక్తి బయటకు వస్తాడు కదా! అతడితో కలిసి పని చేయాలనుంది. తను చాలా అద్భుతంగా నటించాడు. ఫిదా అయిపోయా. అయితే అతడికి ఎలాంటి పాత్ర ఇవ్వాలనేదాని గురించి ఆలోచించడానికి కొంత సమయం పడుతుంది' అని అంటున్నారు హాలీవుడ్ డైరెక్టర్ జేమ్స్ గన్.. హాలీవుడ్‌లో 'గార్డియన్స్ ఆఫ్ ది గెలాక్సీ' సినిమాలతో పాపులారిటీ తెచ్చుకున్న ఈ దర్శకుడు తాజాగా తెరకెక్కించిన 'గార్డియన్స్ ఆఫ్ ద గెలాక్సీ వాల్యూమ్' మూడో సీక్వెల్ మే 5న రిలీజ్ కానుంది. ఈ సందర్భంగా ఓ ఇంటర్వ్యూకి హాజరైన ఆయనకు ఏ ఇండియన్ స్టార్‌తో మీరు కలిసి పని చేయాలనుకుంటున్నారు?

'ప్రేమ విమానం' కు మహేశ్ బాబు సపోర్ట్

సంగీత్ శోభన్, శాన్వి మేఘన లీడ్ రోల్స్‌లో నటిస్తున్న జీ 5 వెబ్ ప్రాజెక్ట్ 'ప్రేమ విమానం'. ఈ చిత్రంలో వెన్నెల కిశోర్, అనసూయ భరద్వాజ్, దేవాన్ష్ నామా, అనిరుధ్ నామా, కల్పలత, సుప్రీత్, శైలజప్రియ ఇతర నటీనటులు కీలక పాత్రల్లో నటిస్తున్నారు. న్యూ ఏజ్ లవ్ స్టోరీ నేపథ్యంలో తెరకెక్కుతున్న ఈ ప్రాజెక్ట్ టీజర్‌ను గురువారం హీరో మహేశ్ బాబు లాంచ్ చేస్తున్నట్లు అనసూయ భరద్వాజ్ ట్వీట్ చేసింది. సంతోష్ కట దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రానికి అనూప్‌రూబెన్స్ సంగీతం అందిస్తున్నాడు. జగదీష్ చీకటి కెమెరామెన్. అభిషేక్ పిక్చర్స్, జీ5తో కలిసి ఈ చిత్రాన్ని తెరకెక్కిస్తోంది.

మలయాళ కమెడియన్ మృతి..



మళయాళ నటుడు, కమెడియన్ మముక్కోయా (76) బుధవారం కన్నుమూశారు. ఇటీవల కేరళలోని మలప్పురం జిల్లా వాండూర్‌లో ఓ ఫుట్‌బాల్ టోర్నమెంట్ ప్రారంభోత్సవంలో పాల్గొన్న మముక్కోయా తీవ్ర అస్వస్థతకు గురయ్యారు. దీంతో వెంటనే ఆయనను ఆసుపత్రికి తరలించారు. ఆసుపత్రిలో చికిత్స పొందుతూ గుండెపోటుకు గురవ్వడంతో ఆయన మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. మముక్కోయా మరణవార్త తెలుసుకున్న పలువురు సినీ, రాజకీయ ప్రముఖులు సంతాపం వ్యక్తం చేస్తున్నారు. 1970లో సినీ ఇండస్ట్రీకి పరిచయమైన మముక్కోయా.. మాలీవుడ్‌లో పలు హిట్ చిత్రాల్లో నటించి మంచి కమెడియన్‌గా గుర్తింపు పొందారు.

విశ్వక్‌సేన్ 11వ సినిమా

విశ్వక్ సేన్ నటిస్తున్న 11వ సినిమా రామానాయుడు స్టూడియోస్‌లో పూజా కార్యక్రమాలతో బుధవారం మొదలైంది. స్టూడియోలో విశ్వక్ సేన్ పై చిత్రీకరించిన ముహూర్తపు సన్నివేశానికి నిర్మాత 'దిల్' రాజు క్లాప్ నివ్వగా, నిర్మాత వెంకట్ బోయనపల్లి దర్శకత్వం వహించారు. దర్శకులు వెంకీ అట్లూరి, నిర్మాత రామ్ ఆచంట తమ చేతుల మీదుగా స్క్రిప్ట్ ని చిత్ర బృందానికి అందజేశారు. ఇందులో ఇద్దరు హీరోయిన్స్ కాగా అందులో ఒకరు అంజలి మరొకరు 'డీజే టిల్లు' ఫేమ్ నేహాశెట్టి. రాజమండ్రి పరిసర ప్రాంతాల్లోని చీకటి సామ్రాజ్యం నేపథ్యంలో ఈ సినిమా తెరకెక్కబోతోంది. ఈ పిరియాడిక్ డ్రామా కోసం విశ్వక్ సేన్ మేకోవర్ చేయడం విశేషం. తన పాత్ర ఔచిత్యాన్ని తెలియచేస్తూ ఓపెనింగ్ లో విశ్వక్ సేన్ మీసం మెలేశాడు. మే నెల్లో రెగ్యులర్ షూటింగ్ మొదలు కానున్న ఈ సినిమాకు యువన్ శంకర్ రాజా సంగీతం సమకూర్చుతున్నారు. ఈ చిత్రానికి వెంకట్, గోపి సహ నిర్మాతలుగా వ్యవహరిస్తున్నారు.

నటి సమంతకు గుడి

సినీనటి సమంతపై అభిమానంతో ఏకంగా గుడి కట్టాడు ఓ అభిమాని. బాపట్ల జిల్లా చుండూరు మండలం అలపాడుకు చెందిన తెనాలి సందీప్.. నటి సమంతకు వీరాభిమాని. ఆమె నటనతో పాటు పలు సేవా కార్యక్రమాలను చూసి అభిమానం పెంచుకున్నాడు. ముఖ్యంగా ప్రత్యూష ఫౌండేషన్ ద్వారా చిన్నారులకు గుండె ఆపరేషన్లు చేయించడంలో సమంత చూపిన చొరవకు ఆకర్షితుడయ్యాడు సందీప్. చిన్న పిల్లలకు పునర్జన్మ ఇస్తున్న ఆమెపై అభిమానం రెట్టింపవ్వడంతో గుడి కట్టాలని నిర్ణయించుకున్నాడు. తన ఇంటి ప్రాంగణంలోనే ఆలయ కోసం స్థలం కేటాయించి విగ్రహాన్ని కూడా తయారు చేయించాడు. ప్రస్తుతం విగ్రహానికి, గుడికి తుది మెరుగులు దిద్దే పనులు జరుగుతున్నాయి. ఈ నెల 28వ తేదీన ఆలయం ప్రారంభిస్తున్నట్లు సందీప్ తెలిపారు. ఇప్పటి వరకూ సమంతను నేరుగా చూడలేదని, కేవలం ఆమెపై అభిమానంతోనే గుడి నిర్మిస్తున్నట్లు చెప్పారు.

కోల్‌కతాకు ఊరట

బెంగళూరుపై 21 పరుగుల తేడాతో గెలుపు
జేసన్ రాయ్ అర్ధసెంచరీ

బెంగళూరు: ఐపిఎల్ సీజన్-16లో కోల్‌కతా నైట్‌రైడర్స్‌కు ఊరట లభించింది. వరుసగా నాలుగు మ్యాచుల్లో ఓటమి తర్వాత బుధవారం రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరుపై 21 పరుగుల తేడాతో కోల్‌కతా గెలిచి ఊపిరి పీల్చుకుంది. టాస్ ఓడి తొలిగా బ్యాటింగ్‌కు దిగిన కోల్‌కతా నైట్‌రైడర్స్ జట్టు నిర్ణీత 20 ఓవర్లలో 5వికెట్ల నష్టానికి 200పరుగుల భారీస్కోర్‌ను నమోదు చేయగా.. ఛేదనలో బెంగళూరు జట్టు నిర్ణీత ఓవర్లు పూర్తయ్యేసరికి 8 వికెట్లు కోల్పోయి 179పరుగులే చేయగల్గింది. ఈ గెలుపులో కోల్‌కతా 8 మ్యాచుల్లో మూడో విజయాన్ని నమోదు చేసుకోగా.. బెంగళూరు జట్టు వరుసగా రెండు విజయాల తర్వాత ఓటమిని చవిచూసింది.

ఇక టాస్ గెలిచిన బెంగళూరుజట్టు బౌలింగ్‌ను ఎంచుకొంది. దీంతో కోల్‌కతా ఇన్నింగ్స్‌ను జగదీశన్, జేసన్ రాయ్ ఆరంభించారు. జేసన్ రాయ్ కేవలం 29బంతుల్లో నాలుగు ఫోర్లు, ఐదు సిక్సర్ల సాయంతో 56 పరుగులు చేశాడు. నారాయణ్ జగదీశన్ 29 బంతుల్లో 27 పరుగులు చేశారు. వీరిద్దరు కలిసి తొలి వికెట్‌కు 9.2 ఓవర్లలో 83పరుగులు జతచేశారు. ఈ జోడీని విజయ్ కుమార్ వైశాక్ విడదీశాడు. 10వ ఓవర్ రెండో బంతికి జగదీశన్‌ను, ఆ వెంటనే జేసన్ రాయ్ వికెట్లను విజయ్ కుమార్ పడగొట్టాడు. కెప్టెన్ నితీష్ రాణా 48 పరుగుల వద్ద ఔట్ కావడంతో తృటిలో అర్ధ సెంచరీని మిస్ చేసుకున్నాడు. నితీష్ రాణా 21 బంతుల్లో 3 ఫోర్లు, 4 సిక్సర్ల సాయంతో 48 పరుగులు చేశాడు. వెంకటేష్ అయ్యర్ 26 బంతుల్లో 31 పరుగులు చేయగా.. ఆర్సీబీ బౌలర్లలో హసరంగ, విజయ్ కుమార్ చెరో రెండేసి, సిరాజ్‌కు ఒక వికెట్ లభించింది. ఛేదనలో బెంగళూరు కెప్టెన్ కోహ్లి(54) అర్ధసెంచరీతో రాణించినా.. డుప్లెసిస్(17), మ్యాక్స్‌వెల్(5) నిరాశపరిచారు. వరుణ్ చక్రవర్తికి మూడు, సుయాశ్, ఆండీ రస్సెల్‌కు రెండేసి వికెట్లు దక్కాయి.

ఐపిఎల్‌లో నేడు..
రాజస్తాన్ × చెన్నై
(వేదిక: మొహాలీ; రా.7.30గం॥లకు)

పాయింట్ల పట్టిక

ఫ్రాంచైజీ	మ్యా	గె	ఓ	పా	నె.ర.
చెన్నై	7	5	2	10	+0.66
గుజరాత్	7	5	2	10	+0.58
రాజస్తాన్	7	4	3	8	+0.84
లక్నో	7	4	3	8	+0.54
బెంగళూరు	8	4	4	8	-0.13
పంజాబ్	7	4	3	8	-0.16
కోల్‌కతా	8	3	5	6	-0.02
ముంబయి	7	3	4	6	-0.62
హైదరాబాద్	7	2	5	4	-0.72
ఢిల్లీ	7	2	5	4	-0.96

మ్యా:మ్యాచ్‌లు; గె:గెలుపు; ఓ:ఓటమి; పా:పాయింట్లు; నె.ర: నెట్‌రన్‌రేట్

ఆర్చరీ ప్రపంచకప్ ఫైనల్‌కు జ్యోతి సురేఖ అర్హత

అంటల్యా(టర్కీ): ఆర్చరీ ప్రపంచకప్ ఫైనల్‌కు భారత స్టార్ ఆర్చర్ వెన్నం జ్యోతి సురేఖ అర్హత సాధించింది. బుధవారంతో ముగిసిన ఆర్చరీ ప్రపంచకప్ స్టేజ్-1 పోటీల అనంతరం జ్యోతి సురేఖతోపాటు పెన్నె హీలో, డన్ ఒలారు, జోసెఫ్ సెప్టెంబర్‌లో మెక్సికోలో జరిగే ఆర్చరీ ప్రపంచకప్ ఫైనల్‌కు నేరుగా అర్హత సాధించారు. మిగిలిన బెర్తల భర్తీకి షాంఘై(మే), మెడెల్లిన్(జూన్), పారిస్(ఆగస్ట్)లలో పోటీలు జరనున్నాయి. ఈ అర్హత టోర్నమెంట్‌లు ముగిసిన అనంతరం అగ్రస్థానంలో ఉన్న ఆర్చర్లు నేరుగా ప్రపంచకప్ ఆర్చరీ ఫైనల్ పోటీలకు అర్హత సాధించనున్నారు. నేడు జరిగిన మిక్స్‌డ్ టీమ్ విభాగంలో జ్యోతి సురేఖ-ఓర్ఝూ జోడీ చైనీస్ తైపీకి చెందిన హి-హుయాన్, ఛీ-లున్-చెన్‌పై 158-154పాయింట్లతో గెలిచారు. ఇక మెక్సికోలోని హెర్మోసిల్లో వేదికగా సెప్టెంబర్ 9, 10న ప్రపంచకప్ ఆర్చరీ పోటీలు జరగనున్నాయి.

సింధు, శ్రీకాంత్ శుభారంభం

ఆసియా బ్యాడ్మింటన్ ఛాంపియన్‌షిప్

దుబాయ్: ఆసియా బ్యాడ్మింటన్ ఛాంపియన్‌షిప్‌లో భారత షట్లర్లు పివి సింధు, కిదాంబి శ్రీకాంత్ శుభారంభం చేశారు. బుధవారం జరిగిన తొలిరౌండ్ పోటీలో టోక్యో ఒలింపిక్స్ కాంస్య పతక విజేత పివి సింధు 21-15, 22-20తో చైనీస్ తైపీకి చెందిన హు-వెన్-ఛిపై వరుససెట్లలో నెగ్గింది. ఇక పురుషుల సింగిల్స్‌లో కిదాంబి శ్రీకాంత్ 21-13, 21-8తో బ్రహెయిన్‌కు చెందిన ఇబ్రహీంను చిత్తు చేయగా.. కామన్వెల్త్ క్రీడల స్వర్ణ పతక విజేత లక్ష్యసేన్ 7-21, 21-23తో మాజీ ప్రపంచ ఛాంపియన్ లో-కెన్-యు(సింగపూర్) చేతిలో అనూహ్యంగా ఓటమిపాలయ్యాడు. మరో పోటీలో మాల్విక బన్సోద్ 23-25, 19-21తో ప్రపంచ నంబర్ వన్ క్రీడాకారిణి అకానే యమగుచి(జపాన్) చేతిలో ఓడింది.

డింగ్ లెరెన్ గెలుపు

ఫిడే ప్రపంచ ఛెస్ ఛాంపియన్‌షిప్

అస్టానా(కజకిస్తాన్): ఫిడే ప్రపంచ చెస్ ఛాంపియన్‌షిప్ 12వ రౌండ్‌లో డింగ్ లెరెన్(చైనా) విజయం సాధించాడు. బుధవారం రష్యా గ్రాండ్ మాస్టర్ ఇయాన్ నెపోంనియంచి 34వ ఎత్తులో తప్పిదం డింగ్ లెరెన్‌కు కలిసొచ్చింది. ఈ గేమ్‌లో డింగ్ లెరెన్ 38వ ఎత్తు తర్వాత ఇయాన్ ఓటమిని అంగీకరించారు. 14రౌండ్‌లపాటు సాగే ఫైనల్లో 12వ రౌండ్ ముగిసిన అనంతరం ఇరువురు 6పాయింట్లతో సమంగా ఉన్నారు.

శ్రీలంక 357/1

గాలే: ఐర్లాండ్‌తో జరుగుతున్న రెండో టెస్టులో శ్రీలంక జట్టు భారీ స్కోరు దిశగా పయనిస్తోంది. మూడోరోజు ఆట ముగిసే సమయానికి శ్రీలంక వికెట్ నష్టానికి 357 పరుగులు చేసింది. ఓపెనర్లు నిషాన్ మధుశంక(149బ్యాటింగ్), కెప్టెన్ కరుణరత్నే(115) సెంచరీతో కదం తొక్కారు. ఆ తర్వాత కుషాల్ మెండిస్(83బ్యాటింగ్) కూడా బ్యాటింగ్‌లో మెరిసాడు. టీ విరామం అనంతరం మ్యాచ్‌కు వర్షం అంతరాయం కలిగించింది. వర్షం ఎంతకు తగ్గకపోవడంతో అంపైర్లు 23 ఓవర్లు మిగిలి ఉండగానే మూడోరోజు ఆట ముగిసినట్లు ప్రకటించారు. శ్రీలంక ఓపెనర్లు తొలి వికెట్‌కు 228 పరుగుల రికార్డు భాగస్వామ్యాన్ని నెలకొల్పారు. కరుణరత్నే.. కాంపర్ బౌలింగ్‌లో ఔటయ్యాడు. ఐర్లాండ్ తొలి ఇన్నింగ్స్‌లో 492 పరుగులకు ఆలౌటైన సంగతి తెలిసిందే.

Published and Printed by Mallajosyula Venkata Subrahmanya Sarma on behalf of Prajasakti Printers & Publishers Private Limited from D.No.27-30-4,Akulavari Street,Governorpet, Vijayawada, Krishna Dt., and Printed at Prajasakti Printers & Publishers Private Limited, D.No.14-12-19, Krishna Nagar, Tadepalli (M), Guntur Dt., Editor : Bendi Tulasi Das, Ph : 9490099275, email:editorprajasakthi@gmail.com, RNI Regd.No. 15795/68